అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శనివారం 15-03-2025

సంపుటి : 11 సంచిక : 73 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 14 పేజీలు వెల : 6.50



ఓయూలో హోలీ.. రంగులకేళి



గ్రూప్-3 టాపర్ అర్జున్‌రెడ్డి

ఫలితాల్లో 339.239 మార్కులు

మహిళల్లో అత్యధిక మార్కులు 325.157

జీఆర్ఎల్‌లో 2,49,557 మంది ఎంపిక

ఫలితాలు విడుదల చేసిన టీజీపీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-3 పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్షల ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) శుక్రవారం విడుదల చేసింది. 339.239 మార్కులతో (హా.టి.నెం 2295819138) మెదక్ జిల్లా పాపన్న పేటకు చెందిన అర్జున్‌రెడ్డి టాపర్‌గా నిలిచారు. 331.299 మార్కులతో ...13లో



హోలీ ముసుగులో

గంజాయి అమ్మకాలు

వంద కుల్ఫీ చాక్లెట్లు, 72 గంజా బర్ఫీ స్వీట్లు స్వాధీనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గంజాయి మాఫియాపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నా అది పలు కొత్త మార్గాలను ఎంచుకుని తన దందాను కొనసాగిస్తోంది. రాష్ట్రంలో ఈ అక్రమ వ్యాపారానికి కేంద్రంగా ఉన్న ధూల్‌పేట కార్పొరేట్ హంగులను అందిపుచ్చుకుని తన వ్యాపారాన్ని గుట్టు చప్పుడు కాకుండా నడిపిస్తోంది. తాజాగా ఎక్సైజ్ ...13లో

పారదర్శకతకు పాతర

'స్పెక్ట్రం' వేలానికి ఫుల్‌స్టాప్

- 'నిర్వహణ కేటాయింపు'తో స్టార్‌లింక్‌కు లైన్ క్లియర్
- రెండు దేశీయ కంపెనీలతో కలిసి భారత్‌లోకి ప్రవేశం

ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు ఎలన్ మస్క్‌కు చెందిన అమెరికన్ టెలికమ్యూనికేషన్స్ ప్రొవైడర్ స్టార్‌లింక్‌కు ఎట్టకేలకు అడ్డంకులు తొలగిపోయాయి. భారత్‌లో సేవలు అందించటానికి లైన్ క్లియర్ అయింది. స్పెక్ట్రం వేలం స్థానంలో మోడీ సర్కారు 'నిర్వహణ కేటాయింపు'ను తీసుకురావటం స్టార్‌లింక్‌కు కలిసి వచ్చింది. దీనిపై మొన్నటి వరకు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేసిన భారతీయ దిగ్గజ టెలికాం కంపెనీలు ఎయిర్‌టెల్, జియోలు.. ఇప్పుడు ఈ కేటాయింపులకు ఓకే చెప్పాయి. భారత్‌లో స్టార్‌లింక్‌తో జతకట్టటానికి ముందుకొచ్చాయి. మోడీ యూఎస్ పర్యటనతో స్టార్‌లింక్‌కు మార్గం సుగమమైందని వాదనలు వినిపిస్తున్నాయి.



న్యూఢిల్లీ : భారత్‌లో ఎలన్ మస్క్ స్టార్ లింక్ ప్రవేశానికి అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి. ఇందుకోసం మోడీ సర్కారు తీవ్రంగానే ప్రయత్నాలు చేసింది. మస్క్ కోసం భారత్‌లో ఎప్పటి నుంచో ఉన్న బహిరంగ, పారదర్శక స్పెక్ట్రం వేలంను దూరం పెట్టింది. దాని స్థానంలో 'నిర్వహణ కేటాయింపు'ను తీసుకొచ్చింది. దీంతో స్పెక్ట్రం పొందటం కోసం ఎలాంటి వేలమూ ఉండదు. తాను అనుకున్నవారికి కేటాయించే అవకాశం ప్రభుత్వానికి ఉంటుంది. ఇది భారత్‌లో ప్రవేశానికి స్టార్‌లింక్‌కు దారులు తెరిచినట్టయ్యింది. ఈ విధానం పైన భారత్‌లోని అతిపెద్ద నెట్‌వర్క్ ప్రొవైడర్లు అయిన భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియోలు తొలుత తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేశాయి. ఫిబ్రవరిలో మోడీ యూఎస్ పర్యటన వరకూ ఇదే వాదనను వినిపించాయి. అయితే, మోడీ పర్యటన తర్వాత ఈ రెండూ కంపెనీలూ స్టార్‌లింక్‌తో జతకట్టటానికి ఓకే చెప్పటం గమనార్హం. అనేక నెలలుగా సాగిన చర్చల తర్వాత ఇప్పుడు స్టార్‌లింక్ రాకకు ఈ రెండు నెట్‌వర్క్‌లు ఓకే చెప్పటం చర్చనీయాంశంగా మారింది. స్టార్‌లింక్ ఒక బలీయమైన పోటీదారు అని గతనెలలో భారతీ ఎయిర్‌టెల్ చైర్మెన్ సునీల్ మిట్టల్ ఒక ఇంటర్వ్యూ లో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "ఉపగ్రహ ఆధారిత సేవలకు ప్రాధాన్యతనివ్వటాన్ని కచ్చితంగా తిరస్కరించాలి" అని కొన్ని నెలల క్రితం 'జియో' తన అభిప్రాయాన్ని తెలిపింది.

భారత టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్) ప్రకారం.. భారత్‌లో మొత్తం 94.5 కోట్ల మంది బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్లు ...13లో

మోడీ పర్యటన తర్వాత మారిన సమీకరణాలు


భారత మార్కెట్‌లోకి స్టార్‌లింక్ రాకపై వ్యతిరేకతతో ఉన్న ఈ రెండు దేశీయ సంస్థలు... దానితో భాగస్వామ్యం ఎలా కుదిరిందన్నదానిపై మాత్రం వివరణ ఇవ్వలేదు. అయితే, ఫిబ్రవరిలో భారత ప్రధాని మోడీ యూఎస్ పర్యటన ఇందులో కీలక పాత్ర పోషించిందని ప్రపంచ మీడియా కథనాలు చెప్తున్నాయి. మోడీ తన పర్యటనలో వాషింగ్టన్‌లో ఎలన్ మస్క్‌తో, ఆ తర్వాత అతనితో కలిసి శ్వేతసౌధంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన విషయం విదితమే. దిగుమతులపై అధిక సుంకాలు విధిస్తున్నదని భారత్‌పై డోనాల్డ్ ట్రంప్ ఆరోపణల నేపథ్యంలో మస్క్ స్టార్‌లింక్‌కు ఇది ఒక భారీ విజయమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం

టారీఫ్ జగడాల నడుమ స్టార్‌లింక్ యజమాని అయిన మస్క్‌ను బుజ్జగించటం ద్వారా డోనాల్డ్ ట్రంప్ వద్ద 'శాంతి' కొనుగోలుకు యత్నిస్తున్నారని ప్రధాని మోడీపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. రిపబ్లికన్ అభ్యర్థిగా మరోసారి అమెరికా అధ్యక్ష స్థానానికి పోటీ చేసిన డోనాల్డ్ ట్రంప్ విజయం కోసం ఎలన్ మస్క్ తీవ్రంగా కృషి చేసిన విషయం విదితమే. ఖర్చులను తగ్గించే ఉద్దేశంతో ట్రంప్ ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ(డోజ్)కి మస్క్ నేతృత్వం వహిస్తున్న విషయమూ తెలిసిందే.

మస్క్ టెస్లా కోసం సుంకం తగ్గింపు

మస్క్ కోసం మోడీ ప్రభుత్వం గతంలోనూ సాయం చేసింది. అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం రావటానికి ముందు జనవరిలో ఈ-వాహనాలపై దిగుమతి సుంకాన్ని 70-100 శాతం నుంచి 15 శాతానికి తగ్గించింది. దీంతో భారత్ మార్కెట్‌లో ప్రవేశించటానికి ఎలన్ మస్క్‌కు చెందిన ఎలక్ట్రానిక్ వాహనాల కంపెనీ టెస్లాకు మోడీ సర్కారు మార్గం సుగమం చేసింది. దిగుమతి సుంకాన్ని తగ్గించటంతో భారత మార్కెట్‌లో ప్రవేశించటానికి మస్క్ కంపెనీ సమ్మతి తెలిపింది.



రాజ్యాంగ సమాఖ్యకు

డీలిమిటేషన్ విరుద్ధం

ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కేంద్రం బాధ్యత

పునర్విభజన అంశంపై ఏకాభిప్రాయం తీసుకురావాలి : కేరళ సీఎం పినరయి విజయన్

22న చెన్నై సమావేశానికి విజయన్‌ను ఆహ్వానించిన డీఎంకే

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగ సమాఖ్య సూత్రాలకు విరుద్ధంగా డీలిమిటేషన్ ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. తమిళనాడు ఐటీ మంత్రి పళనివేల్ తియాగ రాజన్, డీఎంకే ఎంపీ తమిళాచి తంగపాండియన్‌లు శుక్రవారం కేరళలోని తిరువనంతపురంలో సీఎం విజయన్‌ను, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎమ్వీ గోవిందన్‌లను వేర్వేరుగా కలిశారు. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం చేసే డీలిమిటేషన్ ప్రక్రియకు వ్యతిరేకంగా ఈ నెల 22న చెన్నైలో నిర్వహించనున్న సమావేశానికి వారిని ఆహ్వానించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆహ్వానపత్రాన్ని వారికి అందజేశారు. తమిళనాడు ప్రభుత్వం చేస్తున్న ఉద్యమానికి పినరయి విజయన్ సంఘీభావం ప్రకటించారు. ఏకపక్షంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ చర్యనైనా ప్రతిఘటించేందుకు, బీజేపీయేతర పాలిత రాష్ట్రాలను ఉమ్మడి వేదికపై ఏకం చేసేందుకు తమిళనాడు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను పినరయి విజయన్ అభినందించారు. ప్రజాస్వామ్యం, సమాఖ్యవాద విలువలను గాలికి వదిలేసి, లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వ ...13లో

రాజకీయ ప్రత్యర్థుల

అణచివేతే లక్ష్యం

13లో

అందుకు కేంద్ర దర్యాప్తు సంస్థల వినియోగం : సీపీఐ(ఎం) ఎంపీ రాధాకృష్ణన్



నారాయణపేట ముడమాల్ 'నిలువురాళ్లకు'

యునెస్కో జాబితాలో చోటు



ముడుమాల్ : తెలంగాణ రాష్ట్రంలోని నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ముడుమాల్‌లోని నిలువురాళ్లకు యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా తాత్కాలిక జాబితాలో చోటు దక్కింది. పారిస్‌లోని యునెస్కో భారతదేశ శాశ్వత ప్రతినిధి బృందానికి ఈ సమాచారం ఇచ్చింది. అశోక శాసన ప్రదేశాలు, 64 యోగిని దేవాలయాలు సహా భారత్‌లోని ఆరు వారసత్వ ప్రదేశాలు యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు సంపాదించినట్టు బృందం పేర్కొంది. ముడుమాల్‌లో ఉన్న ఈ నిలువురాళ్ల ఆదిమ మానవుల ఖగోళ పరిజ్ఞానానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. శిలాయుగంలోనే వాతావరణ ...13లో

ఉక్రెయిన్ సైనికుల ప్రాణాలు కాపాడండి



(ఫైల్)

పుతిన్‌కు ట్రంప్ విజ్ఞప్తి

వాషింగ్టన్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక ప్రకటన చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో చర్చలు జరిపానని, అవి ఫలప్రదంగా జరిగాయన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ సైన్యం ఆపదలో ఉందని చెప్పిన ఆయన.. వారి ప్రాణాలను కాపాడాలని పుతిన్‌ను కోరినట్టు వెల్లడించారు.

"రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో నిన్న ఫలప్రదమైన చర్చలు జరిపాను. భయంకరమైన, రక్తపాతం సృష్టిస్తోన్న ఈ యుద్ధం ఎట్టకేలకు ముగిసే అవకాశం ఉంది. కానీ, ఇదే సమయంలో వేలాది మంది ఉక్రెయిన్ బలగాలను రష్యా సైన్యం చుట్టుముట్టింది. వారంతా ప్రస్తుతం ఆపదలో ఉన్నారు. వారి ప్రాణాలు కాపాడాలని పుతిన్‌ను గట్టిగా అభ్యర్థించా. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఎవ్వరూ చూడని భయంకరమైన ఊచకోతగా మారొచ్చు. వారికి భగవంతుడు అండగా ఉంటాడని ఆశిస్తున్నా" అని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. మరోవైపు అమెరికా ప్రతిపాదించిన 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందంపై పుతిన్ స్పందిస్తూ.. అందుకు అనుకూలంగా మాట్లాడారు. ఈ కాల్పుల విరమణ అనేది శాశ్వత శాంతికి దారితీయాలని, సంఘర్షణలకు మూల కారణాలను పరిష్కరించాలన్నారు. ఇలా స్పందించిన కొన్ని గంటలకే ట్రంప్‌తో సంభాషించినట్టు వెల్లడైంది.

సుప్రీంకోర్టుకు జన్మత: పౌరసత్వం రద్దు

ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై న్యాయపరమైన చిక్కులు

ఫెడరల్ కోర్టు ఆదేశాలు నిలిపివేయండి : ట్రంప్

న్యూయార్క్: జన్మత: పౌరసత్వం రద్దుపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పట్టుదలగా ఉన్నారు. తాజాగా తన ఆదేశాలను ఫెడరల్ కోర్టులు నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. యాక్టింగ్ సొలిసిటర్ జనరల్ సారా హారిస్ ఈ పిటిషన్ సాధారణమైనదని అభివర్ణించారు. మూడు దిగువ ...3లో





లాకప్ డెత్?

పోలీస్ కస్టడీలో వ్యక్తి మృతి

- పోలీసులే కొట్టి చంపారు : కుటుంబీకుల ఆందోళన
- గుండెపోటుతోనే మృతి : సీపీ సాయిచైతన్య
- విచారణ చేపట్టి దోషులను శిక్షించాలి : సీపీఐ(ఎం)
- ఈ ఘటనతో నిజామాబాద్ జిల్లాలో కలకలం

నవతెలంగాణ-కంఠేశ్వర్

పోలీస్ కస్టడీలో ఉన్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. పోలీసులే తీవ్రంగా కొట్టి హింసించడంతో మృతి చెందినట్టు కుటుంబీకులు ఆరోపించారు. అయితే, విచారణలో నేరం అంగీకరించాడని, ఎడమచేతి నొప్పి ఉందంటే ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడే గుండెపోటుతో మృతి చెందినట్టు సీపీ సాయిచైతన్య ప్రకటన విడుదల చేశారు. వ్యక్తి మృతిపై సమగ్ర విచారణ చేపట్టి ...5లో

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి 13లో

'జగిత్యాల' ఘటనపై సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

కాగితాల్లోనే మిగులు విద్యుత్

బయటి నుంచి కరెంటు కొనాల్సిందే

- 2025-26లో డిస్కంల ఆదాయ లోటు రూ.20,151 కోట్లు
- రావల్సిన బకాయిలు రూ.22,622.32 కోట్లు
- దానిలో ప్రభుత్వ శాఖల బకాయిలు రూ.11,756.25 కోట్లు

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు) లెక్కల పుస్తకాల్లో అన్నీ ఘనంగా కనిపిస్తాయి. కానీ వాస్తవంలో అవేవీ అక్కరకు రావు. ముందు చెప్పే లెక్కలకు, ఆ తర్వాత చేసే ఖర్చులకు పొంతన ఉండదు. సామాన్యుడికి ఓ పట్టాన అర్థంకాని సాంకేతిక భాష ఆ సంస్థల్ని ఎప్పుడూ నష్టాల్లోనే ఉన్నట్టు మౌఖిక ప్రచారం చేస్తుంది. కానీ పుస్తకాల్లోని అంకెల్లో మాత్రం లాభాలు ఉంటాయి. ఇదేం చోద్యం అనుకుంటున్నారా? అక్కడంతే... చెప్పేదానికి, చేసేదానికీ పొంతనే ఉండదు. ఆ విచిత్రాలు ఏంటో ఓసారి చూసొద్దాం రండి!!

ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి డిస్కంలకు ప్రభుత్వ శాఖల బకాయిలు

- 1.020.60 కోట్లు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్
- 7,709.54 కోట్లు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు
- 305.21 కోట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్‌టీ ం హెచ్‌టీ)
- 1,666,54 కోట్లు మిషన్ భగీరథ (ఎల్‌టీంహెచ్‌టీ)
- 159.27 కోట్లు ఇతర ప్రభుత్వ శాఖలు
- 895.09 కోట్లు హైదరాబాద్ మెట్రో వాటర్‌బోర్డ్

మొత్తం 11,756.25 కోట్లు



డిస్కంలు చెప్పిన మిగులు విద్యుత్ ఇలా..

డిస్కం	విద్యుత్ లభ్యత (మి.యూ.)	అవసరాలు	మిగులు
ఎస్పీడీసీఎల్	87,065	71,176	15,889
ఎన్పీడీసీఎల్	36,566	23,951	12,615
మొత్తం	1,23,631	95,127	28,504

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ఉత్తర, దక్షిణ ప్రాంతాల విద్యుత్ పంపిణీ సంస్థలు 2025-26 వార్షిక ఆదాయ అవసరాల ప్రతిపాదనల్ని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)కి సమర్పించాయి. దీనిపై స్టేక్ హోల్డర్ల నుంచి అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఆహ్వానించారు. వచ్చిన పిటీషన్లకు డిస్కంలు సమాధానాలు పంపాయి. ఆ సమాధానాలే ఇప్పుడు చిత్ర విచిత్రంగా ఉన్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సం (2025-26)లో ఆదాయ లోటు రూ.20,151 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. అదే సమయంలో రాష్ట్రంలో మిగులు విద్యుత్ అద్భుతంగా ఉంటుందని లెక్కల్లో చూపారు. రాష్ట్రంలో మొత్తం 1,23,631 మిలియన్ యూనిట్ల విద్యుత్ లభ్యత ఉన్నదనీ, దానిలో 95,127 మి.యూ., మాత్రమే వినియోగం అవుతాయనీ, మరో 28,504 మి.యూ., మిగులు ఉంటుందని లెక్కలు కట్టారు. దాదాపు 30 శాతం మిగులు విద్యుత్ ఉంటే, ఆదాయలోటు ...6లో

బాయ్‌కాట్

అమెరికా

యూఎస్ వస్తువుల బహిష్కరణ ఉద్యమం

ట్రంప్ విధించిన సుంకాలపై వ్యతిరేకత



వాషింగ్టన్: కెనడా, మెక్సికో, చైనాపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు కాస్త బెడిసి కొడుతున్నాయి. పన్నులు పెంచుతున్నట్టు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు మళ్లీ యూటర్న్ తీసుకుంటున్నారు. మరోవైపు అమెరికా వస్తువులకు వ్యతిరేకంగా 'బాయ్‌కాట్ అమెరికా' పేరిట ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమానికి దారితీశాయి. గడిచిన వారం రోజులుగా దీనిపై గూగుల్‌లో ట్రెండింగ్ అవుతున్నది. అమెరికా వస్తువుల బహిష్కరణ కోసం అనేక దేశాలు ఫేస్‌బుక్ గ్రూపులను కూడా నిర్వహిస్తున్నాయి. డెన్మార్క్‌కు చెందిన పాక్షిక స్వయం ప్రతిపత్తి ప్రాంతం గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవాలన్న ట్రంప్ ప్రయత్నాలు కూడా ఈ వ్యతిరేకతకు ఓ కారణంగా చెప్పవచ్చు. డెన్మార్క్‌కు చెందిన ఫేస్‌బుక్ గ్రూపులో దాదాపు ...13లో



మండే ఎండలు

8 జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం

పలు జిల్లాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 40.4 డిగ్రీలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతున్నది. పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. వచ్చే రెండు, మూడు రోజుల పాటు రాష్ట్రంలో రెండు నుంచి నాలుగు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందనీ, అదే సమయంలో పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే పరిస్థితులున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న ప్రకటించారు. వడగాల్పుల వీచే అవకాశమున్న జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలున్నాయి. వచ్చే రెండు రోజుల పాటు ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, కొమ్రంభీమ్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీల వరకు నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్‌లో వచ్చే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండే సూచనలున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 23.6 డిగ్రీలు నమోదయ్యే సూచనలున్నాయి.



నిలదొక్కుకున్నాం... టీడీపీని నిలబెట్టాం

- మార్పు కోసమే రాజకీయాల్లోకి వచ్చాను
- 'జనసేన జయకేతనం' ఆవిర్భావ సభలో పవన్ కల్యాణ్

కాకినాడ : ఓడినా అడుగులు ముందుకు వేశామని, అధికారం కోసం కాకుండా మార్పు కోసం రాజకీయాల్లోకి వచ్చానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం శివారు చిత్రాడలో శుక్రవారం జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సభలో ఆయన మాట్లాడారు. అన్నీ ఒక్కడినే అయి 2014లో జనసేన పార్టీని స్థాపించానన్నారు. 2018 పోరాట యాత్ర చేశానని తెలిపారు. ఓటమి భయం లేదు కాబట్టే 2019లో పోటీ చేశామన్నారు. ఓడినా అడుగు ముందుకే వేశామని, మనం నిలదొక్కుకోవడమే కాకుండా నాలుగు దశాబ్దాల టీడీపీ పార్టీని కూడా నిలబెట్టామని అన్నారు. 2019లో ఓడినప్పుడు ఎన్నో అవమానాలను చూశామని పేర్కొన్నారు. వీర మహిళలను సైతం హింసించారన్నారు. ఇదేం న్యాయమని అడిగితే కేసులు పెట్టారని వివరించారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడిని అక్రమ కేసుల్లో బంధించారని విమర్శించారు. అసెంబ్లీ గేటును కూడా తాకలేవు అని ఛాలెంజ్ చేసిన వారి తొడలను బద్దలుగొట్టామన్నారు. దేశమంతా చూసేలా వంద శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించి ఎన్డీఏ ప్రభుత్వాన్ని నిలబెట్టామని తెలిపారు. వంద శాతం స్ట్రైక్ రేట్‌కు జనసేన సిద్ధాంతాలే కారణమన్నారు. హర్యానాలో ఎన్డీఏ కోసం ప్రచారం చేశానని, 95 శాతం సీట్లు గెలిచామని తెలిపారు. దేశంలో తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన జనసైనికులకు అభిమానులకు వారివారి ప్రాంతీయ భాషలో నమస్కారాలు తెలిపారు. బహుభాషా విధానమే దేశానికి మంచిదన్నారు. తాను సినిమాలను దృష్టిలో పెట్టుకుని ఎదగలేదని, సమాజాన్ని దేశాన్ని దృష్టిలో పెట్టుకొని ఎదిగానని తెలిపారు.

2006లో బహుజన సిద్ధాంతాల కోసం అంబేద్కర్ ఆశయాల కోసం ఆలోచించే ప్రస్తుత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీపతిరాముడు రాజకీయాల్లోకి రావాలని కోరారని, తనకు ఇంకా అంత మెచ్యూరిటీ రాలేదని ఆనాడు తెలిపానన్నారు. 450 మంది జనసైనికులు సినిమాలను కాకుండా పార్టీ సిద్ధాంతాలను నమ్మి వివిధ కారణాలతో చనిపోయారని, వారందరి కుటుంబాలను పార్టీ తరఫున ఆదుకున్నామని తెలిపారు. గద్దర్‌తో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. సగటు మధ్యతరగతి మనిషిగా బతకాలన్నదే తన కోరికని తెలిపారు. రాజకీయాల్లోకి వస్తాననిగానీ, సినిమాల్లోకి వస్తానని తానూ కూడా ఊహించలేదన్నారు. ప్రజా సమస్యలపై నిలబడేలా చేసింది తనలో భావ తీవ్రత అని తెలిపారు. చేగువేరాలో మానవత్వాన్ని చూసి ఇష్టపడ్డానన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడగలగడం తన ఆదర్శమని తెలిపారు. చిన్నతనం నుంచి ఈ క్షణం వరకు ప్రతి అంశాన్ని నేర్చుకుంటూనే ఉన్నానన్నారు. మనం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్నామని, వారిని 11 సీట్లకు పరిమితం చేశామని పేర్కొన్నారు. ఈ సభ వేదిక కోసం కష్టపడిన పారిశుధ్య సిబ్బందికి ముందుగా ధన్యవాదాలు తెలిపారు .నాయకులు, కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు, ఆవిర్భావ దినోత్సవాన్ని ముందుండి నడిపిన మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు జనసేన ఎంపీలు తదితరులు పాల్గొన్నారు.

అడక్కుండానే వరాలిచ్చే వాడు పవన్ : నాగబాబు

దేవుడు అడిగితేనే వరాలు ఇస్తాడని, పవన్ కల్యాణ్ అడగకుండానే వరాలిస్తాడని ఆయన సోదరుడు కె.నాగబాబు అన్నారు. తనకు ఎంఎల్‌సీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నోటి దురుసున్న నేతకు ప్రతిపక్ష హోదా కూడా దొరకలేదన్నారు. తర్వాత అధికారం మాదే అంటూ జగన్ కలలు కంటున్నారని విమర్శించారు. మరో 20 ఏళ్లు జగన్ కలలు కంటూనే ఉండాలని సలహా ఇచ్చారు.

రాష్ట్రానికే కాదు... దేశానికీ ఉపయోగపడేలా పవన్ ఎదగాలి : నాదెండ్ల మనోహర్

రాష్ట్రానికే కాదు... దేశానికీ ఉపయోగపడేలా పవన్ ఎదగాలని జనసేన పార్టీ పిఎసి చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకాంక్షించారు. ఎన్ని అవమానాలు ఎదురైన జనసేన ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడిందన్నారు. జనసేన ఎప్పుడూ సామాన్యుల పక్షానే ఉంటుందని తెలిపారు. ప్రశ్నించే స్థాయి నుంచి పరిష్కరించే స్థాయికి మనం ఎదిగామన్నారు. అధికారులతో కలిసి ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా జనసైనికులు చూడాలని కోరారు.

సభాప్రాంగణం వద్ద తోపులాట

ఆవిర్భావోత్సవ సభలో తోపులాట చోటుచేసుకుంది. వీరమహిళలు ఉన్న ప్రాంగణంలోకి కార్యకర్తలు దూసుకురావడంతో ఒక మహిళా కానిస్టేబుల్, మరో ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

బైక్‌లపై విన్యాసాలు

జనసేన ఆవిర్భావ జయకేతనం సభకు వచ్చిన యువకులు బైకులపై విన్యాసాలు చేస్తూ కేరింతలు కొట్టారు. జాతీయ రహదారిపై మితిమీరిన వేగంతో తిరుగుతూ హల్‌చల్ చేశారు. ఒకే బైకుపై ముగ్గురు, నలుగురు యువకులు ఎక్కి విన్యాసాలు చేశారు.

ప్రయాణికునిపై దాడి

216వ నెంబర్ జాతీయ రహదారికి ఒక పక్కనే వాహనాలను పార్కింగ్ చేశారు. దీంతో, ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఒక ద్విచక్ర వాహన చోదకునిపై జనసేన కార్యకర్త కర్రతో దాడి చేశాడు. అడ్డుగా ఉన్న వాహనాన్ని తీయాలని కోరినందుకు ఆగ్రహంతో దాడికి తెగబడ్డారు. తోటివారు కలుగజేసుకుని అడ్డుకున్నారు.

పోలీసులతో వాగ్వాదం

సభకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా జనం తరలి వచ్చారు. పోలీసులు పాసులు తనిఖీ చేసి లోపలికి పంపే ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో అక్కడికి భారీగా చేరుకున్న జనసైనికులు ఒక్కసారిగా సభ ప్రాంగణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో జనసైనికులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

వెల్లువెత్తిన 'ఉక్కు' నిరసనలు

- సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్
- ప్లాంట్ అభివృద్ధికి ఉపయోగపడని ప్యాకేజీ
- కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక



విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు ఆపాలని, కార్మిక నేతలకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి పిలుపు మేరకు ఆందోళనలు నిర్వహించారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఎఐసిసిటియు తదితర కార్మిక సంఘాలు, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ నాయకుల హాజరై మద్దతు తెలిపారు.

విశాఖలో నిరసనలు హోరెత్తాయి. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలోని దీక్షా శిబిరానికి పెద్ద ఎత్తున కార్మికులు తరలివచ్చి నిరసన తెలిపారు. కార్మికులనుద్దేశించి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, రామస్వామి, రమణమూర్తి, ఎన్.రామారావు, నీరుకొండ రామచంద్రరావు, దొమ్మేటి అప్పారావు, డి.సురేష్‌బాబు, సిహెచ్.సన్యాసిరావు, పరంధామయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు నమ్మి రమణ, మంత్రి రవి, వంశీ, అప్పారావు మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామన్నారు. కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమాన్ని నిర్బంధాలతో అణచలేరన్నారు. స్టీల్ కార్మికులు, తెలుగు రాష్ట్ర ప్రజల ఉమ్మడి పోరాటంతో మోడీ సర్కారు ప్యాకేజీని ప్రకటించినప్పటికీ దానిలో ఒక్క రూపాయి కూడా స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికిగానీ, ఉపాధి కల్పనకుగానీ, ఉత్పత్తి వ్యయానికిగానీ, కార్మికుల వేతనాలకుగానీ వినియోగించకుండా కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం శోచనీయమన్నారు. కార్మికుల సంఖ్య తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడం, దానిని స్టీల్ యాజమాన్యం గుడ్డిగా అమలు చేయడం తగదన్నారు.

విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని గురజాడ విగ్రహం వరకూ నిరసన ప్రదర్శన, అక్కడి కూడలిలో మానవహారం నిర్వహించారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు మాట్లాడుతూ ఉక్కు కార్మిక నేతలపై గురువారం రాత్రి నుంచీ నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని ఖండించారు. విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని టిడిపి కూటమి నాయకులు విశాఖ ఉక్కు పరిరక్షణకు గత ఎన్నికల ముందు, ఆ తర్వాత ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణాల బలిదానంతో తెలుగు ప్రజలు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సాధించుకున్నారని తెలిపారు. ఎన్‌డిఎ కూటమి నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్, అసెంబ్లీ తీర్మానాల ద్వారా తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలోని విశాఖ ఉక్కు పరిరక్షణకు ప్రజలు, ట్రేడ్ యూనియన్లు దీర్ఘకాలంగా పోరాడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. పైగా, అనకాపల్లిలో మిట్టల్ కంపెనీ ఆధ్వర్యాన ప్రైవేట్ స్టీల్ ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోందని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు పరోక్షంగా నష్టం కలిగిస్తోందని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు రాజకీయలకు అతీతంగా అన్ని తరగతుల ప్రజానీకం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ 'ఉక్కు' ఉద్యమానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్‌బాబు తదితరులు ప్రసంగించారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, ఎఐటియుసి నగర అధ్యక్షులు సాంబశివరావు అధ్యక్షత వహించారు. కృష్ణా జిల్లా గుడివాడ ఆటో నగర్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ. ఏలూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం, బాపట్ల, ప్రకాశం జిల్లా ఒంగోలు, వైఎస్‌ఆర్ జిల్లా కడప, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, పల్నాడు జిల్లా నరసరావుపేట, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం తదితర ప్రాంతాల్లో నిరసనలు తెలిపారు.

ఏపీలో రానున్నది భారాల కాలం!

- రూ.13 వేల కోట్లు లక్ష్యంగా పన్నులు, సెస్‌ల ప్రతిపాదన
- తెరపైకి లాటరీలు, ఆన్‌లైన్ గేమింగ్
- భారీగా వృత్తి పన్ను పెంపు
- మద్యంపై మూడో సేల్స్ పాయింట్ వ్యాట్ దరువు
- వినోదం కూడా మోతే! శ్రీ జోరుగా ప్రభుత్వ కసరత్తు

అమరావతి : ప్రజలపై భారం ఉండదు... సంక్షేమమే మా విధానం అని ఒక వైపు చెబుతూనే మరోవైపు ప్రజలపై భారీగా పన్నులు, సెస్‌లతో ఆర్థిక భారం మోపడానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆర్థికశాఖ కూడా ఈ దిశగా ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధం చేసినట్లు సమాచారం. దీంతో రానున్నది పన్నుల కాలమేనన్న అభిప్రాయం అధికారవర్గాల్లో వినిపిస్తోంది. ఇప్పటి వరకు వస్తున్న ఆదాయాన్ని మరింతగా పెంచుకునేందుకు కొత్త మార్గాలను అన్వేషించాలని కొంతకాలంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థికశాఖతోపాటు, ఇతర ఆదాయ వనరుల శాఖలను పదేపదే ఆదేశిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ఏటా అదనంగా రూ.13 వేల కోట్ల మేర ఆదాయం రాబట్టేందుకు ఆర్థికశాఖ ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. ఇంత భారీస్థాయిలో అదనపు ఆదాయం లక్ష్యంగా ప్రతిపాదనలను రూపొందించడం సచివాలయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో నిషేధించిన లాటరీల నిర్వహణ కూడా ఈ ప్రతిపాదనల్లో ఉంది. దీంతో ఏదో రూపంలో లాటరీలను మళ్లీ తీసుకురానున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎపి లాటరీస్ విధానం ద్వారా మూడు వేల కోట్లు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. దీనిద్వారా ఆదాయాన్ని సమకూర్చు కోవాలంటే నిబంధనలు మార్పు చేయాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. త్వరలోనే ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలున్నా యని వారు చెబుతున్నారు. ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా మరో రూ.1,400 కోట్లు రాబట్టాలని యోచిస్తున్నారు. దీనికి సంబంధించిన అంశం ప్రస్తుతం హైకోర్టులో విచారణ దశలో ఉంది. ఈ నెల 26న మరోసారి హైకోర్టులో విచారణ జరగనుంది. హైకోర్టు తీర్పు తరువాత ఈ దిశలో అడుగులు పడే అవకాశం ఉందని సమాచారం. రాష్ట్రానికి ఎస్‌జిఎస్‌టిగా వస్తున్న ఆదాయంలో వినియోగదారుపై ఒక శాతాన్ని సెస్‌గా వసూలు చేయాలని కూడా ఆర్థికశాఖ అధికారులు ప్రతిపాదించారు. దీనివల్లే రూ.4,700 కోట్లు సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. ఇటీవల కేంద్రం నేతృత్వంలో జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో కూడా దీనిపై చర్చ జరిగింది. దీనిపై మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటుచేయాలని కూడా కేంద్రం నిర్ణయించడం విశేషం.

పేదలపై వినోదం భారం

స్థానిక సంస్థల పరిధిలో నివాసం ఉంటున్న జనంపై వినోదపు పన్ను భారం పడనుంది. దీనిద్వారా ఏకంగా రూ.2,300 కోట్లు వరకు ఆర్జించాలని ప్రభుత్వం యోచిస్తోంది. సినిమా హాళ్లు, పార్కులు, పర్యాటక రంగాలు, వినోదాన్ని అందించే ఇతర రంగాల్లో భారీగా పన్నులు, రుసుములు పెంచే యోచన ఉన్నట్లు ఈ ప్రతిపాదనల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే దీనిపై నమూనా నియమావళిని కూడా సిద్ధం చేసేసారు. ప్రస్తుతం ఇది న్యాయ శాఖ పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది.

మద్యంపై మరింతగా...


ఇప్పటికే అదనపు రిటైల్ వ్యాట్‌ను ప్రయోగిస్తున్న ప్రభుత్వం కొత్తగా మద్యం అమ్మకాలపై రెండు, మూడో పాయింట్ల వద్ద కూడా వ్యాట్‌ను వేయాలని నిర్ణయించింది. ఈ అంశంపై ఇప్పటికే ఎక్సయిజ్ శాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం కూడా జరిగినట్లు తెలిసింది. దీనిని అమలు చేసేందుకు ఉన్న అవకాశాలపై నివేదిక ఇవ్వాలని కూడా ప్రభుత్వం ఆదేశించడం విశేషం. రూ.1300 కోట్లను ఈ విధంగా ఖజానాకు జమచేయాలని ప్రతిపాదించారు.

భారీగా వృత్తి పన్ను పెంపు

వృత్తి పన్ను చెల్లింపుదారులపై భారీగా భారం మోపతున్నారని సమాచారం. వివిధ వృత్తులను నిర్వహించుకుంటున్న వారినుంచి ఇప్పటివరకు రూ.2,500 వరకు వసూలు చేస్తుండగా, ఇప్పుడు దానిని ఏకంగా రూ.12 వేల నుంచి రూ.18 వేలకు పెంచేలా చూడాలని భావిస్తున్నారు. దీనిపై రెవెన్యూ శాఖకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి లేఖ వెళ్లినట్లు తెలిసింది. ఉన్న వృత్తి పన్నును పెంచేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కూడా నిర్దేశించడం విశేషం. విజయవాడ, విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్లు వసూలు చేస్తున్న వృత్తి పన్నును ఇకపై నేరుగా వాణిజ్య పన్నుల శాఖకు బదిలీ చేయాలని నిర్ణయించారు. ఇలా వృత్తి పన్ను ద్వారా రూ.400 కోట్లు వరకు వస్తాయని అంచనా వేస్తున్నారు. దీనిపై కూడా ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరుకున్నాయని, త్వరలోనే అధికారిక ఉత్తర్వులు కూడా జారీ అవుతాయని అధికారులు చెబుతున్నారు.

స్థానిక సంస్థలు బలహీనం

ఇన్నాళ్లూ స్థానిక సంస్థలకు ఆదాయ వనరుగా ఉన్న వృత్తి పన్నును ఇకపై నేరుగా వాణిజ్య పన్నుల శాఖకు బదలాయిస్తే ఆ మేరకు ఆయా స్థానిక సంస్థలు బలహీనపడే ప్రమాదం కూడా ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటివరకు తమకు వచ్చే నిధులతో విశాఖ, విజయవాడల్లో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఆ నిధులు ప్రభుత్వ ఖజానాకు నేరుగా వెళ్లిపోతే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకం. దీంతో ఈ



లోటును భర్తీ చేసుకునేందుకు ఆయా కార్పొరేషన్లలో కొత్త పన్నులు వేసే ప్రమాదం కూడా ఉంటుందన్నది ఒక అంచనా.నిర్దేశించడం విశేషం. విజయవాడ, విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్లు వసూలు చేస్తున్న వృత్తి పన్నును ఇకపై నేరుగా వాణిజ్య పన్నుల శాఖకు బదిలీ చేయాలని నిర్ణయించారు. ఇలా వృత్తి పన్ను ద్వారా రూ.400 కోట్లు వరకు వస్తాయని అంచనా వేస్తున్నారు. దీనిపై కూడా ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరుకున్నాయని, త్వరలోనే అధికారిక ఉత్తర్వులు కూడా జారీ అవుతాయని అధికారులు చెబుతున్నారు.

స్థానిక సంస్థలు బలహీనం

ఇన్నాళ్లూ స్థానిక సంస్థలకు ఆదాయ వనరుగా ఉన్న వృత్తి పన్నును ఇకపై నేరుగా వాణిజ్య పన్నుల శాఖకు బదలాయిస్తే ఆ మేరకు ఆయా స్థానిక సంస్థలు బలహీనపడే ప్రమాదం కూడా ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటివరకు తమకు వచ్చే నిధులతో విశాఖ, విజయవాడల్లో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఆ నిధులు ప్రభుత్వ ఖజానాకు నేరుగా వెళ్లిపోతే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకం. దీంతో ఈ లోటును భర్తీ చేసుకునేందుకు ఆయా కార్పొరేషన్లలో కొత్త పన్నులు వేసే ప్రమాదం కూడా ఉంటుందన్నది ఒక అంచనా.

ప్రభుత్వానికి కొత్త ఆదాయ మార్గాలు ఇవే

అంశం	మొత్తం (రూ.కోట్లలో)
ఎస్‌జిఎస్‌టిపై 1 శాతం సెస్	4,700
ఆంధ్రప్రదేశ్ లాటరీ	3,000
ఆన్‌లైన్ గేమింగ్	1,400
వినోదపు పన్ను పెంపు	2,300
మద్యంపై 2, 3 పాయింట్లలో వ్యాట్	1,300
వృత్తి పన్ను పెంపు	400
మొత్తం	13,100

జగదీశ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయండి

పోలీస్‌స్టేషన్‌లో సతీశ్, మేరీ మాదిగల ఫిర్యాదు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అవమానపరిచిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ నేత దేవని సతీష్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక మహిళా అధ్యక్షులు మేరీ మాదిగ, పాలడుగు శ్రీనివాస్, రాంచందర్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జగదీశ్‌రెడ్డిపై వారు ఫిర్యాదు చేశారు. కొన్ని దశాబ్దాలుగా అన్ని కులాలకు చెందిన నాయకులు స్పీకర్లుగా పని చేశారనీ, ఏ ఒక్క ఎమ్మెల్యే ఏనాడూ ఎవర్నీ ఉద్దేశించి ఈ విధంగా మాట్లాడలేదని గుర్తు చేశారు. 'అధ్యక్ష మీ మాటల్ని కూడా నేను అడుగుతా. అధ్యక్ష మీరు కూడా మాలాంటి సభ్యులే. మీకు ఎంత అధికారం ఉందో మాకూ అంతే. మేం ఎన్నుకున్న వ్యక్తి మీరు' అంటూ' అవమానకరంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడారని పేర్కొన్నారు. అసెంబ్లీ రికార్డ్స్ పరిశీలించిన ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.

బీఆర్‌ఎస్‌వీ నేతలపై కేసు నమోదు చేయాలి : డీజీపీకి చనగాని దయాకర్ లేఖ

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్‌వీ నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలను సుమోటోగా తీసుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ కోరారు. శుక్రవారం ఈమేరకు ఆయన డీజీపీకి లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. కేటీఆర్ పదే పదే పిచ్చి కుక్క అంటూ సంబోధించారని, తక్షణమే ఆ పదాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు హద్దు మీరి ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో పోస్టులను పరిశీలించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఓయులో దిష్టి బొమ్మల దహనాన్ని పూర్తిగా నిషేధించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాజ్‌కోట్‌లో అగ్ని ప్రమాదం

- ముగ్గురు సజీవదహనం



రాజ్‌కోట్ : గుజరాత్‌లోని రాజ్‌కోట్ పట్టణంలో ఒక భవనంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు సజీవదహనమయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం ఉదయం అట్లాంటిస్ భవనంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ సమాచారం తెలిసినవెంటనే అగ్నిమాపక బృందాలు అక్కడకు చేరుకున్నాయి. మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడయిందని ఎస్‌పి బిజె చౌదరి తెలిపారు.

NOTICE

Bharat Petroleum

Land belongs to Shakeel Ali Khan 40 Feet Wide Road Land belongs to Shakeel Ali Khan Land belongs to Shakeel Ali Khan HRT: NRO-25 Mr. Muqtar Ali Khan 9-8-193/3, Bada Bazar, Golkonda QILA, Hyderabad Mobile: 8686125963 Email ID: rizwankhamrk72789@gmail.com Dear Sir/Madam, Sub: Proposed MS/HSD Regular Retail Outlet Dealership at Location: Shaikpet To Alijapur Via 7 Tombs Road On Either Side, District: Hyderabad, State: Telangana, Category: Open CC (Regular). Please arrange to publish the below mentioned Notice for publication in leading English and Telugu Newspaper and submit us two full set of the Newspapers for our records. Please note, the cost of publication of the Notice shall be borne by you. BHARAT PETROLEUM CORPORATION LIMITED (BPCL), a Company incorporated under the Indian Companies Act 1913 is intending to take on lease the vacant land admeasuring 650 Square Metres at Survey No. 305, of Village: Qila Mohammad Nagar, Mandal: Golconda, District: Hyderabad, State: Telangana, bounded on the North South: East West: From its owner and titleholders Shakeel Ali Khan S/o. Late Ibrahim Ali Khan for a period of 20 years. If any person other than Shakeel Ali Khan S/o. Late Ibrahim Ali Khan is having any right or claim in any manner over the said property, the same may be intimated to BPCL at the following address within 7 days from today:

Territory Manager (Retail), Hyderabad Bharat Petroleum Corporation Limited Hyderabad Territory Office, Post Bag No. 4, PO: HCL, Food Corporation of India Road, Cherlapally, Hyderabad-500051.

ఏపీలో రక్తమోడిన రహదారులు

వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మంది దుర్మరణం



అమరావతి : రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులు రక్తమోడుతున్నాయి. శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది దుర్మరణం చెందారు. వారిలో దంపతులు ఉన్నారు. పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని పెట్రోల్ బంకు వీధిలో నివాసముంటున్న సయ్యద్ హుస్సేన్ (27) గ్రానైట్ లారీతో బెంగళూరు నుంచి రాజమండ్రికి బయలుదేరారు. కర్ణాటక రాష్ట్రం ఆలేహళ్లికి చెందిన భాస్కర్ (35) తన లారీలోని సోలార్ విడి పరికరాలను కడపలో అన్‌లోడ్ చేసి తిరిగి బెంగళూరుకు బయలుదేరారు. రెండు లారీలు కురబలకోట మండలం తానామిట్ట వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్లు సయ్యద్ హుస్సేన్, భాస్కర్ ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు.

నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన దంపతులు చలమయ్య (58), లక్ష్మీదేవి (54) వైఎస్ఆర్ జిల్లా మైదుకూరులో నివాసం ఉంటున్నారు. కేశలింగాయపల్లెలోని పొలం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై దంపతులిద్దరూ ఇంటికి పయనమయ్యారు. మార్గమధ్యంలో గొర్రెలు అడ్డురావడంతో ముందు వెళ్తున్న లారీ సడెన్‌గా బ్రేక్ వేసింది. లారీ వెనుక ద్విచక్ర వాహనంపై వస్తున్న వారు కూడా ఆగారు. అయితే వారి వెనుక వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. రెండు లారీల నడుమ దంపతులిద్దరూ ఇరుక్కుపోయి అక్కడికక్కడే మరణించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి వద్ద జాతీయ రహదారి నిర్వహణా పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనాలు పక్క నుంచి వెళ్లాలని సూచిస్తూ నిలిపి ఉంచిన లారీని ఏలూరు వైపు నుంచి తణుకు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. కారులో చిక్కుకున్న వారిని అతికష్టం మీద బయటకు తీశారు. కారు నడుపుతున్న భోగిళ్ల వెంకట సత్య సురేన్ (37), ఆయన భార్య నవ్య (34) అక్కడికక్కడే మరణించారు. కుమార్తె భోగిళ్ల వాసవి కృష్ణ (5) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుల బంధువు ఉప్పులూరి శ్రీరమ్య తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఓ పూజా కార్యక్రమం నిమిత్తం హైదరాబాద్ నుంచి తమ స్వస్థలం అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామానికి చెందిన కోట వరప్రసాద్ (50), చీపురుపల్లి శివకృష్ణ (29) బొలెరో వాహనంలో చేప పిల్లల లోడ్‌తో చల్లపల్లి నుంచి బందరు వెళ్తున్నారు. అసోం నుంచి సరుగు బోదుల లోడుతో చీరాల వెళ్తున్న లారీ... మార్గమధ్యలో కృష్ణా జిల్లా ఘంటసాల మండల పరిధిలోని యందుకుదురు శివారు జీలగలగండి వద్ద లారీని బొలెరో వాహనం ఢీకొట్టింది. బొలెరో వాహనంలోని వరప్రసాద్, శివకృష్ణ అక్కడికక్కడే మతి చెందారు.

లాంఛనప్రాయంగా స్వాధీనతా ప్రకటన

ICICI Bank

బ్రాంచ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్, బొమ్మనహళ్లి హోసూర్ మెయిన్ రోడ్డు, బెంగళూర్-560068.

క్ర. సం.			డిమాండ్ నోటీసు తేదీ / డిమాండ్ నోటీసులో మొత్తం	బ్రాంచ్ పేరు
1.	హెచ్ఎఫ్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ... 004005018089	...	11, నవంబర్, 2024. రూ. 43,82,914.25/-	హైదరాబాద్ & ఖమ్మం

తేది: 15,మార్చి, 2025
ప్రదేశం: హైదరాబాద్ & ఖమ్మం

అధీకృత సంతకందారు
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ కొరకు



(ఫైల్)

కేంద్రానికి వ్యతిరేకంగా 21న ఆశావర్కర్ల ఆందోళనలు

రూ.26 వేలు కనీస వేతనం, క్రమబద్ధీకరణ, పెన్షన్ ప్రధాన డిమాండ్లు : ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 21న దేశవ్యాప్త ఆందోళనలకు ఆశావర్కర్స్ అండ్ ఫెసిలిటేటర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఫెడరేషన్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీపీ ప్రేమ, మధుమిత బందోపాధ్యాయ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఆశా వర్కర్స్‌ను క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేయనున్నట్టు వారు పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఎంకు బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, వివిధ రాష్ట్రాలకు పెండింగ్‌లో ఉన్న కేంద్ర వాటా నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల్లో ఒకేలా పని పరిస్థితులు ఉండేలా చూడాలని కోరారు.

పార్లమెంట్‌లో కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా ఆశావర్కర్ల వేతనాల పెంపుపై స్పష్టమైన హామీ ఇవ్వలేదని పేర్కొన్నారు. ఆశా కార్యక్రమం అమల్లోకి వచ్చి 20 ఏండ్లు పూర్తవుతుందని, దాన్ని కూడా ఆయన ప్రస్తావించలేదన్నారు. కార్మికుల పని పరిస్థితులు, కనీస వేతనాలు, పెన్షన్ గురించి మంత్రి ఏమీ మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. 45, 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల మేరకు ఆశా కార్మికులతో సహా వర్కర్లను వాలంటీర్ల స్థానంలో కార్మికులుగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ వంటి ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించాలన్నారు. ఈ నెల 21న దేశవ్యాప్త నిరసనా కార్యక్రమాలతో పాటు కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేయనున్నామని పేర్కొన్నారు. భవిష్యత్ పోరాటాలకు ఏప్రిల్ 12న న్యూఢిల్లీలో జాతీయ కన్వెన్షన్ నిర్వహిస్తామన్నారు.

కేంద్రం రూ. 2150 కోట్లు ఇవ్వడం లేదు


సర్వశిక్ష అభియాన్‌కు సర్కారే నిధులు సమకూర్చింది : తమిళనాడు బడ్జెట్‌లో మంత్రి



చెన్నై: హిందీ భాష వివాదం వల్ల కేంద్ర పథకమైన సర్వశిక్ష అభియాన్ కింద..తమకు రావాల్సిన 2150 కోట్ల నిధుల్ని రిలీజ్ చేయడం లేదని తమిళనాడు ఆర్థిక మంత్రి తెన్నరాసు ఆరోపించారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ అమలు విషయంలో తమిళనాడులోని డీఎంకే సర్కారు, కేంద్రం మధ్య వివాదం చెలరేగుతున్న విషయం తెలిసిందే. తమినాడు ప్రభుత్వం ద్విభాషా విధానం అమలు చేయడానికి కట్టుబడి ఉన్నట్టు మంత్రి తెలిపారు. తమ విధానం తమను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లిందని, ఆ విధానం వల్లే ప్రపంచవ్యాప్తంగా తమిళులు రాణిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లను నడిపేందుకు రాష్ట్ర ప్రభుత్వ నిధులను వాడనున్నట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై ప్రభావం పడకుండా ఉండేందుకు.. ఉద్యోగుల జీతాల కోసం నిధుల్ని ఉంచినట్టు చెప్పారు. బడ్జెట్‌ను నిరసిస్తూ బీజేపీ అసెంబ్లీని బాయ్‌కాట్ చేసింది. ఇక అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు.. సభ నుంచి వాకౌట్ చేశారు. రాష్ట్ర లిక్కర్ యూనిట్‌లో జరిగిన కుంభకోణం గురించి అన్నాడీఎంకే నేతలు అసెంబ్లీలో లేవనెత్తారు.

ఆదరణ కోల్పోయిన పెంకు ఫ్యాక్టరీలు

కార్మికులకు ఉపాధి కరువు | కోట్ల వ్యాపారం.. నేడు వేలల్లోనే..



ఫ్యాక్టరీలు పూర్తిగా మూసేసే పరిస్థితి నెలకొంది.

నవతెలంగాణ-బయ్యారం

స్లాబ్ నిర్మాణాలతో తగ్గుతున్న ఆదరణ

ఒకప్పుడు పెంకు ఫ్యాక్టరీల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా రూ.కోట్లల్లో సాగింది. ఇప్పుడు ఆ వ్యాపారం మనుగడ కోల్పోయింది. ఫ్యాక్టరీల యజమానుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో 14 పెంకు ఫ్యాక్టరీలు ఉండేవి. కోట్ల రూపాయల వ్యాపారం సాగిస్తూ సుమారు 10,000 మంది కార్మికులకు కొలువుగా ఉండేది. ఇప్పుడు వేల రూపాయల బిజినెస్‌కు మారింది. కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. ప్రస్తుతం స్లాబ్ నిర్మాణాలతో పెంకులకు ఆదరణ తగ్గుతూ వస్తోంది.

పెంకు ఫ్యాక్టరీలలో పని చేయడానికి స్థానికులే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో కార్మికులు వచ్చేవారు. ఇక్కడే పని చేస్తూ ఫ్యాక్టరీల సమీపంలోనే నివాసముండేవారు. ఇక్కడ తయారైన పెద్ద పెంకులు, చిన్న పెంకులు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక, ఛత్తీస్‌గఢ్‌కు సరఫరా అయ్యేవి. అప్పట్లో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు కూడా ఎక్కువగా పెంకులను వాడటం వల్ల పెంకు ఫ్యాక్టరీలు నిరంతరం నడిచేవి. బయ్యారం మండలంలోని అన్ని ఫ్యాక్టరీ లకు బయ్యారం పెద్ద చెరువు నుంచి మట్టి తోలేవారు. పెంకుల నాణ్యతతో పాటు కూలీలకు, వ్యాపారులకు ఉపాధి అవకాశాలు అధికంగా ఉండేది. మహబూబాబాద్ జిల్లా నుంచి మొదలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు వరకు సుమారు 35 పెంకు ఫ్యాక్టరీలకు బయ్యారం పెద్ద చెరువు నుంచి మట్టి తరలించేవారు. తద్వారా ప్రతి సంవత్సరం పెద్ద చెరువులో పూడిక తొలగిపోవడం వల్ల 16.5 అడుగుల నీటితో కళకళలాడుతూ రైతులకు కూడా మేలు జరిగేది. ఒక్కో ఫ్యాక్టరీలో 500 నుంచి 650 మంది కార్మికులు పని చేసేవారు. 35 ఫ్యాక్టరీలలో సుమారు 21000 మంది కార్మికులు ఉపాధి పొందేవారు. ప్రస్తుతం ఈ పెంకులకు ఆదరణ పూర్తిగా తగ్గిపోవడం వల్ల ఫ్యాక్టరీలు నడవడం కష్టంగా మారింది. ఫ్యాక్టరీలు పెంకులను తయారు చేయడం లేదు. క్రమంగా ఫ్యాక్టరీలు పూర్తిగా మూసేసే పరిస్థితి నెలకొంది.

ఫ్యాక్టరీలు నడపలేని దుస్థితి

పెంకులకు ఆదరణ లేకపోవడంతో ఫ్యాక్టరీలను నడపలేని పరిస్థితి నెలకొంది. గతంలో వేల మంది కార్మికులకు ఉపాధి కల్పించిన ఫ్యాక్టరీలు ప్రస్తుతం కనీసం పదుల సంఖ్యలో కూడా కార్మికులకు ఉపాధి కల్పించలేకపోతున్నాయి. పెద్ద పెంకుల ఫ్యాక్టరీలు పూర్తిగా మూత పడగా.. ప్రస్తుతం చిన్న పెంకులను తయారు చేసుకుంటూ.. మూసేయలేక.. నడపలేక ముందుకు సాగుతున్నాం.

– సాంబశివరావు (పెంకు ఫ్యాక్టరీ యజమాని)

ప్రభుత్వం ఉపాధి కల్పించాలి

పెంకు ఫ్యాక్టరీలకు ఆదరణ తగ్గి తమ ఉనికిని కోల్పోతున్నాం. ప్రభుత్వమే ఉపాధి కల్పించి ఆదుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం తమ గోడును విని తమకు ఆర్డర్లు ఇవ్వాలి.

మాగంటి ప్రసాద్ (పెంకు ఫ్యాక్టరీ యజమాని)

ప్రభుత్వాల నిర్లక్ష్యం

పెంకు ఫ్యాక్టరీలకు నిత్యం ఉపాధి కల్పించిన ప్రభుత్వాలు.. తర్వాత రానురాను పట్టించుకోవడం మానేశాయి. గతంలోనూ ఇదే పరిస్థితి నెలకొంటే, ప్రస్తుత ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి ఉంది. పెంకు ఫ్యాక్టరీల యాజమాన్యాల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. గతంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మా ణంలో ప్రభుత్వ హౌసింగ్ బోర్డు పెంకులను వినియోగిం చడంతో మంచి గిరాకీ ఉండేది. కానీ ప్రస్తుతం ప్రభుత్వం ఇండ్ల నిర్మాణంలో స్లాబ్‌లను చేపడుతుండటంతో ఆర్డర్లు ఉండటం లేదు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విమానంలో చెలరేగిన మంటలు

రెక్కపై నిల్చున్న ప్రయాణికులు



డెన్వర్: అమెరికాలోని డెన్వర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఓ విమానానికి తృటిలో పెనుప్రమాదం తప్పింది. విమానాశ్రయం గేటు వద్ద దిగిన విమానంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే ఎమర్జెన్సీ ఎగ్జిట్ ద్వారా ప్రయాణికులను బయటకు పంపించారు. విమానం రెక్కపై నిలబడిన ప్రయాణికులను సిబ్బంది కిందకు దింపుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో బయటకు వచ్చాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. అమెరికా కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 5.15 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

కొలరాడో స్ప్రింగ్స్ ఎయిర్‌పోర్ట్ నుంచి డాలస్ ఫోర్ట్ వర్త్‌కు బయల్దేరిన అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. ఇంజిన్‌లో వైబ్రేషన్స్ రావడంతో వెంటనే విమానాన్ని డెన్వర్ కు మళ్లించి అత్యవసరంగా దించేశారు. ఎయిర్‌పోర్టులోని టాక్సీయింగ్ ప్రదేశంలో విమానం దిగిన వెంటనే ఇంజిన్‌లో మంటలు తలెత్తాయి. చూస్తుండగానే విమానమంతా దగ్ధమైంది. అప్రమత్తమైన సిబ్బంది ప్రయాణికులను అత్యవసర ద్వారాల నుంచి బయటకు తీసుకొచ్చారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని అధికారులు వెల్లడించారు. దీనిపై దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. ఘటన సమయంలో విమానంలో 172 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. అగ్నిమాపక సిబ్బంది కొన్ని గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు.

పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం మార్క్సిజం, లెనినిజమే

- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం మార్క్సిజం, లెనినిజమేనని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ నొక్కి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో కారల్ మార్క్స్ 142వ వర్థంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్క్సిజాన్ని నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి 1917లో శాస్త్రీయ సోషలిజాన్ని వి.ఐ.లెనిన్ తీసుకొచ్చారని గుర్తుచేశారు. రష్యాలో సోషలిస్టు వ్యవస్థ కూలిపోయిన తర్వాత మార్క్సిస్టు సిద్ధాంతాలకు కాలం చెల్లించదనీ, పెట్టుబడిదారి సమాజమే అత్యున్నతమైనదనీ బూర్జువా మేధావులు, పెట్టుబడిదారులు సంబరపడ్డ విషయాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాత 18 ఏండ్లకే 2008లో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ దేశాలన్నింటినీ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందన్నారు. దాని ఫలితంగా నేడు ప్రపంచ వ్యాప్తంగానూ నిరుద్యోగం, ఆకలిచావులు, ఆత్మహత్యలు, ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగిపోతున్న తీరును వివరించారు. పెట్టుబడిదారుల దోపిడీ తీవ్ర పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో తిరుగుబాట్లు వస్తున్నాయని చెప్పారు. మార్క్సిజం ఆధారంగా ఏర్పడ్డ చైనా, క్యూబా, వియత్నాం, ఉత్తరకొరియా, లావోస్ లాంటి దేశాలు సంక్షోభంలోకి కూరుకుపోకుండా స్థిరంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. అమెరికా సామ్రాజ్యవాదానికి- చైనా సోషలిజానికి మధ్య ఉన్న వైరుధ్యం నేడు తీవ్ర రూపం దాల్చుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, మహిళా కూలీల కన్వీనర్ బి.పద్మ రాష్ట్ర నాయకులు ఆర్.ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



11.7కోట్లు దాటనున్న నిర్వాసితుల సంఖ్య

వచ్చే ఏడాది చివరకు మరో 67లక్షల మంది

న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా బలవంతంగా నిర్వాసితులైన వారి సంఖ్య 11.7కోట్లకు పైగా దాటుతుందని ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ తెలిపింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కూడా వుందని హెచ్చరించింది. వచ్చే ఏడాది చివరి నాటికి కొత్తగా నిర్వాసితులు దాదాపు 67లక్షల మంది చేరతారని భావిస్తున్నట్లు శరణార్థ మండలి శుక్రవారం తెలిపింది. ఇవేమీ కేవలం గణాంకాలుగా చూడరాదని, తమ వెంట ఏమీ తీసుకెళ్ళలేని రీతిలో బలవంతంగా ఇండ్ల నుంచి పారిపోయిన కుటుంబాల సంఖ్య ఇదని, వీరు ఆహారం,నీరు, గూడు కోసం వెతుక్కుంటూ వుంటారని డానిష్ శరణార్థ మండలి సెక్రెటరీ జనరల్ చార్లెట్ స్లానెట్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా 27 దేశాల్లో ఈ పరిస్థితి నెలకొందని, అంతర్జాతీయ నిర్వాసితుల్లో మూడో వంతు మంది ఈ దేశాల్లోనే వున్నారని చెప్పారు. భద్రత, రాజకీయాలు, ఆర్థిక పరిస్థితులు వంటి దాదాపు వందకు పైగా అంశాలను ప్రామాణికాలుగా తీసుకుని నిర్వాసితుల ధోరణులను విశ్లేషించారు. ఇందుకుగానూ ఎఐతో రూపొందించిన నమూనాను ఉపయోగించారు. కొత్తగా నిర్వాసితులైన వారిలో దాదాపు మూడోవంతు మంది సూడాన్ నుంచే వుంటారు. రెండేండ్ల నుంచి సాగుతున్న యుద్ధంతో సూడాన్‌లో ప్రపంచంలోనే అత్యంత అధ్వాన్నమైన శరణార్థుల సంక్షోభం నెలకొంది. మయన్మార్ నుంచి మరో కోటీ 40లక్షల మంది నిర్వాసితులు కొత్తగా చేరనున్నారని ఆ నివేదిక పేర్కొంది. అమెరికా ఇటీవల విదేశీ సాయంలో కోత విధించిన నేపథ్యంలో ఇలాంటి ప్రపంచ కార్యక్రమాలన్నింటికీ నిధుల కొరత మొదలైంది. ఈ పరిస్థితుల్లో లక్షలాదిమంది కరువు బారిన బడుతున్నారని, నిర్వాసితులవుతున్నారని, స్లానెట్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

షెడ్యూలు ప్రకారమే 24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె

కోల్‌కతా : ఈనెల 24, 25 తేదీల్లో జరగాల్సిన దేశవ్యాప్త సమ్మె అనుకున్న ప్రకారమే జరుగుతుందని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ)గురువారం ప్రకటించింది. కీలకమైన డిమాండ్లపై ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ (ఐబీఏ) జరిగిన చర్చల్లో ఎలాంటి సానుకూల ఫలితాలు రానందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. వారానికి ఐదు రోజులు పని, అన్ని కేడర్ల రిక్రూట్‌మెంట్‌తో సహా పలు అంశాలను చర్చించారు. అయినా ఇంకా కీలకమైన సమస్యలు పరిష్కారం కాలేదని బ్యాంక్ ఉద్యోగుల జాతీయ సమాఖ్య (ఎన్‌సీబీఈ) ప్రధాన కార్యదర్శి ఎల్.చంద్రశేఖర్ తెలిపారు. వర్క్‌మెన్‌ల ఖాళీలను, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఆఫీసర్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని తొమ్మిది బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్యలతో కూడిన యుఎఫ్‌బియు కోరుతోంది. ఉద్యోగుల పనితీరు సమీక్షలు, పనితీరుకు సంబంధించి ఇచ్చే రాయితీలు వంటి అంశాలపై ఫైనాన్షియల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ (డిఎఫ్ఎస్) ఇటీవల ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని యూనియన్లు కోరుతున్నాయి. ఇటువంటి చర్యల వల్ల ఉద్యోగుల ఉపాధి భద్రత ప్రమాదంలో పడుతుందని విమర్శించింది. పైగా ఇటువంటి జోక్యందారీ చర్యలు బ్యాంక్‌ల స్వయంప్రతిపత్తిని దెబ్బ తీస్తాయని పేర్కొంది.

రోహింగ్యా శరణార్థుల శిబిరానికి యూఎన్ చీఫ్

తాజా పరిణామాలపై ఆందోళనలు



ధాకా : బంగ్లాదేశ్‌లోని రోహింగ్యా శరణార్థుల శిబిరాన్ని శుక్రవారం యూఎన్ చీఫ్ ఆంటానియో గుటెరస్ సందర్శించారు. వచ్చే నెల నుంచి వారికి అందించే ఆహార సాయంలో తీవ్రమైన కొరతలు విధించనున్న నేపథ్యంలో గుటెరస్ పర్యటన చోటు చేసుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద శరణార్థ స్థావరంలో జీవనపరిస్థితులు ఇప్పటికే దుర్భరంగా మారిన నేపథ్యంలో తాజా పరిణామాలు మరింత కలవరపెడుతున్నాయి. సరిహద్దు జిల్లా అయిన కాక్స్ బజార్‌లో గుటెరస్ పర్యటన చాలా కీలకమైనదిగా భావిస్తున్నారు. యుఎస్ఎయిడ్ కార్యకలాపాలు మూతపడిన పరిస్థితుల్లో అత్యవసర ఆహార సరఫరాల్లో కోతలు వుంటాయని ప్రపంచ ఆహార కార్యక్రమం ఇప్పటికే ప్రకటించింది. ఏప్రిల్ నుంచి రోహింగ్యాలకు ఇచ్చే ఆహార వోచర్లను రూ.12.50 నుంచి రూ.6కు తగ్గించాల్సి వస్తోంది. నిధుల కొరత కారణంగా తీసుకునే ఈ చర్యలతో శరణార్థులతో కిక్కిరిసిపోయిన శిబిరాల్లో ఆకలి కేకలు మరింత ఎక్కువవుతాయని ఆందోళనలు మొదలయ్యాయి. రోహింగ్యా శరణార్థులకు ప్రధానంగా ఆర్థిక సాయం అందించే దేశంగా ఇప్పటివరకు అమెరికా వుంది. ట్రంప్‌వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి.

ఈ శిబిరాల్లోని పిల్లలు 2017 నుండి తీవ్ర పోషకాహార లోపాలతో బాధపడుతున్నారని యూనిసెఫ్ పేర్కొంది. గతేడాది పోలిస్తే ఈ ఏడాది 27శాతం ఇటువంటి కేసులు పెరిగాయి. "ఇప్పటికే మాకు ఏదైతే ఇస్తున్నారో అది చాలడం లేదు. ఇంకా దాన్ని సగానికి తగ్గిస్తే ఇక మేం కరువు వాతన పడాల్సిందే" అరి మయన్మార్‌కు చెందిన 31ఏండ్ల శరణార్థి మహ్మద్ సాబిర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ తమను పనిచేయడానికి అనుమతించరని, అటువంటపుడు నా పిల్లలను ఎలా పోషించాలో తెలియడం లేదన్నారు. బంగ్లాదేశ్‌లో 10లక్షల మందికి పైగా రోహింగ్యా శరణార్థులు వున్నారు.

ఎన్ని కేసులు పెట్టినా..


- కేంద్రానికి తలవంచను : సిసోడియా

న్యూఢిల్లీ : తనకు వ్యతిరేకంగా ఎన్ని కేసులు పెట్టినా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి తల వంచనని ఆప్ సీనియర్ నాయకులు మనీష్ సిసోడియా స్పష్టం చేశారు. రూ 2 వేల కోట్ల క్లాస్ రూమ్ స్కామ్‌లో సిసోడియాకు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ నమోదుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఆయన పై విధంగా స్పందించారు. సిసోడియాతో పాటు, సత్యేందర్ జైన్ ఎఫ్ఐర్ నమోదుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఆప్ ప్రభుత్వ పాలనలో వీరిద్దరూ మంత్రులుగా ఉన్న సమయంలో ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణంలో ఈ కుంభకోణం జరిగిందని ఆరోపణ. 'బీజేపీకి, కేంద్ర ప్రభుత్వానికి నేను ఒకటి చెప్పాలనుకుంటున్నాను. మీకు ఇష్టమైనన్ని కేసులు నమోదు చేయండి. నాపై లేదా సత్యేందర్‌జైన్, అతిశీ, కేజ్రీవాల్ లేదా ఏ ఇతర ఆప్ నాయకుడిపైనా అయినా సరే.. మేం మాత్రం బీజేపీకి తలవంచం' అని సిసోడియా తెలిపారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తారని బీజేపీని ఆయన ప్రశ్నించారు. 'హోలీ పండుగ కూడా వచ్చింది. మీరు ఇచ్చిన ఉచిత సిలిండర్లు ఎక్కడ ఉన్నాయి? మహిళలకు నెలకు రూ.2,500 హామీ ఏమైంది' అని సిసోడియా ప్రశ్నించారు.

అమెరికా టారిఫ్‌లపై డబ్ల్యూటీఓలో కెనడా ఫిర్యాదు

జెనీవా: ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులన్నింటిపై 25శాతం టారిఫ్‌లు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న చర్యపై ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)లో కెనడా ఫిర్యాదు చేసింది. బుధవారం నుండి అమల్లోకి వచ్చిన ఈ సుంకాలకు ఎలాంటి మినహాయింపులు లేవు, వాటిని నివారించడానికి దేశాలు చేసిన ప్రయత్నాలతో నిమిత్తం లేకుండా అందరికీ వర్తిస్తాయి. దీంతో ఇప్పటివరకు కొన్ని ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై అదనపు సుంకాల నుంచి తమకు వున్న మినహాయింపులను కోల్పోయామని, అల్యూమినియం ఉత్పత్తులపై సుంకాలు పెరిగాయని కెనడా తెలిపింది. అమెరికాకు ప్రధాన ఉక్కు సరఫరాదారుగా కెనడా వుంది. ముఖ్యంగా ఆసియా నుంచి పోటీ పెరుగుతున్న నేపథ్యంలో క్షీణిస్తున్న అమెరికా ఉక్కు పరిశ్రమను కాపాడుకునే లక్ష్యంతో ట్రంప్ ఈ చర్యలు తీసుకున్నారు. ఈ వివాదంపై చర్చించాల్సిందిగా కెనడా డబ్ల్యూటీఓ వివాద పరిష్కార యంత్రాంగాన్ని కోరింది. దీంతో సంతృప్తికరమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు సంబంధిత పక్షాలు చర్చలు జరిపేందుకు ఒక అవకాశం లభిస్తుంది.

సుప్రీంకోర్టుకు జన్మత: పౌరసత్వం రద్దు



(మొదటిపేజీ తరువాయి)

కోర్టుల్లో దాఖలైన పిటిషన్లను వ్యక్తిగత స్థాయికే పరిమితం చేయాలని ఆమె న్యాయస్థానాన్ని కోరారు. ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగబద్ధమా..?కాదా..?అన్న విషయంపై అభిప్రాయాన్ని మాత్రం కోరలేదు. ట్రంప్ జారీ చేసిన ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు తీవ్రమైన న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొంటున్నాయి. మేరీల్యాండ్, మసాచుసెట్స్, వాషింగ్టన్ రాష్ట్రాల్లో పిటిషన్లు దాఖలు కావడంతో కోర్టులు ఇంజెక్షన్ ఆర్డర్లు జారీ చేశాయి. ఈ ఆదేశాలు దేశ ఎగ్జిక్యూటివ్ విభాగాన్ని రాజ్యాంగపరమైన విధులు నిర్వహించకుండా అడ్డుకుంటున్నాయన్నారు. ఇటీవల ట్రంప్ సర్కారు తొలగించిన పలువురు ప్రొబేషనరీ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని ఆరు ఏజెన్సీలకు కాలిఫోర్నియాలో న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

అమెరికా చట్టాల ప్రకారం.. ఆ దేశ పౌరులకు పుట్టినవారికి మాత్రమే కాకుండా.. అమెరికాలో జన్మించిన ప్రతిఒక్కరికీ అక్కడి పౌరసత్వం లభిస్తుంది. అమెరికా గడ్డపై పుట్టినవారంతా ఈ దేశ పౌరులే అనే ఉద్దేశంతో 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ద్వారా శరణార్థుల పిల్లలకు అమెరికా జన్మత: పౌరసత్వాన్ని అందిస్తోంది. ఇప్పటివరకు ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగింది. అయితే, తాజాగా ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులతో దీనికి బ్రేక్ పడింది. ట్రంప్ ఉత్తర్వుల ప్రకారం.. బిడ్డకు జన్మనిచ్చే సమయానికి తల్లిదండ్రులు అమెరికా పౌరులు కాకపోయినా, ఒకవేళ తండ్రి చట్టబద్ధంగా అమెరికాలో ఉన్నప్పటికీ.. శాశ్వత నివాసి కాకపోయినా పుట్టిన పిల్లలకు అమెరికా పౌరసత్వం రాదు. అలాగే, తండ్రి శాశ్వత నివాసి అయినప్పటికీ.. తల్లి తాత్కాలిక వీసా మీద అమెరికాలో నివాసం ఉంటున్నా అదే నియమం వర్తిస్తుంది. 2024 చివరినాటికి 5.4 మిలియన్ల మంది ప్రవాస భారతీయులు అక్కడ నివసిస్తున్నారు. అమెరికా మొత్తం జనాభాలో సుమారు 1.47 శాతం భారతీయులే. వీరిలో 34 శాతం మంది అమెరికాలో పుట్టినవారు.



మయన్మార్‌లో 10 లక్షల మందికి పైగా

ఆహార సాయం కట్

ప్రకటించిన ప్రపంచ ఆహార కార్యక్రమం

న్యూయార్క్ : మయన్మార్‌లోని పది లక్షల మందికి పైగా ప్రజలకు ప్రాణాధారమైన ఆహార సాయంలో కోత విధించనున్నట్లు ఐక్యరాజ్య సమితి ఆహార సంస్థ శుక్రవారం పేర్కొంది. నిధులు తీవ్రంగా తగ్గిపోయినందువల్ల వచ్చే నెల నుండి ఈ కోత అమలు కానున్నట్లు ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్‌పీ) పేర్కొంది. ఘర్షణలు పెరగడం, నిర్వాసితుల సంఖ్య ఉధృతంగా పెరిగిపోవడం, పైగా ఆంక్షలు ఇవన్నీ కలిసి ఆహార సాయం అవసరమవుతున్న వారి సంఖ్య ఇప్పటికే బాగా పెరిగిపోయిందని, అందువల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమైందని డబ్ల్యూఎఫ్‌పీ ఒక ప్రకటనలో పేర్కొంది. 2021 తొలినాళ్ళ నుంచి మయన్మార్ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని శక్తివంతమైన మిలటరీ కూలదోయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో నిరసనోద్యమం మొదలైంది, ఇది క్రమంగా దేశవ్యాప్తంగా పాలక జుంటాపై సాయుధ తిరుగుబాటుగా విస్తరించింది. 2026 జనవరి నాటికి ఎన్నికలు నిర్వహిస్తామని మయన్మార్ జుంటా చీఫ్ ఇప్పటికే ప్రకటించారు. ప్రస్తుతం మయన్మార్‌లో దాదాపు 2కోట్ల మంది ప్రజలకు మానవతా సాయం అవసరముంది. దేశ జనాభాలో మూడోవంతు మంది అంటే కోటీ 52లక్షల మంది తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల నిపుణులు పేర్కొంటున్నారు. నిధుల కొరత గురించి డబ్ల్యూఎఫ్‌పీ వివరించలేదు. అమెరికా విదేశీ సాయంలో కోత విధించడం వల్ల తలెత్తిన పరిస్థితులా ఇవి కాదా అనేది స్పష్టంగాలేదు. అయితే ఈ నిర్ణయం మయన్మార్‌లోని పలు కమ్యూనిటీలను బాగా దెబ్బతీయనుంది. కొంతమంది కేవలం డబ్ల్యూఎఫ్‌పీ సాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో అంతర్గతంగా నిర్వాసితులైన ముస్లిం రోహింగ్యాలు, ఇతర కమ్యూనిటీల వారు దాదాపు లక్షమంది వున్నారు.రాబోయే కాలంలో జులై నుండి సెప్టెంబరు వరకు ఆహార కొరతలు చాలా తీవ్రంగా వుంటాయని, అప్పుడు తలెత్తబోయే పరిస్థితుల పట్ల డబ్ల్యూఎఫ్‌పీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది.

నవతెలంగాణ

గెలవకపోవడం ఓటమికాదు..
మళ్లీ ప్రయత్నించకపోవడమే నిజమైన ఓటమి - శ్రీశ్రీ

శనివారం 15 మార్చి 2025
www.navatelangana.com

సంపాదకీయం

తరంగ తంత్రం

భారతీయ టెలికామ్‌రంగంలో చోటుచేసుకున్న తాజా ఒప్పందాలకు భూమిక ఏమిటి? ఏ ప్రాతిపదికన, ఎవరి ప్రయోజనాల కోసం జరిగాయి? ఏ పరిణామాలకు తెరతీయనున్నాయి? నిన్నటి దాకా తీవ్ర అభ్యంతరాలు చెప్పిన కంపెనీలే ఉన్నట్టుండి ఒకదాని తర్వాత మరొకటి గంటల వ్యవధిలోనే ఎగబడి ఒప్పందాలు చేసుకోవడంలోని మతలబేమిటి? ఇవి రోదసిపై గుత్తాధిపత్యానికి దారితీయనున్నాయా? అదే జరిగితే జాతీయ భద్రత, దేశ సార్వ భౌమాధికారాల మాటేమిటి? స్టార్‌లింక్‌తో జియో, ఎయిర్‌టెల్‌ల ఒప్పందాలు లేవనెత్తుతున్న ప్రశ్నలివి. ఇది ట్రంప్, ఆయన భారతీయ చెలికాడు మోడీ తెరవెనుక నడిపిన మంత్రాంగమనీ, ట్రంప్‌ను ప్రసన్నం చేసుకునేందుకు స్టార్ లింక్ యజమాని ఎలన్‌మస్క్ ద్వారా ప్రధాని మోడీయే స్వయంగా ఈ భాగస్వామ్యాలను ఏర్పాటు చేశారని అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. స్టార్‌లింక్ అనేది అమెరికన్ ఏరోస్పేస్ కంపెనీ

> ఒక విదేశీ కంపెనీని మన శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను, ఆర్బిటల్ స్లాట్‌లను స్వాధీనం చేసుకోవడానికి అనుమతించటమంటే అది రోదసీపై గుత్తాధిపత్యానికి అవకాశమివ్వడమే అవుతుంది. మన సార్వభౌమాధికారంపై, జాతీయ భద్రతపై రాజీపడడమే అవుతుంది. ఇటీవల రష్యాతో చర్చలు జరిపేలా ఉక్రెయిన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు, ఉక్రెయిన్ ఖనిజ వనరులను తమకు అప్పగించాలన్న డిమాండ్లను అంగీకరింప జేసేందుకు ఉక్రెయిన్ మిలటరీకి స్టార్‌లింక్ సేవలను నిలిపివేస్తామని అమెరికా హెచ్చరించడం, ఆ బెదిరింపులకు ఉక్రెయిన్ లొంగిపోవడం ఇందుకో ఉదాహరణ.

'స్పేస్‌ఎక్స్' అభివృద్ధి చేసిన ఇంటర్నెట్ సేవలను అందించే ఉపగ్రహ ఆధారిత అంతర్జాల వ్యవస్థ. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన ఎలన్‌మస్క్‌కు చెందిన ఈ సంస్థ భారత్‌లో తన ఇంటర్నెట్ సేవలను విస్తరించడానికి గత కొంతకాలంగా ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. కాగా భారత కుబేరులైన ముఖేశ్ అంబానీకి చెందిన జియో, సునీల్ మిట్టల్‌కు చెందిన ఎయిర్‌టెల్ కంపెనీలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. అలాంటిది ఇవి అకస్మాత్తుగా తమ అభ్యంతరాలన్నింటినీ అటకెక్కించి స్టార్‌లింక్‌తో అంటకాగడానికి సిద్ధపడుతూ ఒప్పందాలు చేసుకోవడం ఈ అనుమానాలకు తావిస్తోంది.




ఈ ఒప్పందాలు స్పెక్ట్రమ్ కేటాయింపులు, జాతీయ భద్రతాంశాలపై కూడా తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తు తున్నాయి. దేశంలో క్లిష్టమైన పరిస్థితేదైనా ఎదురైనపుడు కనెక్టివిటీని ఎవరు నియంత్రిస్తారు? అమెరికాకు చెందిన స్టార్‌లింకా, లేక భారతీయ భాగస్వామ్యులైన ఎయిర్‌టెల్, జియో సంస్థలా? సాంకేతిక అభివృద్ధి అత్యున్నత దశలో కొనసాతున్న ఈ కాలంలో ఒక దేశ రక్షణకు ఈ శాటిలైట్ స్పెక్ట్రమ్(ఉపగ్రహ తరంగ వ్యవస్థ) అనేది చాలా కీలకంగా మారింది. అన్ని దేశాలకూ ఒక అపూర్వమైన వనరుగా అందుబాటులోకి వచ్చింది. నేటి ఆధునిక ప్రపంచంలో ఇది అందించే ప్రయోజనాలు ఏ దేశానికైనా అనివార్యమైన అవసరం. బ్రాడ్‌కాస్టింగ్, మొబైల్ నెట్‌వర్క్ వంటి సమాచార సేవలతో పాటు నావిగేషన్ సిస్టమ్స్, వాతావరణ పరిశోధన, దేశ రక్షణ, సురక్షితమైన మిలటరీ కమ్యూనికేషన్‌కు ఇది అందించే సేవలు అసాధారణమైనవి. అందుకే ఇది ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటుందని, దీన్ని ప్రయివేటు సంస్థలకు కేవలం పారదర్శకమైన, బహిరంగ వేలం ద్వారా మాత్రమే కేటాయించాలని సుప్రీంకోర్టు 2జీ స్పెక్ట్రమ్ కేసులో స్పష్టం చేసింది. ఇందుకు భిన్నంగా ప్రయివేటు ఒప్పందాల ద్వారా స్పెక్ట్రమ్ కేటాయింపులు జరగడం చట్ట విరుద్ధం. మరి అలాంటప్పుడు ఏ ప్రాతిపదికన ఈ ఒప్పందాలు జరిగినట్టు? జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు? జాతీయ భద్రతను కూడా తాకట్టు పెట్టేంతగా సర్కారు సాగిలపడాల్సిన అవసరమేమిటి? ఈ ప్రశ్నలకు కేంద్రం సమాధానం చెప్పాలి. లేదంటే 'ఇది ట్రంపు దయకోసం మోడీ పాకులాట" అంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను అంగీకరించినట్టే అవుతుంది.

ఇది భారతదేశ కక్ష్యా స్థలాల (ఆర్బిటల్ స్లాట్స్)పై కూడా తీవ్ర ప్రభావం చూపించే అంశం. ఈ ఒప్పందం మూలంగా సదరు విదేశీ కంపెనీ తన శాటిలైట్‌లను మన సహజ వనరుల మ్యాపింగ్, వాణిజ్యపరంగా విలువైన డేటా సేకరణ, ముఖ్యంగా మన వ్యూహాత్మక మిలిటరీ, రక్షణ డేటాను సేకరించడానికి వినియోగిస్తే, అది మన జాతీయ భద్రతకే పెను ప్రమాదం. ఒక విదేశీ కంపెనీని మన శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను, ఆర్బిటల్ స్లాట్‌లను స్వాధీనం చేసుకోవడానికి అనుమతించటమంటే అది రోదసీపై గుత్తాధిపత్యానికి అవకాశమివ్వడమే అవుతుంది. మన సార్వ భౌమాధికారంపై, జాతీయ భద్రతపై రాజీపడడమే అవుతుంది. ఇటీవల రష్యాతో చర్చలు జరిపేలా ఉక్రెయిన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు, ఉక్రెయిన్ ఖనిజ వనరులను తమకు అప్పగించాలన్న డిమాండ్లను అంగీకరింప జేసేందుకు ఉక్రెయిన్ మిలటరీకి స్టార్‌లింక్ సేవలను నిలిపివేస్తామని అమెరికా హెచ్చరించడం, ఆ బెదిరింపులకు ఉక్రెయిన్ లొంగిపోవడం ఇందుకో ఉదాహరణ.

భూ కక్ష్యలో తిరుగాడే భారీ ఉపగ్రహ సముదాయం (మెగా కాన్స్టలేషన్) అనేది ఓ అద్భుత ఆవిష్కరణ అనడంలో సందేహంలేదు. అయితే దీనివల్ల లెక్కకు మించిన ప్రయోజనాలున్నాయన్నది ఎంత నిజమో...దాని విని యోగంపై నియంత్రణ కొరవడితే అంతకు మించిన ప్రమాదాలున్నాయనేది కూడా అంతే నిజం. టెక్నాలజీ అందించిన అద్భుత ఫలితాలు సమాజ ప్రయోజనాలకే తప్ప సంపన్నుల స్వార్థానికి ఉపయోగపడరాదు. నిత్యం అధికారం కోసం, ఆధిపత్యం కోసం ఆధునికత పేరుతో పెట్టుబడి అనాగరికంగా వ్యవహరిస్తున్నది. అందివచ్చిన సాంకేతకతను ఆయుధంగా వాడుతున్నది. దీనికి ప్రభుత్వాలు గులాంగిరీ చేస్తున్నాయి. ఇందుకు ఈ టెలికామ్ ఒప్పందాలు తాజా తార్కాణాలు. దీన్ని నివారించగలిగేదీ, నియంత్రించగలిగేది ప్రజల చైతన్యమే. లేదంటే చిన చేపను పెద చేప, దాన్ని తిమింగిలం మింగినట్టు.. దేశ ఆర్థిక స్వావలంబన కరిమింగిన వెలగపండుగా మారుతుంది.

శివాజీ హిందూ మత ఉద్ధారకుడా? ఎలా?



డాక్టర్ దేవరాజు మహారాజు

ఛత్రపతి శివాజీకి రాజ్యాధికారం వారసత్వంగా రాలేదు. అది కేవలం ఆయన స్వయంకృషితో సాధించు కున్నది. అప్పటివరకు వతన్‌దార్లు, జాగీర్‌దార్లు, దేశ్‌ముఖ్‌లు తమకు ఇష్టం వచ్చినట్లు పన్నులు వసూలు చేసుకునే వారు. అది వారి వారసత్వపు హక్కుగా భావించి దోచుకుంటూ ఉండేవారు. వారికి అడ్డూ అదుపూ ఉండేది కాదు. శివాజీ తన రాజ్యాన్ని స్థాపించుకున్నాక, వారి ఆట కట్టించాడు. రైతు విలువ తెలిసిన వాడు గనక, శివాజీ రైతు సంక్షే మం కోరుతూ నిర్ణయాలు తీసుకున్నాడు. రైతులకి విత్తనాలు, పనిముట్లు అందజేసి వారిని పోత్సహించాడు. కరువు, కాటకాల సమయంలో పన్నులు చెల్లించే పనిలేకుండా మినహాయింపులిచ్చాడు. తమ రాజ్యస్థాపన చేసింది ప్రజల్ని కొల్లగొట్టడానికి కాదనీ, దోపిడీకి అడ్డుకట్ట వేయడానికన్నట్టు వ్యవహరించేవాడు. గత పదేళ్లుగా దేశంలో అధికారంలో ఉన్న ఆరెస్సెస్- బీజేపీ ప్రభుత్వం రైతుల్ని ఎలా హింసిస్తోందో మనకు తెలుసు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు ఏండ్ల కేండ్లు ధర్నాలు చేస్తుంటే- కేంద్ర ప్రభుత్వానికి వినపడదు. కనపడదు. మరి వీరికి శివాజీ ఎలా ఆదర్శ ప్రాయుడూ?


శివాజీ రాజ్యస్థాపన చేయకముందు, ఫ్యూడల్ వ్యవస్థ సాగుతున్న దశలో పేద మహిళలకు భద్రత లేకుండా ఉండేది. భూస్వాములు, పటేళ్లు, దేశ్ ముఖ్‌లు పేదల కూతుళ్లని, కోడళ్లని భోగ వస్తువులుగా చూసేవారు. వారికి రక్షణనిచ్చే వారు గానీ, న్యాయం చేకూర్చే వారుగానీ ఉండేవారు కాదు. అలాంటి సమయంలో రాంజ గ్రామ పటేల్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. అతను ఒక పేద రైతు కూతుర్ని అపహరించి లైంగికదాడి చేస్తే - విషయం తెలుసు కున్న శివాజీ మహారాజు ఆ పటేల్ కాళ్లు, చేతులూ నరికేయించాడు. అలాగే బాడీ గుర్జర్ అనే బ్రాహ్మణుడు లైంగిక దాడికి పాల్పడితే, శివాజీ అతనికి ఏకంగా మరణశిక్ష విధించాడు. శూద్రుడైన శివాజీ, ఒక బ్రాహ్మణుడికి శిక్ష విధించ డమా? అని బ్రాహ్మణ పీష్వాలందరూ కలిసి శివాజీపై కుట్రలు పన్నారు. (మనుధర్మ శాస్త్ర ప్రకారం బ్రాహ్మణ హత్య మహా పాతకం) రైతులకు, మహిళలకు భద్రతనివ్వని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం శివాజీని ఎలా స్వంతం చేసుకో గలదూ? పైగా, ఆయన హిందూ మత ఉద్ధారకుడని అబద్దం ప్రచారం చేయడం బావుందా? శివాజీ గొప్ప ప్రజా స్వామ్యవాది.ఈ ఆరెస్సెస్-బీజేపీ వారికి ప్రజాస్వామ్యమంటేనే పడదు.రాజ్యాంగమంటేనే గిట్టదు. పైగా అంబేద్కర్‌ను అవమానపరిచారు కూడా!

శివాజీ తమ హిందూ రాజని వేనోళ్ల పొగిడే నేటి కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఏం చేస్తున్నారు? ఆడపిల్లల మాన ప్రాణాలు రక్షిస్తున్నారా? తమ బీజేపీ ఎమ్మెల్యే కులదీప్ సెనెగర్ స్వయంగా ఒక మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడితే, ఆ కేసు కోర్టుకు వెళ్లకుండా ఎన్ని కుట్రలు చేశారూ? ఆ బాలిక తండ్రిని తప్పుడు కేసుల్లో లాకప్‌లో పెట్టి చంపారు. సీబీఐ వాళ్లు దర్యాప్తు చేసి ఎమ్మెల్యేను అరెస్ట్ చేస్తే - ఆ కేసు వీగిపోవడానికి ఆ ఎమ్మెల్యే అనుచరులు ఆ బాలిక తల్లిని, అత్తను, ఇతర కుటుంబ సభ్యుల్ని చంపారు. కోర్టులో సాక్ష్యం ఇప్పించలేని పరిస్థితి కల్పించారు. చివరకు ఆ బాలిక కేసు వాదిస్తున్న లాయరు కారులో ప్రయాణిస్తూ ఉండగా దాన్ని ఓ ట్రక్కుతో గుద్దించారు.

మహిళ హిందువా? ముస్లిమా? అన్నది ఆనాడు శివాజీ మహారాజు పట్టించుకోలేదు. అందరికీ ఒకే న్యాయం వర్తింపజేశాడు. శివాజీని తమ ఆరాధ్యుడిగా చెప్పుకునే బీజేపీ వారు మరి ఇప్పుడేం చేస్తున్నారూ? కతువాలో ముస్లిం మైనర్ బాలికను ఒక ఆలయంలోని గర్భగుడిలో అత్యాచారం చేసే చంపితే- దేశవ్యాప్తంగా అది సంచలన వార్త అయ్యింది కదా? బీజేపీ ఎమ్మెల్యేలు నిందితుడి పక్షాన నిలిచి తర్వాత తీసింది నిజమేకదా? నికృష్టంగా చనిపోయిన ముస్లిం మైనర్ బాలిక పట్ల కనీసం విచారం కూడా వ్యక్తం చేయలేదు. తన గర్భగుడిలో లైంగికదాడి జరుగుతూ ఉంటే మరి ఆ దేవుడేం చేశాడూ?- అన్న ప్రశ్న వస్తుంది కదా?

శివాజీకాలానికి ముందు కోటల నిర్వహణ అగ్రవర్గం వారి అధీనంలో మాత్రమే ఉండేవి. శివాజీ రాజ్యా ధికారం చేపట్టాక ప్రతిభను, సామర్థ్యాన్ని గుర్తించి నిమ్నవర్గం వారికి కోటల నిర్వహణా బాధ్యతను ఇచ్చేవాడు. ఇక రైతుల విషయానికి వస్తే- వాళ్లు-పండించిన పళ్లు, కూరగాయలు, ధాన్యం సైనికులైనా సరే, రైతులకు డబ్బు చెల్లించి కొనుక్కోవాల్సిందే? అదిరించి, బెదిరించి ఉచితంగా తీసుకోవడమంటూ ఉండేది కాదు. ప్రజలంటే ఇక్కడ బహుజనులు, పేద రైతులు మాత్రమేనని- ఉన్నత వర్గాలకు చెందిన ధనవంతులూ బ్రాహ్మణ పీష్వాలు కాదనీ గమ నించిన శివాజీ, వారి వారసత్వపు హక్కుల్ని తొలగించాడు. దానికి తోడుగా జమీందారీ వ్యవస్థను అగ్రహారాల్ని కూడా రద్దు చేశాడు. పైగా రైతులకు భూమి పట్టా హక్కు' లిచ్చాడు. దీన్ని 'కబూలియత్'లనేవారు.

వంశపారంపర్యంగా తేరగా వస్తున్న ఆదాయం శివాజీ చర్యల వల్ల బ్రాహ్మణ పీష్వాలకు దక్కకుండా పోయింది. ఆది వారికి ఆగ్రహం తెప్పించింది. అందుకే వారు శివాజీ మహారాజుకు వ్యతిరేకంగా పనిచేయడం ప్రారం భించారు.



> తండ్రి బాటలో నడిచిన శివాజీ కుమారుడు శంభాజీ శూద్రుడయినప్పటికీ మనుస్మృతిని ధిక్కరించి విద్య నార్జించాడు. అది ఆనాటి బ్రాహ్మణ పీష్వాలకు నచ్చలేదు. అంతేకాకుండా గ్రంథరచనకు పూనుకున్నాడు. "బుద్ధ భూషణం" - అనే పుస్తకం ప్రకటించాడు. ఈ దేశానికి "బౌద్ధం ఒక్కటే మార్గం" అని అన్నాడు. దానితో వైదికులయిన బ్రాహ్మణులకు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. శివాజీ మరో భార్య కుమారుడైన రాజారాంని పీష్వాలు రాజును చేద్దా మనుకున్నారు. అతను వయసులో చాలా చిన్నవాడు. ఆ బాలుణ్ణి అలా సింహాసనం మీద కూర్చోబెట్టి, తాము అధి కారం అనుభవించొచ్చని పీష్వాలు పథకాలు రచించుకున్నారు. కొంతవరకు సాధించుకున్నారు కూడా! శివాజీ కాలం నుండి ఆస్థానంలో ఉన్న ముస్లింలను కిందికులాల అధికారులను ఉన్న ఫళాన తొలగించి అవమాన పరిచారు. అయితే ఫలితం వెంటనే అనుభవించారు. అనుభవజ్ఞ లైన అధికారులూ, వ్యూహకర్తలు లేకపోవడం వల్ల మూడో పానిపట్ యుద్ధంలో అహ్మద్ షా అబ్దాలీ చేతిలో చిత్తు చిత్తుగా ఓడిపోయారు.

పైగా మొఘలులకు సహాయపడడానికి వెనుకాడలేదు. వయసుడిగిన శివాజీకి వ్యతిరేకంగా కుట్రలు పన్నడం ప్రారంభించి, ఎన్నోసార్లు విఫలమై చివరకు 1680లో ఆయనపై విషప్రయోగం చేసి చూపారు. కొంత కాలం తర్వాత పీష్వాలు మొఘలుల సహాయంతో శివాజీ కొడుకు శంభాజీని కూడా 1689లో 'చంపించి, మనుస్మృ తిలో చెప్పిన విధంగా అతి క్రూరంగా శిక్షించారు.

శూద్రుడైనందువల్ల అతని కళ్లుపీకించి, నాలుక తలను కోసి, చర్మం వొలిచి అత్యత దారుణంగా తమ పగ తీర్చుకున్నారు. శంభాజీ తలను కత్తికి గుచ్చి పూణేలో ఊరేగించారు. చక్రవర్తి అయినా సరే, కులధర్మం పాటించని వానికి ఏగతి పడుతుందో ప్రజలకు తెలిసేట్లు చేయాలని పీష్వా బ్రాహ్మణులు ఒక పథకం ప్రకారం మనుస్మృతి నిబంధనలు పాటించారు. ప్రజల్లో భయాందోళనలు కలిగించే ఒక హెచ్చరిక, ఒక సందేశం పంపించారు. పీష్వాలకు శంభాజీ మీద ఎందుకంత కసీ అంటే- వారికి అందుకు తగిన కారణాలే ఉన్నాయి.

తండ్రి బాటలో నడిచిన శివాజీ కుమారుడు శంభాజీ శూద్రుడయినప్పటికీ మనుస్మృతిని ధిక్కరించి విద్య నార్జించాడు. అది ఆనాటి బ్రాహ్మణ పీష్వాలకు నచ్చలేదు. అంతేకాకుండా గ్రంథరచనకు పూనుకున్నాడు. "బుద్ధ భూషణం" - అనే పుస్తకం ప్రకటించాడు. ఈ దేశానికి "బౌద్ధం ఒక్కటే మార్గం" అని అన్నాడు. దానితో వైదికుల యిన బ్రాహ్మణులకు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. శివాజీ మరో భార్య కుమారుడైన రాజారాంని పీష్వాలు రాజును చేద్దా మనుకున్నారు. అతను వయసులో చాలా చిన్నవాడు. ఆ బాలుణ్ణి అలా సింహాసనం మీద కూర్చోబెట్టి, తాము అధి కారం అనుభవించొచ్చని పీష్వాలు పథకాలు రచించుకున్నారు. కొంతవరకు సాధించుకున్నారు కూడా! శివాజీ కాలం నుండి ఆస్థానంలో ఉన్న ముస్లింలను కింది కులాల అధికారులను ఉన్న ఫళాన తొలగించి అవమాన పరిచారు. అయితే ఫలితం వెంటనే అనుభవించారు. అనుభవజ్ఞ లైన అధికారులూ, వ్యూహకర్తలు లేకపోవడం వల్ల మూడో పానిపట్ యుద్ధంలో అహ్మద్ షా అబ్దాలీ చేతిలో చిత్తు చిత్తుగా ఓడిపోయారు.

ఒక రచయిత చేసిన కల్పన నవల అవుతుంది. ఒక దర్శకుడు తన ఊహాశక్తితో చిత్రించింది సినిమాగా రూపుదిద్దుకుంటుంది. నవలగానీ, సినిమా గానీ కల్పనలవుతాయి గానీ, నిజమైన చరిత్ర ఎన్నటికీ కావు. అయితే ఆమాయకుల్ని, మానసిక బలహీనుల్ని అవి కొంతవరకు ప్రభావితం చేస్తాయి. ఇప్పుడు దేశంలో అధికారంలో ఉన్నవారికి కావల్సింది అదే. అందుకే వారు వారి బ్రాండు సినిమాల్ని ప్రమోట్ చేస్తున్నారు. సినిమా చూడండని 'చావా' గురించి స్వయంగా దేశ ప్రధాని ప్రకటించడం అంటే, ఆయన ఆస్థాయిని ఎంత దిగజార్చారో తెలుస్తూ ఉంది. ఇంగిత జ్ఞానం లేని వారికి సినిమాల్లో వాస్తవ చరిత్ర కనిపిస్తే మనం ఆశ్చర్యపోనక్కర లేదు. వాస్తవ చరిత్ర తెలుసుకోవాలంటే చరిత్ర పరిశోధకులు రాసిన గ్రంథాలు చదవాలి. చరిత్రకారుల లేదా హేతుబద్ధంగా మాట్లాడే మేధావుల ఉపన్యా సాలు వినాలి. అంతేగాని, ఒక రాజకీయ పార్టీ తమకు అనుకూలంగా తీయించుకునే సినిమాల్ని నమ్మొద్దు.

విజయవంతంగా నడుస్తున్న సినిమాలు డబ్బులు సంపాదించొచ్చు. దాన్ని అంతవరకే చూడాలి. అంత మాత్రం చేత అందులో చూపించిందంతా నిజమైపోదు. 'చావా' సినిమా దర్శకుడు క్షమాపణ చెప్పాడంటేనే తెలుస్తూ ఉందికదా? చరిత్రను వక్రీకరించిన ఒక తప్పుడు సినిమా చావా అని! అది అలా ఉంచి, హిందుత్వ సుప్రీం లీడర్ సావర్కర్ శంభాజీ గురించి ఏం చెప్పాడో చూడండి. "శంభాజీ మరాఠా సామ్రాజ్యాన్ని పరిపాలించడానికి అర్హుడు కాడు. అతను తాగుబోతు, కోపిష్టి, స్త్రీ లోలుడు"- సిక్స్ గ్లోరియస్ ఎపోచెస్ ఆఫ్ ఇండియన్ హిస్టరీ: రచయిత. వినాయక్ దామోదర్ సావర్కర్. ఇదే విషయం వెనిస్ (ఇటలీ)కి చెందిన చరిత్రకారుడు నికొలవొ మనుచ్చి (1698-1717) చెప్పింది కూడా అదే! ఇతను శంభాజీని కలిసి మాట్లాడి, అప్పుటి విషయాలన్నీ తన స్టొరియో దొ మొగోర్' - అనే గ్రంథంలో గ్రంథస్థం చేశాడు-"శివాజీ ఎన్నో విజయాలు సాధిస్తున్నప్పటికీ అతని కుమారుడు శంభాజీ పట్ల నిరంతరం చింతించేవాడు శంభాజీకి అదుపుచేసి దురలవాట్లు ఉన్నాయి." (పేజి. 204)

శంభాజీకి స్త్రీల పట్ల గల వ్యామోహమే. అతణ్ణి ఔరంగజేబు సైనికులను పట్టించింది. వారు అతణ్ణి తమ సేనాపతి ముకర్రబ్ ఖాన్ దగ్గరకు తీసుకుపోయారు. అతని ఆజ్ఞ ప్రకారం శంభాజీని ఒంటెకు కట్టి గుడారాల చుట్టూ తిప్పారు. చనిపోయాక మతదేహాన్ని వదిలేసి వెళ్ళారు. శంభాజీని మతం మారమని ఔరంగజేబు కోరినట్టు గానీ, శంభాజీ తిరస్కరించినట్టు గాని నికోలవొ మనుచ్చి ఎక్కడా రాయలేదు. అయితే అది హిందూ ముస్లింల మధ్య ద్వేష భావం పెంచడానికి తర్వాత కాలంలో కల్పించి ఉంటారు. మనమిక్కడ తెలుగు రాష్ట్రాల్లో ఉగాది జరుపుకుంటూ ఉంటే- అక్కడ మహారాష్ట్రలో 'గుడిపడవా' ఎందుకు ఎలా జరుపుకుంటున్నారో తెలుసుకోవడం అవసరం. అయినా వందల ఏళ్ళ క్రితం జరిగిన సంఘటనల్ని అప్పటి విషయాలుగానే చూడాలి. అప్పటి విషయాల ఆధారంగా ఇప్పటి ముస్లింలను ద్వేషించమని చెప్పడం ఏమాత్రం వివేకమనిపించుకోదు.

ఇకపోతే, ఆనాడు ఔరంగజేబుకు సన్నిహితులు హిందూ రాజులబండేవారు. శివాజీ అంగరక్షకులు, సేనాధి పతులు ముస్లింలుండేవారు. బ్రాహ్మణ పీష్వాల కుట్రల్ని చేదిస్తూ ఆ ముస్లింలే శివాజీని కాపాడుకున్నారు. అందువల్ల, శివాజీ హిందూ మతాన్ని ఉద్ధరించాడని చెప్పడం అసంబద్ధంగా తోస్తుంది. అదొక పెద్ద అబద్ధం. ఎక్కడా లేని కాళీ మాత ఆయనకు ప్రత్యక్షమై ఖడ్గమిచ్చిందనడం మరో పెద్ద అబద్ధం. ఇలాంటివన్నీ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు చేస్తున్న దుష్ప్రచారం మాత్రమే! ఇంగిత జ్ఞానం ఉన్నవారికి ఈ విషయం సులభంగా అర్థమవుతుంది.

అలాగే మనుస్మృతిలో శూద్రులను ఎలా శిక్షించాలో వివరంగా రాసి ఉన్నదని - నాటి పీష్వా బ్రాహ్మణులు క్రూరంగా ప్రవర్తించారని - సమకాలీనంలో ఉన్న మన బ్రాహ్మణ సోదరులను ద్వేషించలేము కదా? మానవ వాదులుగా- మనమంతా మనుషులం గనక, మనుషులుగా, సమానులుగా ప్రవర్తించాలని, ఒకరినొకరు గౌరవించుకోవా లని-పనులన్నీ మనిషి కేంద్రంగా జరుగుతూ ఉండాలని మాత్రం తప్పక కోరుకుంటూ ఉందాం! బ్రాహ్మణ, క్షత్రియ, శూద్ర, అతి శూద్ర లాంటి మాటలు వాడకుండా ఉందాం!! కుల మతాలకు అతీతంగా మనుషులుగా, కేవలం మను షులుగా ప్రపంచ జనావళితో ఐక్యమవుదాం! జై సంవిధాన్! జై ఇన్సాన్ !!లను అనుక్షణం మనసుల్లో నిలుపుకుందాం.

వ్యాసకర్త: త్రిపురనేని రామస్వామి జాతీయ పురస్కార తొలిగ్రహీత.



> కాశీ, మధురల డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ, 1860 దేవాలయాలపై 'పరిశోధనలు' జరిపామనీ, వాటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని కాషాయ వస్త్రాలు ధరించిన ఒక వ్యక్తి పేర్కొన్నాడు. హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి మదర్సాలను మూసివేసి, ఇంగ్లీష్ పాఠశాలల్ని గురుకులాలుగా మార్చాలని కూడా డిమాండ్ చేశారు. 2024 లో ప్రచురితమైన ఒక పుస్తకంలో ఇర్ఫాన్ ఇంజనీర్, నేహా దభాడే, మత సంబంధమైన పండుగలను హింసను ప్రేరేపించే సందర్భాలుగా ఉపయోగించడంపై మన దృష్టిని ఆకర్షించారు. మన పండుగలు మతపరమైన హద్దులు దాటి ఆహ్లాదకరమైన సామాజిక సందర్భాలుగా ఉంటున్నాయి. ఇప్పుడేమో హిందూ పండుగల సందర్భంగా ఊరేగింపులు నిర్వహించడం, ముస్లింల నివాస ప్రాంతాల గుండా వెళ్ళడం, మసీదులపై ఉన్న ఆకుపచ్చ జెండాను కాషాయ జెండాగా మార్చడం, చేతుల్లో కత్తులు పట్టుకొని నృత్యం చెయ్యడం ఒక ధోరణిగా మారింది.

హిందూ పండుగలు - ఏకపక్ష జాతీయవాద రాజకీయాలు



రామ్ పునియానీ

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూటమి లక్ష్యమైన 'హిందూ రాజ్య స్థాపన' ఎజెండా బహూముఖ పద్ధతుల్లో ప్రాచుర్యం పొందిన కథనాలపై నిర్మించబడుతుంది. దాని ఎజెండాను ముందుకు తీసుకెళ్లే అంశాల్లో పండుగలు ఒకటి. 'సామాజిక రాజకీయ సందేశం' లో భాగంగా కొద్దిమంది దేవతల్ని ముందుకు తీసుకొని రావడం కూడా రాజకీయ రంగంలో ప్రధానమైన మార్గంగా ఉంది. ఇటీవలి కాలంలో జరిగిన కుంభమేళా ఓ పెద్ద దృశ్యం. మతపరమైన సమ్మేళనం కంటే కూడా ఇది ఒక జాతీయ కార్యక్రమంగా మారింది. ఈ సంవత్సరం జరిగిన కుంభమేళాలో ఒక ప్రధానమైన మార్పు ఏమంటే, దాని భారీ మార్కెటింగ్ ఒక సాంస్కృతిక, అభివృద్ధి ప్రదర్శనగా మారింది. దాన్ని, హిందూ మతం కోసం ఏర్పాటు చేసిన 'భూమి పై మహా ప్రదర్శన' గా ముద్ర వేశారు.

> ఈసారి కుంభమేళాకు ఒక రాజకీయ రంగును ఇస్తుండడం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. కుంభమేళాను నిర్వహించడం ఇదే ప్రథమం కాదు. ఈసారి ఈ సందర్భం, హిందుత్వ ఎజెండా ప్రాధాన్యతను పెంచే వేదికగా మారింది. జన సమూహాల నిర్వహణ సాధ్యం కాదని గుర్తించినప్పటికీ కూడా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆహ్వానించేందుకు ప్రకటనల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఈ కార్యక్రమంలో ముస్లిం వ్యాపారస్తులు తమ దుకాణాలు ఏర్పాటు చేసే ప్రక్రియను బహిష్కరించారు. దీనికి అనేక కారణాలున్నాయి. ముస్లింలు ఆహారంలో ఉమ్మి వేశారు కాబట్టే వారిని దూరంగా ఉంచారనే విషయాన్ని స్వామీ అవిముక్తేశ్వరానంద్ ఒక అబద్ధం చెప్పాడు. అలాంటి తప్పుదారి పట్టించే చాలా వీడియోలు సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ సందర్భంగా తొక్కిసలాటలో బాధితులైన వారి కోసం ముస్లింలు మసీదుల్ని తెరిచి, వారి కోసం ఆహారాన్ని ఏర్పాటు చేయడం వేరే విషయం.

అలాంటి సందర్భాల్లో భక్తుల కోసం బస, పరిశుభ్రత, రవాణా ఏర్పాట్లు ప్రభుత్వం తప్పనిసరిగా నిర్వర్తించాల్సిన విధి. ఈ దఫా ఈ కార్యక్రమాన్ని నిర్వహించే ప్రక్రియలో ప్రభుత్వం పూర్తిగా నిమగ్నమైంది. విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్ పీ), ధర్మ సంసద్, లాంటి పాలక పార్టీ అనుబంధ సంస్థలు, వ్యక్తిగత సాధువుల లాంటి వారు కూడా హిందూ జాతీయవాద ఎజెండాలోని అంశాల్ని, 'ముస్లింల పట్ల ద్వేష భావాల్ని' ప్రచారం చెయ్యడంలో ముందు భాగంలో ఉన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మతపరమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఒకవైపున భక్తులు ఎంతగానో అభినందిస్తుండగా, ఈసారి కుంభ మేళాకు ఒక రాజకీయ రంగును ఇస్తుండడం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. కుంభమేళాను నిర్వహించడం ఇదే ప్రథమం కాదు. ఈసారి ఈ సందర్భం, హిందూత్వ ఎజెండా ప్రాధాన్యతను పెంచే వేదికగా మారింది. జన సమూహాల నిర్వహణ సాధ్యం కాదని గుర్తించినప్పటికీ కూడా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆహ్వానించేందుకు ప్రకటనల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఈ కార్యక్రమంలో ముస్లిం వ్యాపారస్తులు తమ దుకాణాలు ఏర్పాటు చేసే ప్రక్రియను బహిష్కరించారు. దీనికి అనేక కారణాలున్నాయి. ముస్లింలు ఆహారంలో ఉమ్మి వేశారు కాబట్టే వారిని దూరంగా ఉంచారనే విషయాన్ని స్వామీ అవిముక్తేశ్వరానంద్ ఒక అబద్ధం చెప్పాడు. అలాంటి తప్పుదారి పట్టించే చాలా వీడియోలు సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ సందర్భంగా తొక్కిసలాటలో బాధితులైన వారి కోసం ముస్లింలు మసీదుల్ని తెరిచి, వారి కోసం ఆహారాన్ని ఏర్పాటు చేయడం వేరే విషయం.

మొగలుల పాలనా కాలంలో భక్తులకు కుంభమేళా మరింత సౌకర్యవంతంగా ఉంచడానికి అనేక ఘాట్‌లు (స్నానాల కోసం నదీ తీరాలు), మరుగుదొడ్లు నిర్మించిన విషయం గుర్తుకొస్తుంది. అక్బర్, కుంభమేళా ఏర్పాట్లను చూసేందుకు ఇద్దరు అధికారులను నియమించాడని హేరాంబ్ చతుర్వేది అనే చరిత్రకారుడు చెప్పారు. ఈ సంవత్సరం ఆ ప్రాంతమంతా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ హోర్డింగులతో నిండిపోయింది.ఈసారి వీఐపీల కోసం విశాలంగా ఎక్కువ ప్రాంతాన్ని కేటాయించడంతో తొక్కిసలాటలు జరిగాయి, దానిలో చాలా పెద్దసంఖ్యలో భక్తులు చనిపోయారు. రవాణా ఏర్పాట్లు చాలా ఘోరంగా ఉన్నాయి. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో సంభవించిన మరణాల్లో ఈ రవాణా ఏర్పాట్లు ప్రతిబింబిస్తాయి. తొక్కిసలాటలో చనిపోయిన వారంతా మోక్షం (విముక్తి) పొందారని, మోడీ, తాను తమ్ముడని పిలుచుకునే ఉన్నత శ్రేణి స్వామి, ధీరేంద్ర శాస్త్రి చాలా సంతోషంగా చెప్పాడు. నీటి నాణ్యత అధిక మల మూత్రాలతో చాలా తక్కువ స్థాయిలో ఉంది. నీటి నాణ్యత, మరణాల గురించి వచ్చిన విమర్శలన్నింటికీ, "పందులు మురికిని చూస్తున్నాయి, స్వార్థపరులు చనిపోయిన వారిని లెక్కిస్తున్నారని" ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించాడు. వీహెచ్‌పీ, దాని మార్గదర్శక్ మండల్ సమావేశాల కోసం కుంభమేళాను ఒక సువర్ణావకాశంగా ఉపయోగించుకుంది. వారి ప్రసంగాలు మొత్తం ముస్లింలపై విషాన్ని చిమ్మాయి. జనాభా పెరుగుదల, బంగ్లాదేశ్ నుంచి చొరబాటుదారులు, గో రక్షణ లాంటి ముస్లింల గురించి సాధారణంగా చేసే ప్రచా రం వివిధ సమావేశాల్లో అదే పనిగా రోత పుట్టించే రీతిలో పునరావృతం అయ్యింది. సాధ్వి రితంభర, ప్రవీణ్ తొగాడియా, యతి నర్సింగ్ నానంద్ సరస్వతీ లాంటి ద్వేషాన్ని వ్యాపింపచేసే వారు ద్వేషపూరిత ప్రసంగాలతో సంబరాలు చేసుకున్నారు. ప్రేక్షకులు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పాలక భారతీయ జనతా పార్టీ దాని రాజకీయ ఎజెండా కోసం విజయవంతంగా సాధువులను ఉపయోగించుకొని, ప్రభుత్వ ఖర్చుతో ప్రచారాన్ని పొదింది.

కాశీ, మధురల డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ, 1860 దేవాలయాలపై 'పరిశోధనలు' జరిపామనీ, వాటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని కాషాయ వస్త్రాలు ధరించిన ఒక వ్యక్తి పేర్కొన్నాడు. హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి మదర్సాలను మూసివేసి, ఇంగ్లీష్ పాఠశాలల్ని గురుకులాలుగా మార్చాలని కూడా డిమాండ్ చేశారు. 2024 లో ప్రచురితమైన ఒక పుస్తకంలో ఇర్ఫాన్ ఇంజనీర్, నేహా దభాడే, మత సంబంధమైన పండుగలను హింసను ప్రేరేపించే సందర్భాలుగా ఉపయోగించడంపై మన దృష్టిని ఆకర్షించారు. మన పండుగలు మతపరమైన హద్దులు దాటి ఆహ్లాదకరమైన సామాజిక సందర్భాలుగా ఉంటున్నాయి. ఇప్పుడేమో హిందూ పండుగల సందర్భంగా ఊరేగింపులు నిర్వహించడం, ముస్లింల నివాస ప్రాంతాల గుండా వెళ్ళడం, మసీదులపై ఉన్న ఆకుపచ్చ జెండాను కాషాయ జెండాగా మార్చడం, చేతుల్లో కత్తులు పట్టుకొని నృత్యం చెయ్యడం ఒక ధోరణిగా మారింది. అదే సమయంలో ముస్లింలకు వ్యతిరేకంగా దిక్కులు పిక్కటిల్లేలా ద్వేషపూరిత నినాదాలు ఇస్తున్నారు. ఇదే పుస్తకంలో, 2022-2023లో శ్రీరామనవమి సందర్భంగా హౌరా, హుగ్లీ (పశ్చిమబెంగాల్-2023)లో, సంబాజీ నగర్ (మహారాష్ట్ర -2023)లో, వడోదరా (గుజరాత్ -2023)లో, బీహార్ షరీఫ్, ససారాం (బీహార్ -2023)లో, ఖర్గోన్ (మధ్యప్రదేశ్ -2022)లో, హిమ్మత్ నగర్, ఖంబాత్ (గుజరాత్ -2022) లో, లోహర్దగా (జార్ఖండ్-2022)లో హింసాత్మక సంఘటనలు జరిగాయనే విషయాన్ని ఇద్దరు రచయితలు లేవనెత్తారు.

"మతపరమైన ప్రదర్శన"గా నమ్మించే హిందూ జాతీయవాదుల చిన్న సమూహం కూడా మైనార్టీల నివాస ప్రాంతం గుండా వెళ్లాలని పట్టుబట్టి, రాజకీయ దూషణలతో కూడిన నినాదాలిచ్చి కొందరు యువకుల్ని రెచ్చగొట్టడం, హింసాత్మక పాటలు, సంగీతాన్ని వినిపిస్తే, దానికి ప్రతిస్పందనగా వారిపై రాయి విసిరితే, మైనారిటీల్ని పెద్ద సంఖ్యలో అరెస్ట్ చెయ్యడం, ఎలాంటి న్యాయ సంబంధ ప్రక్రియ లేకుండా కొన్ని రోజుల్లోనే వారి ఇళ్ళు, ఆస్తులను ధ్వంసం చెయ్యడం ద్వారా ప్రభుత్వం మిగిలిన పని చేస్తుందని వారు ఆశిస్తున్నారని" ఇంజనీర్ ముగించాడు. మరొక స్థాయిలో మితవాద రాజకీయాలు ఆదివాసీ ప్రాంతాల్లో శబరి, హనుమంతుని గురించి మాట్లాడుతూ, వారిని తెరపైకి తెచ్చే విధంగా ప్రోత్సహిస్తున్నారు. గడచిన మూడు దశాబ్దాల కాలంలో ఆదివాసీ ప్రాంతాల్లో క్రైస్తవ వ్యతిరేక హింస పెరగడంతో, వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్, వీహెచ్‌పీ (ఆరెస్సెస్ సంతానం)లు ఈ ప్రాంతాల్లో శబరిని తెరపైకి తెచే ప్రయత్నాలు చేశాయి. గుజరాత్‌లో డాంగ్స్ దగ్గరలో శబరి కుంభ్ నిర్వహించారు. ఈ ప్రాంతంలోనే ఒక శబరి దేవాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో వీహెచ్‌పీ కి చెందిన స్వామి అసీమానంద్ ఆ ప్రాంతంలోనే పని చేస్తున్నాడు. అతడే, తర్వాత కాలంలో మాలేగావ్, అజ్మర్, మక్కా మసీదుల్లో జరిగిన బాంబు పేలుళ్ల కుట్ర కేసులో పాత్రదారునిగా ఉన్నాడని మహారాష్ట్ర యాంటీ టెర్రర్ స్క్వాడ్ అతనిపై ఆరోపణలు చేసింది.ఈ ప్రాంతాల్లో శబరి, హనుమంతుడ్ని తెరపైకి తేవడానికి ఎందుకు ఎంచుకున్నారు? శబరి (రామాయణంలో)ఒక పేద మహిళ. రామునికి పెట్టేందుకు ఆమె వద్ద తగినంత ఆహారం లేదు. ఆమె బెర్రీ పండ్ల రుచిని పరీక్షించిన తర్వాతే రామునికి ఇచ్చింది. ఇక్కడ తేడా స్పష్టంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో మనకు పూజించడానికి దుర్గా, లక్ష్మి, సరస్వతి ఉంటే, ఆదివాసీ ప్రాంతాల్లో శబరి ఉంటుంది. అదే విధంగా ఆదివాసీ ప్రాంతాల్లో హనుమంతునికి (రామ భక్తుడు) ప్రాచుర్యం ఎక్కువ. మన పండుగలపై హిందూత్వ రాజకీయాల ప్రభావం వారి రాజకీయాల్లో చాలా ప్రతిబింబిస్తుంది. వీటిలో కొన్నింటిని ఆయు ధంగా ఉపయోగిస్తున్న తీరు, లేక కుంభమేళాను ముస్లిం వ్యతిరేక వేదికగా మార్చిన తీరు, లేదా ఆదివాసీ ప్రాంతాల్లో శబరి, హనుమంతునికి బాగా ప్రాచుర్యం కల్పించిన విధానం ఆలోచించ దగిన విలువైన అంశాలు.

("న్యూస్ క్లిక్" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451



రాజే...కూలై!

సీతాకోకచిలుకలు
గొంగళి పురుగులౌతున్నాయి!
రైతుపాగా కష్టాలకు తాకట్టయి
బతుకు రంగస్థలంపై దక్కిన
వలసకూలీ పాత్ర
రక్తి కట్టించలేక కన్నీళ్లలో గతాన్ని
నెమరేసుకొంటుంటే
ఎద్దుల్ని అదిలించిన కమ్చీకర్ర వీపున
చెళ్లున మోగుతున్నట్టుంది వర్తమానం!

దొరలా కంటినిండా నిద్రపోయిన గతం
దోమల మురుగు ఇరుకులో మనసు
తెర్చుకొని
కండ్లు మూసికొని అదేపనిగా
చూస్తోంది
పరమాన్నం పంచిన పిడికిలి
గంజినీళ్ల పిసకలేక నెత్తి
కొట్టుకుంటోంది
పదుగుర్ని అదిలించిన గొంతు
మేస్త్రీ బెదిరింపుల్ని దిగమింగి
మూగబోయింది

గిట్టుబాటు పుట్టని సర్దుబాటు
అప్పుల ఊబిలో బతికిచెడ్డ మరో జన్మ
పొలం పుట్రా, గొడ్డు గోదా,
గౌరవం మర్యాదా
అయినకాడికి అమ్ముకొని
దక్కినకాడికి తలదించుకొని
ఉన్నకాడికి కాళ్లు ముడుచుకొని

పల్లెతల్లిని దూరం చేసి పట్నంలో
దినసరి కూలీలా బతుకుబండిని
భారంగా మార్చిన దురదృష్టాన్ని
తర్కించుకొంటూ
ఎత్తిన పాగా దించికట్టి
ఇటుక పెళ్లలు మోస్తున్నాడు
రైతు కష్టం అందరికీ అరిష్టమే!

- భీమవరపు పురుషోత్తమ్,
9949800253

బిజినెస్



మెట్రో నిర్వహణలోకి రైలు వికాస్ నిగమ్..

అంతర్జాతీయ భాగస్వాములతో జట్టు

బెంగళూరు మెట్రోపై దృష్టి

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని రైలు వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌విఎన్‌ఎల్) మెట్రో నిర్వహణ రంగంలోకి ప్రవేశించడానికి కసరత్తు చేస్తోంది. అంతర్జాతీయ భాగస్వాములతో జట్టు కట్టడం ద్వారా మెట్రో కార్యకలాపాలు, నిర్వహణ వ్యాపారాన్ని చేపట్టాలని యోచిస్తున్నట్టు ఆర్‌విఎన్‌ఎల్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ప్రదీప్ గౌర్ తెలిపారు. బెంగుళూరు మెట్రో ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్ (ఓఅండ్‌ఎం) కాంట్రాక్టులను చేపట్టేందుకు జర్మనీకి చెందిన డ్యుయిష్ బాన్ (డీబీ)తో చర్చలు జరుపుతున్నామని గౌర్ ఇటీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. భారత్‌లో మెట్రో ప్రాజెక్టుల కోసం ఓఅండ్‌ఎం చేపట్టేందుకు డీబీ తమ కంపెనీని సంప్రదించిందన్నారు. బెంగళూరు మెట్రో కోసం ఈ భాగస్వామ్యాన్ని అంచనా వేస్తున్నామని చెప్పారు. అదే విధంగా చెన్నయ్ మెట్రో ప్రాజెక్టు కోసం ఓఅండ్‌ఎం హక్కులను పొందేందుకు ఆసక్తి చూపుతున్నామన్నారు. ఢిల్లీ–మీరట్ ప్రాంతీయ ర్యాపిడ్ రైల్ ప్రాజెక్ట్ కోసం జర్మన్ కంపెనీ ఇప్పటికే 12 సంవత్సరాల ఓఅండ్‌ఎం కాంట్రాక్టును కలిగి ఉందన్నారు.

"మేము ఇప్పటికే ఢిల్లీలో నమోభారత్ కారిడార్‌ను నిర్వహిస్తున్నాము. దేశంలో మరిన్ని ఓఅండ్‌ఎం ప్రాజెక్టులు లేదా భాగస్వామ్యాల కోసం చర్చలు జరుపుతున్నాము. మెట్రో రైలు మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులలో ఆర్‌విఎన్‌ఎల్ పాల్గొంటుంది." అని గౌర్ తెలిపారు. చెన్నై, ఇండోర్, అహ్మదాబాద్, సూరత్, నాగ్‌పూర్, పుణెలలో మెట్రో ప్రాజెక్టులను చేపట్టనున్నామన్నారు. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, యూఏఈ, టర్కీ, పెరూ దేశాల్లోనూ తమ కార్యకలాపాలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తమ మొత్తం రూ.1 లక్ష కోట్ల ఆర్డర్ బుక్‌లో విదేశీ పోర్టుపోలియో వ్యాపారం 5 శాతం వాటాను కలిగి ఉందన్నారు. వీటిని మొత్తం ఆర్డర్‌లో 50 శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తాము రైల్వేయేతర ప్రాజెక్ట్‌లలో ట్రాన్స్‌మిషన్ లైన్లు, సోలార్ ప్రాజెక్ట్‌లు, జాతీయ రహదారులను కూడా కలిగి ఉన్నామన్నారు.

వడ్డీ రేట్లు తగ్గొచ్చు : ఎస్బీఐ రీసెర్చ్

ముంబయి : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తదుపరి ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లో వడ్డీ రేట్లను తగ్గించొచ్చని ఎస్బీఐ రీసెర్చ్ ఎకోరాప్ తాజా రిపోర్ట్‌లో అంచనా వేసింది. ఈ ఏడాది ఏప్రిల్, జూన్, అక్టోబర్ నెలల్లో జరిగే విధాన సమీక్షల్లో రెపోరేటును 25 బేసిస్ పాయింట్ల చొప్పున మొత్తం 75 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశాలున్నాయని విశ్లేషించింది. దాదాపు ఐదేండ్ల తర్వాత ఇటీవల ఆర్బీఐ నూతన గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన సంజయ్ మల్హోత్రా ఆర్బీఐ గవర్నర్ ఫిబ్రవరి సమీక్షలో వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వచ్చే ఏప్రిల్, జూన్ ద్రవ్య సమీక్షల్లోనూ వడ్డీరేట్లు 25 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గవచ్చని, ఆగస్టులో విరామం ఇచ్చి అక్టోబర్ సమీక్షలో మళ్లీ 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చని ఎస్బీఐ రిసెర్చ్ అంచనా వేసింది.

బంగారం ఆల్‌టైం రికార్డ్ ధర

ఔన్స్ ధర 3000 డాలర్లు



న్యూఢిల్లీ : అంతర్జాతీయంగా, దేశీయంగా బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేపడుతున్న ఆర్థిక అనిశ్చితి నిర్ణయాలు పసిడి డిమాండ్‌కు ఆజ్యం పోస్తోన్నాయి. మరోవైపు అమెరికాలో ఆర్థిక మాంద్యం ఏర్పడొచ్చనే ఆందోళనల నేపథ్యంలో ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడిగా బంగారాన్ని ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే అంతర్జాతీయ మార్కెట్‌లో శుక్రవారం ఒక్క ఔన్స్ (31.10 గ్రాముల) బంగారం ధర 3000 డాలర్లకు చేరి.. నూతన రికార్డ్ స్థాయికి ఎగిసింది. స్పాట్ గోల్డ్ ధర 0.4 శాతం పెరిగి 3,000.87 డాలర్లుగా పలకడం ఇదే తొలిసారి. ఔన్స్ వెండి ధర 0.4 శాతం పెరిగి 33.94 డాలర్లుగా, ప్లాటినం ధర 0.5 శాతం తగ్గి 989.04 డాలర్లుగా పలికింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.1200 పెరిగి రూ.89,780గా, 22 క్యారెట్లపై రూ.1100 ఎగిసి రూ.82,300గా నమోదయ్యింది. కిలో వెండిపై రూ.2000 ఎగిసి రూ.1,12,000కు చేరింది. గత కొన్ని రోజులుగా భారీగా పెరుగుతున్న బంగారం, వెండి ధరలు ట్రంప్ వాణిజ్య యుద్ధంతో మరింత పెరిగే అవకాశం ఉందని బులియన్ వర్గాల నిపుణులు అంచనా వేస్తున్నారు.

బీమాపై జీఎస్టీ తగ్గింపునకు కసరత్తు..!

న్యూఢిల్లీ : బీమా ప్రీమియం వసూళ్లపై విధిస్తున్న వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ను తగ్గించే విషయమై కేంద్ర ప్రభుత్వం తాజాగా బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ నుంచి సూచనలు కోరిందని తెలుస్తోంది. ఐఆర్‌డీఏఐ సూచనలను పరిగణలోకి తీసుకుని వచ్చే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో రేట్లను సమీక్షించే అవకాశాలున్నాయని సమాచారం. ప్రస్తుతం వైద్య, జీవిత బీమా ప్రీమియంలపై 18 శాతం జీఎస్టీ అమల్లో ఉంది. అధిక పన్ను రేట్లు వైద్య, జీవిత బీమాకు పాలసీదారులను దూరం చేస్తోందనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి ప్రీమియం వసూళ్లపై జీఎస్టీని సున్నా లేదా 5 శాతం లేదా 12 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయనే అంచనాలు ఉన్నాయి.

అనురాగ్ యూనివర్సిటీ

బ్రాండ్ అంబాసిడర్‌గా విజయ్ దేవరకొండ

హైదరాబాద్ : ప్రయివేటు విద్యా సంస్థ అనురాగ్ యూనివర్సిటీ తన బ్రాండ్ అంబాసీడర్‌గా నటుడు విజయ్ దేవరకొండను నియమించుకున్నట్టు ప్రకటించింది. నగరంలోని వెంకటాపూర్ క్యాంపస్‌లో గురువారం రాత్రి ఆ సంస్థ 'సినర్జీ 2౩25' వార్షికోత్సవాన్ని నిర్వహించింది. దీనికి ముఖ్య అతిథిగా విజయ్ దేవరకొండ హాజరై సందడి చేశారు. యూనివర్సిటీ పనితీరు, విజయాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని విజయ్ పేర్కొన్నారు. కాబట్టి తాను ఈ యూనివర్సిటీకి బ్రాండ్‌అంబాసీడర్‌గా ఉండాలని నిర్ణయించుకున్నానన్నారు.

ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ వాటా పెంపు

న్యూఢిల్లీ : ఇండస్ ఇండ్ బ్యాంక్ స్టాక్ తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్న వేళ మరోవైపు హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ సంస్థ ఆ స్టాక్‌లో వాటాలను పెంచుకుంది. 2025 మార్చి 11న మార్కెట్ ముగిసే సమయానికి ఇండస్ ఇండ్ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ పథకాల మొత్తం హోల్డింగ్‌లు 5.02 శాతంగా ఉన్నాయని బ్యాంకు పేర్కొంది. మార్చి 11కు ముందు ఈ వాటా 4.82 శాతంగా ఉంది. ఇది 3,75,29,368 షేర్లకు సమానం. మార్చి 11న ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా 15,92,410 షేర్లు లేదా 0.20 శాతం అదనపు వాటాను కొనుగోలు చేసింది. దీంతో మొత్తం షేర్ల సంఖ్య 3,91,21,778 లేదా 5.02 శాతం వాటాకు పెరిగింది.

పెరిగిన విదేశీ మారకం నిల్వలు

న్యూఢిల్లీ : భారత విదేశీ మారకం నిల్వల్లో పెరుగుదల నమోదయ్యింది. మార్చి7తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వలు 15.25 బిలియన్ డాలర్లు పెరిగి 653.97 బిలియన్ డాలర్లకు చేరాయని ఆర్‌బిఐ శుక్రవారం వెల్లడించింది. అంతకుముందు ఫిబ్రవరి 28తో ముగిసిన వారంలో 1.7 బిలియన్ డాలర్లు తగ్గి 638.69 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇంతక్రితం కొన్ని వారాల పాటు భారీగా ఫారెక్స్ నిధులు పడిపోయాయి. గతేడాది సెప్టెంబర్ చివరినాటికి విదేశీ మారక నిల్వలు రికార్డ్ స్థాయిలో 704.88 బిలియన్ డాలర్ల గరిష్ట స్థాయికి పెరిగాయి. అంతర్జాతీయ పరిణామాలకు తోడు దేశీయంగా భారత మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోవడం, ఎఫ్ఐఐలు తరలిపోవడంతో ఇటీవలి కాలంలో భారీగా పతనమయ్యాయి.

నీడ లేదు.. నీళ్లు లేవు..!

- అవస్థలు పడుతున్న ఉపాధిహామీ కూలీలు
- ఎండల తీవ్రత పెరగడంతో మరిన్ని ఇబ్బందులు
- కేంద్రం కఠిన నిబంధనలతో ఇక్కట్లు

పని ప్రదేశాల్లో కనిపించని కనీస సౌకర్యాలు

మౌలిక వసతులపై అధికారులు దృష్టిసారించాలని విన్నపం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ రూరల్

నిలువ నీడ లేదు.. తాగేందుకు నీళ్ల లేవు.. ఆ దరిదాపుల్లో ఏదైనా చెట్టు ఉంటే కాసేపు సేదతీరడం లేదంటే.. భగభగ మండుతున్న ఎండలోనే మాడిపోవడం.. ఇదీ ఉపాధి హామీ కూలీల దుస్థితి. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలనే నిబంధనలు ఉన్నా.. అటు కేంద్ర రాష్ట్ర పభుత్వాలు.. ఇటు అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా అనేక ఇబ్బందులు, సమస్యల మధ్య నిరుపేద కూలీలు రాష్ట్రంలో పనిచేస్తున్నారు. చట్ట ప్రకారం పని ప్రదేశాల్లో కూలీలకు నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు అందించాల్సి ఉన్నా ఇవేవీ ఎక్కడా అందుబాటులో లేవు. ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కూలీలకు వేసవి కాలంలో అదనపు భత్యం చెల్లించాల్సి ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ వేసవిలో పనులు ప్రారంభమై పక్షం రోజులు కావస్తున్నా పని ప్రదేశాల్లో మౌలిక వసతులపై అధికార యంత్రాంగం దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి. కూలీలకు ఇంటి నుంచి తెచ్చుకున్న నీళ్లే దిక్కవుతుండగా.. ఎండ వేడిమికి తట్టుకోలేక విలవిల్లాడుతున్నారు. ఈ క్రమంలో ఉపాధి హామీ చట్టం పనులు, పని ప్రదేశాల్లో కూలీల అవస్థలపై కథనం..



వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలకు ఉపాధి హామీ పనులే ఆధారం. ప్రతి పేద కుటుంబానికీ ఏడాదిలో వంద రోజుల పని కల్పించాలని ఉపాధి హామీ చట్టం చెబుతోంది. దీంతో అనేక మంది పేదలు ఉపాధిహామీ పనులపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. గతంలో కూలీలు ఉదయం నుంచి ఎండ వచ్చే లోపు ఇంటికి చేరుకోగా.. కేంద్ర ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసింది. తప్పనిసరిగా రోజంతా పనిచేయాలని.. రెండు పూటల హాజరు నమోదు చేసుకోవాలని నిబంధన తీసుకొచ్చింది. దీంతో ఉపాధి కూలీలు ఉదయం వెళ్తే సాయంత్రం వరకు పని ప్రదేశాల్లోనే ఉండాల్సి వస్తోంది. పని ప్రదేశాల్లో కచ్చితంగా నీడ కల్పించడంతోపాటు తాగునీరు, పనిముట్లు ఉచితంగా అందజేయాల్సి ఉంటుంది. కానీ కొన్నేండ్ల నుంచి వీటి జాడ లేకుండా పోవడంతో కూలీలు సొంత పనిముట్లతోపాటు తాగునీటిని ఇంటి నుంచే తీసుకెళ్లాల్సి వస్తోంది. వెంట తీసుకెళ్లిన బాటిల్ నీళ్ల సాయంత్రం వరకు సరిపోకపోయినా సరిపెట్టుకొంటున్నారు.

కనిపించని సౌకర్యాలు..

రాష్ట్ర వ్యాప్తంగా 53.08లక్షల మందికి ఉపాధి కార్డులున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 11లక్షల మంది నిరుపేదలు ఈ ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 1.73లక్షల ఉపాధికార్డులు ఉండగా, వీటి పరిధిలో 3.46లక్షల మంది కూలీలు నమోదు చేసుకున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 1.23లక్షల కార్డులకుగాను 2.44లక్షల మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. మంచిర్యాల జిల్లాలో 1.21లక్షల కార్డులకుగాను 2.36లక్షల మంది, నిర్మల్ జిల్లాలో 1.77లక్షల కార్డులకుగాను 3.37లక్షల మంది ఉపాధి పనులకు వెళ్తున్నట్టు నమోదు చేసుకున్నారు.

ఈ పనులకు వెళ్లే కూలీలకు పని ప్రదేశాల్లో తప్పనిసరిగా నీడ కోసం టార్పాలిన్, తాగునీటి సౌకర్యంతో పాటు పనిముట్లు, ప్రాథమిక చికిత్స పెట్టెలు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. కానీ ఇవేమీ కనిపించడం లేదు. ఇప్పటికే ఎండలు మండుతున్న దృష్ట్యా అనేక మంది ఎండల తీవ్రతకు తాళలేక అస్వస్థతకు గురవుతున్న సందర్భాలున్నాయి. గతంలో వడదెబ్బ బారిన పడి పలువురు మృతిచెందిన ఘటనలూ ఉన్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. "పనులు ప్రారంభమై వారం రోజులే అవుతోంది. పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం. సౌకర్యాలు కల్పిస్తాం" అని అధికారులు అంటున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం

గంగన్న, ఉపాధిహామీ కూలి



పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. నీళ్ల ఇంటి నుంచే తెచ్చుకుంటున్నాం. నీడకోసం టార్పా లిన్లు ఇవ్వడంలేదు. ఎండలోనే పనిచే యాల్సి వస్తోంది. అధికారులు మా సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించాలి.

సమయానికి డబ్బులు రావడం లేదు

గోదావరి, ఉపాధి హామీ కూలి



ఉపాధి పనులకు వెళ్తున్నా రోజుకు కనీసం రూ.300 కూడా రావడం లేదు. డబ్బులు ఖాతాల్లోకి రావడంలోనూ ఆలస్యం జరుగుతోం ది. వారాల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. మరోపక్క వంద రోజులు పని కూడా కల్పించకపోగా పనిముట్లు ఇవ్వడం లేదు.

రోబోకు అనుసంధానంగా ప్రత్యేక యంత్రాల వినియోగం

- టన్నెల్‌లో సహాయక చర్యల్లో మార్పులు



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద స్థలంలో సహాయక చర్యల వేగవంతానికి హైడ్రాలిక్ పవర్ రోబోకు అనుసంధానంగా ప్రత్యేక యంత్రాలను ఉపయోగిస్తున్నారు. 30శాతం సామర్థ్యం గల లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంపు, వాక్యూమ్ ట్యాంకుతో కూడిన మెషిన్‌ను సమర్థవంతమైన సహాయక చర్యల కోసం పంపినట్టు అధికారులు వెల్లడించారు. ఈ యంత్రాలు మట్టిని త్వరగా తొలగించేందుకు, టన్నెల్ లోపల పనులను వేగవంతం చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ సహాయక బృందాల ఉన్నతాధికారులతో శుక్రవారం సహాయక చర్యలపై సమీక్షించారు. మాన్యువల్ డిగ్గింగ్‌కు బదులుగా అటానమస్ హైడ్రాలిక్ పవర్ రోబోను వినియోగిస్తున్నారని, ఇది అధునాతన సాంకేతికతతో టన్నెల్ లోపల డిగ్గింగ్ ప్రక్రియను నిర్వహిస్తోందని తెలిపారు. డిగ్గింగ్‌లో వచ్చే మట్టిని వేగంగా బయటకు తీయడానికి ఈ ప్రక్రియను ఏర్పాటు చేసినట్టు అధికారులు వివరించారు. వాక్యూమ్ ట్యాంకు ద్వారా వచ్చిన మట్టిని, గంటకు 620 క్యూబిక్ మీటర్ల బురదతో కూడిన మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలించొచ్చని తెలిపారు. అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానం గల యంత్రాల వినియోగం ద్వారా సహాయక చర్యలను మరింత సమర్థంగా, వేగంగా పూర్తి చేయడానికి సహాయపడుతుందని తెలిపారు.



హోలీ వేడుకల్లో మంత్రి సీతక్క

నవతెలంగాణ - ములుగు

అమ్మగా ఆప్యాయతలను కనబరిచే మంత్రి సీతక్క శుక్రవారం భద్రతా సిబ్బందితో కలిసి హైదరాబాద్‌లో హోలీ పండుగను జరుపుకున్నారు. ఆమె నాయకురాలే కాదు.. తన భద్రతా సిబ్బందిని అమ్మలా, అక్కలా ప్రేమగా చూసుకుంటారు. మంత్రి సీతక్క హైదరాబాద్‌లోని అధికారిక నివాసంలో కుటుంబ సభ్యులు, సిబ్బందితో కలిసి హెూలీ ఆడారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ తనకోసం భద్రతను కల్పిస్తున్న తన కుటుంబ సభ్యులతో కలిసి హెూలీ జరుపుకోవడం సంతోషంగా ఉందని సీతక్క అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



నేటినుంచి ఒంటిపూట బడులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు యాజమాన్యాల్లోని అన్ని పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలల్లో అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఒంటిపూట బడులు వచ్చేనెల 23 వరకు కొనసాగుతాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు జరుగుతాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు యథావిధిగా ప్రత్యేక తరగతులను నిర్వహించాల్సి ఉంటుంది. అయితే పదో తరగతి పరీక్షా కేంద్రాలుండే పాఠశాలల్లో మాత్రం ఈనెల 21 నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకు మధ్యాహ్న ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులను నిర్వహించాలి. ఈ ఆదేశాలను అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు అమలు చేయాలి. వచ్చేనెల 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులుంటాయి.

కాంగ్రెస్ అప్రజాస్వామిక చర్యలను ఎండగట్టండి

బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను ఎండగట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని శాసనసభ నుంచి సస్పెండ్ చేయడంపై గులాబి దళం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలిపిందని కొనియాడారు. బీఆర్ఎస్ శ్రేణులు ఉద్యమ స్పూర్తితో కాంగ్రెస్ నిరంకుశత్వానికి నిరసనగా తమ గళం విప్పారని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య విలువలకు ప్రతిరూపమైన అసెంబ్లీని తన నియంతృత్వ పోకడలతో రేవంత్ రెడ్డి భ్రష్టు పట్టించారని విమ ర్శించారు. ఎన్నికల ముంది చ్చిన హామలు అమలు చేయలేక అసెంబ్లీలో తమ సభ్యులపై కుట్ర చేస్తున్నా రని ఆరోపించారు. సభలో తమ గొంతు నొక్కితే ప్రజా కోర్టులో తేల్చుకుంటామని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బీజేపీ నేతలతో రేవంత్ రహస్య సమావేశాలు : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తన పదవిని కాపాడుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీ నేతలతో రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆరోపించారు.

కాంగ్రెస్ సీఎంగా ఉంటూ బీజేపీ నేతలతో రహస్య సమావేశాలు నిర్వహించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. "కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులున్నారంటూ మాట్లాడిన రాహుల్‌గాంధీ, రేవంత్ బీజేపీతో చేసుకుంటున్న చీకటి ఒప్పందాలపై స్పందించాలి. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలతో దొరికిపోయిన ఆయనపై చర్యలు తీసుకోవాలి, రైతులు, విద్యార్థుల ఆత్మహత్యలపై ఒక్క సమీక్షా సమావేశం నిర్వహించే తీరిక సీఎంకు లేదు గానీ... బీజేపీ నేతలలో రహస్య సమావేశాలకు మాత్రం సమయం దొరుకుతుంది. సీఎంగా విఫలమైన రేవంత్ తన కుర్చీ చేజారే సూచనలు కనిపించడంతోనే బీజేపీతో డీల్ కుదుర్చుకున్నారు" అని కేటీఆర్ రేవంత్‌పై విమర్శలు గుప్పించారు.

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని విచారించిన పోలీసులు

ఫామ్‌హౌస్‌లో కోడిపందెం కేసులో..

- మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ



నవతెలంగాణ-మొయినాబాద్

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పరిధిలోని ఫామ్‌హౌస్‌లో కోడి పందెం నిర్వహణ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని పోలీసులు విచారించారు. శుక్రవారం మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 4గంటలపాటు విచారించి, ఆ ఘటనలో ఎమ్మెల్సీ పాత్రపై వివ రాలు సేకరించారు. గతంలో ఎమ్మెల్సీకి చెందిన ఫామ్‌హౌస్‌లో పలువురు కోడిపందాలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించి, సుమారు 60 మందిని అరెస్టు చేశారు. ఈ కేసు విచారణలో ఉంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 11:30 నిమిషాలకు ఎమ్మెల్సీ మొయినాబాద్ పీఎస్‌కు వచ్చారు. పోలీసులు స్టేషన్ ఆవరణలోకి కేవలం ఆయనను మాత్రమే అనుమతించారు. నాలుగు గంటలు విచారించారు. ఫామ్‌హౌస్ లీజ్, కోడిపందెం నిర్వహణ, తదితర విషయాలపై ఎమ్మెల్సీని పోలీసులు ప్రశ్నించారు. మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో స్టేషన్ నుంచి ఎమ్మెల్సీ బయటకు వచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి విలేక రులతో మాట్లాడుతూ.. తోల్కట్ట రెవెన్యూ పరిధిలో ఉన్న ఫామ్‌హౌస్ తనదే అన్నారు. దాన్ని తన అల్లుడు రమేష్‌రెడ్డి చూసుకుంటు న్నారని, లీజ్‌కు ఇచ్చానని వివరించారు. కోడిపందాలు నిర్వహించిన వారిపై తాను కేసులు పెట్టినట్టు చెప్పారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తనపై కూడా కేసు నమోదు చేశారని వివరించారు. విచారణకు సహకరించినట్టు తెలిపారు. మళ్లీ ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతానని స్పష్టం చేశారు.

లాకప్ డెత్?

(మొదటి పేజీ తరువాయి)

దోషులను కఠినంగా శిక్షించి.. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపల్లి జిల్లాకు చెందిన సంపత్(34) జగిత్యాల జిల్లా కేంద్రంలో శ్రీరామ ఇంటర్నేషనల్ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ పేరుతో పలువురిని ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం పంపించాడు. సంపత్ ద్వారా గల్ఫ్, దుబాయికి వెళ్లిన కొందరికి పని లేక ఇబ్బందులు పడ్డారు. తమను కావాలనే నకిలీ వీసాలపై పంపించి మోసం చేశాడని బాధితులు నిజామాబాద్ జిల్లాలోని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంపత్‌తోపాటు మరొకరిని రిమాండ్‌కు తరలించారు. దాంతో ఈ నెల 12వ తేదీన పోలీసులు వారిని తమ కస్టడీకి తీసుకున్నారు. గురువారం విచారణ నిమిత్తం జగిత్యాలలో సంపత్ నిర్వహిస్తున్న కన్సల్టెన్సీకి కూడా తీసుకెళ్లారు. రాత్రి సమయంలో నిజామాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

మార్గమధ్యలో పోలీస్ కస్టడీలో ఉన్న సంపత్ అస్వస్థతకు గురవడంతో నిజామాబాద్‌లోని జీజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్టు చెబుతున్నారు. కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం ఉదయం ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రిలో సంపత్ మృతదేహాన్ని చూసి వారు బోరున విలపించారు. అన్యాయంగా తన భర్తను అరెస్టు చేసి తీవ్రంగా కొట్టడంతోనే మృతి చెందాడని మృతుని భార్య ఆరోపించారు. తన భర్తను అరెస్టు చేసి తీసుకొచ్చిన పోలీసులు ఇప్పుడు మృతదేహాన్ని అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బందోబస్తు నిర్వహించారు.

గుండెపోటుతోనే మృతిచెందాడు : సీపీ

సంపత్ గుండెపోటుతోనే మృతి చెందినట్టు సీపీ సాయిచైతన్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మీడియాకు ప్రకటన విడుదల చేశారు. మార్చి 12న సంపత్‌ను పోలీసు కస్టడీకి తీసుకున్నారని, తనపై నమోదైన కేసుల్లో స్వచ్ఛందంగా నేరంలో తన ప్రమేయాన్ని అంగీకరించాడని తెలిపారు. తన కార్యాలయంలో రెండు మొబైల్ ఫోన్‌లు దాచిపెట్టడంతో అతని అంగీకారంతోనే జగిత్యాలకు ప్రయాణమవడం, మొబైల్ ఫోన్లను రికవరీ చేయడం, తిరిగి నిజామాబాద్‌కు తిరిగి రావడం వంటి మొత్తం ప్రక్రియను పట్టపగలు బహిరంగంగా నిర్వహించామని సీపీ పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అంతటా ఇద్దరు మధ్యవర్తులు, నిందితులు వీరితోపాటు సీపీపీఎస్ అధికారులున్నారని తెలిపారు.

మొబైల్ ఫోన్‌ల స్వాధీనం ప్రక్రియ పూర్తయిన తర్వాత నిందితుడిని ఈనెల 13న రాత్రి 9.45 గంటలకు నిజామాబాద్‌లోని సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు సురక్షితంగా పంపించారని, అయితే రాత్రి తర్వాత నిందితుడు అకస్మాత్తుగా తన ఎడమ చేయి లాగడం, అలసట, నొప్పి సమస్యలతో బాధపడుతున్నట్టు పోలీసుల దృష్టికి తీసుకొస్తే.. వైద్య సహాయం కోసం నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. నిందితుడు సంపత్ స్వయంగా ఆస్పత్రిలోకి నడుచుకుంటూ వెళ్లడం సీసీటీవీ ఫుటేజీల్లో స్పష్టంగా రికార్డు అయినట్టు తెలిపారు. రాత్రి 12.29 గంటలకు నిందితుడికి గుండెపోటు రావడంతో ఆస్పత్రిలోనే కుప్ప కూలిపోయాడని సీపీ తెలిపారు. మృతిపట్ల ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపడుతున్నామని, దర్యాప్తును డీఎస్పీ స్థాయి అధికారి నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

సమగ్ర విచారణ చేపట్టి దోషులపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ(ఎం)

పోలీసు కస్టడీలో చనిపోయిన సంపత్ మృతిపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. పోలీసుల వ్యవహారం వల్లే చనిపోయినట్టు కుటుంబ సభ్యుల ఆరోపణలను దృష్టిలో పెట్టుకొని సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు. సంపత్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. సంపత్‌కు నలుగురు చిన్నపిల్లలు ఉన్నారని, ఆయన మరణంతో ఆ కుటుంబం అనాథగా మారిందని, పోలీస్ కస్టడీలో ఉన్నప్పుడే సంపత్ మరణించినందున ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, తగిన నష్టపరిహారం చెల్లించాలని, ఆయన భార్యకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.



దద్దరిల్లిన పిడిగుద్దులాట

- పోలీసుల ఆంక్షల మధ్య కొనసాగిన ప్రాచీన ఆట

నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ జిల్లా సాలూర మండలం హూన్సా గ్రామస్తులు హోలీ పండుగలో భాగంగా నిర్వహించుకునే వారి సంప్రదాయ ఆట పిడిగుద్దులాట శుక్రవారం గ్రామస్తులంతా కలిసి సంతోషంగా జరుపుకున్నారు. గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో ఇరువైపునా పెద్ద దుంగలు పెట్టి వాటికి బలమైన తాడును కట్టారు. అనంతరం గ్రామంలోని కుల సంఘాల పెద్దల దగ్గరకు డప్పులతో వెళ్లి బొట్టుపెట్టి ఆట వద్దకు ఆహ్వానించారు.

ఆరు నిమిషాలపాటు హెూరాహెూరీగా పిడిగుద్దులాట సాగింది. ఈ ఆటను తిలకించడానికి సమీప గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. కులాలకతీతంగా గ్రామస్తులు వచ్చి తాడును పట్టుకొని గుద్దుకోవడం ఆట తీరు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా బోధన్ రూరల్ సీఐ విజయబాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఆరు నిమిషాలపాటు కొనసాగిన అనంతరం ఆట ముగిసింది. చివరి దశలో తాడును తొలగించడంతో ఆట ముగిసినట్టు భావించి ఆటగాళ్ల వెనుదిరిగారు. ఆటలో ఒకరికి ఒకరు కొట్టుకున్నా తిరిగి స్నేహ భావంతో గ్రామస్తులు ఆలింగనం చేసుకొని ఆట నుంచి నిష్క్రమించారు. ఇద్దరుముగ్గురు గాయపడగా.. కాముడి బూడిద పూసుకొని వెళ్లిపోవడం గమనార్హం.

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి అన్యాయం జరగదు

- డీలిమిటేషన్ తర్వాతే మహిళా రిజర్వేషన్ బిల్లు
- ఆరు గ్యారంటీలపై అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలి
- ఓటమి భయంతోనే విద్వేషాలతో డీఎంకే ముందుకు : ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయంగానీ, నష్టంగానీ జరుగదని రాజ్యసభ సభ్యులు, బీజేపీ పార్లమెంట్ బోర్డు సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ చెప్పారు. డీలిమిటేషన్‌ను పక్కనబెట్టి ముందు రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీల అమలుపై అఖిల పక్షాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. పార్లమెంట్ డీలిమిటేషన్ బిల్లు తర్వాతనే మహిళా రిజర్వేషన్ బిల్లును పెడతామని స్పష్టం చేశారు. తమిళనాడులో వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేందుకు డీఎంకే యత్నిస్తున్నదని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. డీలిమిటేషన్ పేరుతో ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలను డీఎంకే సంప్రదించిందన్నారు. డీఎంకే అఖిలపక్షానికి వెళ్తామని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రకటించాయని గుర్తుచేశారు. డీలిమిటేషన్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్న అఖిల పక్ష సమావేశాన్ని ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. తమిళనాడులో స్టాలిన్ సర్కారు అవినీతిలో, మద్యం కుంభకోణంలో కూరుకుపోయిందని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ ఎదుగుదలను డీఎంకే, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. రేవంత్ పాలనలో తెలంగాణ ప్రజలు విసిగిపోయారన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే స్టాలిన్, రేవంత్‌రెడ్డిలు విభజించు, పాలించు లక్ష్యంగా ముందుకు నడుస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అవకాశవాద రాజకీయాలను దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాజ్యాంగం ప్రకారమే డీలిమిటేషన్ జరుగుతోందన్నారు.

దళితుల సమస్యల పట్ల బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి లేదు

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దళితుల సమస్యల పట్ల బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి లేదని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కారణంగానే ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేశారని తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం దళితులకు విలువ ఇవ్వలేదని తెలిపారు. ఇప్పుడు స్పీకర్‌ను ఆ పార్టీ అవమానించిందని గుర్తు చేశారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పదేండ్లు ప్రభుత్వంలో ఉన్న బీఆర్ఎస్... స్పీకర్‌కు ఇస్తున్న విలువ ఏంటో అర్థమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్‌ను అవమానించి, అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తేసేదాకా కేటీఆర్ నిరాహార దీక్ష చేస్తాననడం హాస్యాస్పదమని తెలిపారు. గతంలో కూడా బీఆర్ఎస్ దళితులకు గౌరవమివ్వలేదని విమర్శించారు.

రాజ్‌భవన్‌లో హోలీ సంబురాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో శుక్రవారం హోలీ సంబురాలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రాజ్‌భవన్ ఉద్యోగుల పిల్లలు, అధికారులు, సిబ్బందితో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆనందం, సామరస్యం, ఐక్యతతో ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు.

పోలీసుల అదుపులో కి'లేడీ'..!

- పాఠశాల బాలికలకు డ్రగ్స్ ఇచ్చి స్పృహ కోల్పోయాక కిడ్నాప్
- ఆ తర్వాత లైంగికదాడి..!

నవతెలంగాణ-వరంగల్

డ్రగ్స్‌కు బానిసైన ఓ కిలాడి లేడీ తనతో పాటు మరికొందరితో ఓ ముఠాగా ఏర్పడి వరంగల్ నగరంలో వ్యభిచారం నడుపుతున్న ఉదంతం సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతోంది. బాలికలు పాఠశాలకు వెళ్లి వచ్చే క్రమంలో వారితో మాటలు కలిపి చనువుగా ఉంటూ వారికి తెలియకుండా డ్రగ్స్ ఇచ్చి స్పృహ కోల్పోయిన తర్వాత వారిని విటులకు అప్పగించి వ్యభిచారం నిర్వహిస్తున్న ఘటన మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. హన్మకొండ జిల్లా దామెర మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆ లేడీ వరంగల్ నగరంలో కొంతకాలంగా నివాసం ఉంటునట్టు తెలుస్తోంది. రెండ్రోజుల కిందట ఓ బాలిక తప్పిపోవడంతో తల్లిదండ్రులు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కొద్ది సేపటికి ఇంటికి తిరిగి వచ్చిన బాధిత బాలికను పోలీసులు ప్రశ్నించారు. దాంతో కిలాడీ లేడీ భాగోతం ఒక్కొక్కటిగా బయటపడింది. తనను ఓ మహిళ కిడ్నాప్ చేసి తీసుకెళ్లిందని, ఆ తర్వాత స్పృహ కోల్పోయానని.. తనకేం జరిగిందో గుర్తుకు లేదని, స్పృహలోకి వచ్చిన తర్వాత తనని కొందరు వదిలేసి వెళ్లారని సదరు బాలిక తెలిపింది. దాంతో పోలీసులు ఆ బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. డ్రగ్స్ ఇచ్చి అమ్మాయిపై లైంగికదాడి చేసినట్టు నిర్ధారించారు. ఆ బాలిక ఇచ్చిన సమాచారం మేరకు దర్యాప్తు చేపట్టి పోలీసులు లేడీని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. నిందితురాలు ఎవరు, ఆ ముఠా సభ్యులు ఎవరు అనేది పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

హోలీ వేళ విషాదాలు

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థి, బావిలో ఈతకెళ్లి యువకుడు మృతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్/ న్యాల్‌కల్

రంగుల హోలీ పండుగ వేళ పలుచోట్ల విషాద ఘటనలు జరిగాయి. హోలీ ఆడిన అనంతరం రోడ్డు ప్రమాదంలో పదో తరగతి విద్యార్థి, ఈతకు వెళ్లి ఓ యువకుడు మృతిచెందారు. ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త కుమ్మరివాడకు చెందిన జిల్లెడ్‌వార్ రుషికుమార్, ప్రేమ్ రంగులు చల్లుకుని హోలీ ఆడారు. అనంతరం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఏరోడ్రమ్ వద్ద అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. దీంతో రుషి అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రేమ్‌కు తీవ్రగాయాలు కావడంతో రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ రిమ్స్‌కు చేరుకొని వివరాలు సేకరించారు. ఇద్దరు విద్యార్థులు పట్టణంలోని సేవాదాస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థి చనిపోవడంతో తల్లిదండ్రులతో పాటు తోటి విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సునీల్ కుమార్ తెలిపారు.సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని వడ్డీ గ్రామ యువకుడు శివకుమార్(19) స్నేహితులతో కలిసి హోలీ ఆడారు. అనంతరం శంశోల్లాపూర్ గ్రామ శివారులో బావిలో ఈతకు వెళ్లారు. ప్రమాదవశాత్తు శివకుమార్ నీటిలో మునిగిపోయి మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే గ్రామస్తులు, హద్నూర్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి బావిలో గాలింపు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం వరకు మృతదేహం లభ్యం కాలేదు.

మున్నేరు గోడ ముమ్మరం

3.50 లక్షల క్యూసెక్కుల వరద ప్రామాణికంగా నిర్మాణం

- ప్రభుత్వ భూమి ఉన్న చోట పనులు చకచకా
- భూ సేకరణ పూర్తయితే మరింత పురోగతి
- బ్యాక్ వాటర్ ఎఫెక్ట్ లేకుండా ప్రకాశ్ నగర్ చెక్ డ్యాం తొలగింపు
- బ్రిడ్జీలకు ముప్పు లేకుండా.. టౌన్ వాటర్ నదిలో కలవకుండా డ్రయినేజీలు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం జిల్లాలో మున్నేరు నదికి ఇరువైపులా గోడల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రతి 15 రోజులకు ఒకసారి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్మాణ పనులపై నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. ఖమ్మం అర్బన్ మండలం వైపు పనుల నిర్వహణ ఎలా ఉందో.. ఎప్పటికప్పుడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం పర్యవేక్షిస్తున్నారు. వచ్చే వర్షాకాలం నాటికి కొంతమేరకైనా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇరువురు మంత్రులు దృష్టి సారించడంతో పనులు గాడినపడ్డాయి. రక్షణ గోడలకు ఆనుకొని ప్రత్యేకంగా రహదారి, దీనిపక్కనే మురుగుకాల్వ నిర్మించనున్నారు. ఖమ్మం నగరం నుంచి వెలువడే మురుగునీరు మున్నేరులో కలిసేలా రక్షణ గోడల పొడవునా పది మీటర్ల వెడల్పుతో మురుగుకాల్వ నిర్మాణం చేపడతారు. ప్రభుత్వ భూమి ఉన్న చోట ప్రస్తుతం గోడల పనులు కొనసాగుతున్నాయి. భూసేకరణ ప్రక్రియ పూర్తయితే పనులు మరింత వేగం అందుకుంటాయి.

ఆర్‌సీసీ వాల్ నిర్మాణమిలా..

మున్నేరు ఉధృతికి ఖమ్మం నగరంతో పాటు ఖమ్మం రూరల్ మండలంలోని పదుల సంఖ్యలో కాలనీలను వరద నీరు ముంచెత్తింది. మున్నేరు వరదల నుంచి ప్రజలకు శాశ్వతంగా విముక్తి కల్పించేందుకు రూ.690 కోట్లతో గోడల నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. నిధుల లేమి కారణంగా దశలవారీగా పనులు చేపట్టాలని కాంగ్రెస్ సర్కారు సంకల్పించింది. వేలాది మందిని ముంపు నుంచి కాపాడేందుకు గోడలు నిర్మించాల్సిందేనని పట్టుబట్టడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.501 కోట్లతో మున్నేరుకు రెండువైపులా రక్షణ గోడల నిర్మాణానికి ముందడుగు పడింది. 2024 మార్చిలో టెండర్లు పూర్తవగా ఏప్రిల్‌లో పనులు మొదలయ్యాయి. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి నుంచి ప్రకాశ్‌నగర్ వరకు 8.50 కి.మీ.. రామన్నపేట నుంచి ప్రకాశ్‌నగర్ వైపు 8.50 కి.మీ మేర పొడవు, ఆ ప్రాంతంలోని ఎత్తు పల్లాల ఆధారంగా 45-25 అడుగుల ఎత్తుతో కాంక్రీట్ గోడలు నిర్మిస్తున్నారు.

ప్రకాశ్ నగర్ చెక్ డ్యాం తొలగించేలా డిజైన్..

కాసులకు కక్కుర్తి పడి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖమ్మంలోని ప్రకాష్ నగర్ వద్ద 2.9 మీటర్ల ఎత్తుతో భూగర్భ జలాల పెంపు పేరుతో చెక్ డ్యాం నిర్మించింది. దీని కారణంగా ఖమ్మం మున్నేరుకు వరదలు సంభవించిన విషయం తెలిసిందే. రూ.8 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ చెక్ డ్యాం వల్ల వరద నీరు ఎగదన్ని ఖమ్మం అర్బన్, రూరల్ మండలాల్లోని మున్నేరు పరివాహక ప్రాంతం ముంపునకు లోనైంది. దీన్ని నిర్మించాక వరుసగా రెండేండ్లు ముంపు చోటుచేసుకుంది. రెండు సార్లలో రూ.500 కోట్లకు పైగా ఆస్తి నష్టం సంభవించింది. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ అధికారులు రూపొందించిన మున్నేరు ఆర్‌సీసీ వాల్ డిజైన్‌లో ఈ చెక్ డ్యాంను తొలగించాలని నిర్ణయించారు. వర్షాకాలం నాటికి చెక్‌డ్యామ్‌ను తొలగించనున్నారు.

రూరల్ వైపు పనుల్లో పురోగతి..

ప్రస్తుతం గోడ నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ స్థలాలు ఉన్నచోట ఈ పనులు నిర్వహిస్తున్నారు. ఖమ్మం రూరల్ మండలం వైపు ఎక్కువగా ప్రభుత్వ స్థలాలు ఉండటంతో గోడ నిర్మాణ పనులు పాలేరు నియోజకవర్గంలో ఎక్కువగా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకూ 4 కి.మీ మేర మట్టి పనులు పూర్తి కాగా, రెండు కిలోమీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేశారు. 3.50 లక్షల క్యూసెక్కుల వరదను ప్రామాణికంగా తీసుకొని ఎత్తు పల్లాల ఆధారంగా గోడ నిర్మాణం చేపట్టారు. మొత్తం 4 కి.మీల మట్టి పనుల్లో అత్యధికం 3.2 కి.మీ రూరల్ మండలం వైపే నిర్వహించారు. కేవలం 800 మీటర్లు మాత్రమే అర్బన్ వైపు చేపట్టారు. గోడలకు ఇరువైపులా మురుగు కాలవలు నిర్వహిస్తున్న దృష్ట్యా నగరంలోని వరద నీరు మురుగు కాలవ ద్వారా ప్రకాష్ నగర్ వెలుపలా మున్నేరుతో జత కలుస్తాయి. కాబట్టి బ్రిడ్జీలకు ఎటువంటి ముప్పు ఉండకుండా గోడల నిర్మాణ డిజైన్ రూపకల్పన చేశారు.

భూసేకరణ ప్రక్రియ పూర్తయితే పనులు చకచకా...

గోడల నిర్మాణానికి 177 ఎకరాల భూమి సేకరించాలని అధికారులు నిర్ణయించారు. మున్నేరుకు రెండువైపులా 300 మీటర్ల మేర భూమిని సేకరించాల్సి ఉంది. ఇందుకోసం రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. 25 గృహాలను తొలగించాలని గుర్తించారు. రక్షణ గోడల నిర్మాణం కోసం నిర్వాసితులు తమ భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. అయితే, ఇందుకోసం భూములు, ఇండ్లకు పరిహారం ఖరారు కావాల్సి ఉంది. కాబట్టి 1969లో నాగార్జునసాగర్ కాల్వ నిర్మాణం కోసం సేకరించిన భూమిలో కాల్వ నిర్మించగా మిగిలిన భూమిని రైతులు ఇప్పటికీ సేద్యం చేసుకుంటున్నారు. ఆ భూమిని సేకరించి మున్నేరు గోడ నిర్వాసితులకు ఇచ్చే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అర్బన్ వైపు 112 ఎకరాలు, రూరల్ వైపు 65 ఎకరాల భూమి ప్రయివేట్ వ్యక్తుల నుంచి సేకరించాల్సి ఉంది. రెండు మండలాల్లో కలిపి 80 ఎకరాల భూమి ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఆ భూమిలో గోడల నిర్మాణం చేపట్టింది. సేకరణ ప్రక్రియ పూర్తయితేనే పనులు మరింత వేగం పుంజుకోనున్నాయి. సుమారు 500 మందికి పైగా పనులు చేస్తున్నారు. కాంట్రాక్టు సంస్థకు 2026 మార్చి నాటికి రక్షణ గోడల నిర్మాణాలు పూర్తిచేయాలని ప్రభుత్వం గడువు నిర్ధారించింది. భూసేకరణ ప్రక్రియ పూర్తయితే వచ్చే ఏడాది వర్షాకాలం నాటికి రక్షణ గోడల నిర్మాణ పనులు పూర్తవుతాయని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి

తెలంగాణ రాష్ట్ర ఐఈఆర్‌పీల సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగ విద్యార్థులకు బోధన అందిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ రాష్ట్ర ఐఈఆర్‌పీల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, మారిపెల్లి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై సుప్రీం కోర్టు ఇచ్చిన కీలక తీర్పును గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2023-24 లెక్కల ప్రకారం 81వేల మంది వికలాంగ పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో నమోదై ఉన్నారని తెలిపారు. ప్రస్తుత విద్యా శాఖ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక ఉపా ధ్యాయులైన ఐఈఆర్‌పీలు 790 మంది ఉన్నారని పేర్కొన్నారు. గత 19 ఏండ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు ఈ నెల ఏడున ఇచ్చిన తీర్పు ప్రకారం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వికలాంగ పిల్లలకు విద్యాబోధనందిస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుల సర్వీసును పరిగణనలోకి తీసుకుని వారికి పేస్కేల్ ఇవ్వాలని ధర్మాసనం తీర్పును వెలువరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ తీర్పుననుసరించి మహారాష్ట్రలో 3,100 మంది, మణిపూర్‌లో 272 మంది, హర్యానాలో 146 మందిని ఆయా ప్రభుత్వాలు క్రమబద్ధీకరించాయని గుర్తు చేశారు. ఐఈఆర్‌పీలు ప్రత్యేక విద్యకు సంబంధిం చిన విద్యార్హతలు కలిగి ఉన్నారని తెలిపారు.

రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చేత గుర్తింపబడిన సర్టిఫికెట్‌ను కలిగి ఉన్నారనీ, నోటిఫికేషన్ ద్వారా రాత పరీక్ష నిర్వహించి రోస్టర్ కం రిజర్వేషన్ పద్ధతిలో నియమించబడ్డారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 2020-21 విద్యా సంవత్సరం లెక్కల ఆధారంగా జీవో 97 ప్రకారం 18,500 మంది పిల్లలకు 1523 పోస్టులు (ప్రాథమిక స్థాయిలో 796 ఎస్‌జీటీ పోస్టులు , ఉన్నత స్థాయిలో 727 పోస్టులు) శాంక్షన్ చేశారని తెలిపారు. ఇందులో ప్రమోషన్ల కోసం 516 పోస్టులను పక్కన పెట్టారని పేర్కొన్నారు. ప్రమోషన్‌కి అర్హత ఉన్నా ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌జీటీలు లేక పోవటం వల్ల 384 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అదే విధంగా నోటిఫికేషన్ ఇచ్చిన 796 ఎస్‌జీటీ పోస్టుల్లో 277 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన 220 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 30 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా మిగిలున్నాయని తెలిపారు. మొత్తంగా 670 పోస్టుల వరకు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

గత 19 ఏండ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగ పిల్లలకు విద్యాబో ధననందిస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులైన ఐఈఆర్‌పీల సర్వీస్‌ని పరిగణనలోకి తీసుకునీ, సుప్రీంకోర్టు తీర్పుకనుగుణంగా పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.



జీవిత లక్ష్య సాధనకు ఆ పుస్తకం దోహదం

- 'సాఫ్ట్ స్కిల్ ఫర్ సక్సెస్' ఆవిష్కరణలో హీరో విజయ్ దేవరకొండ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మన జీవిత లక్ష్యాన్ని సాధించేందుకు 'సాఫ్ట్ స్కిల్ ఫర్ సక్సెస్' పుస్తకం దోహదం చేస్తుందని ప్రముఖ సినిమా హీరో విజయ్ దేవరకొండ తెలిపారు. పోచారం మున్సిపాలిటీ పరిధి వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ప్రముఖ మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ మహిపతీ శ్రీనివాస్ రావు రచించిన సాఫ్ట్ స్కిల్స్ ఫర్ సక్సెస్ పుస్తకాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు ఆ పుస్తకం మార్గం చూపెడుతుం దన్నారు. పుస్తక రచయిత డాక్టర్ మహిపతీ శ్రీనివాస్ రావును అభినందిం చారు. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ విజయ దేవర కొండ తల్లి మాధవి సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ కావడంతో ఆమె దగ్గర నుంచి సాఫ్ట్ స్కిల్స్‌ను అందిపుచ్చుకున్న ఆయన అనేక రంగాల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు. ఈ పుస్తకం ద్వారా భావవ్యక్తీకరణ, నైపుణ్యాలు, భావోద్వేగాలు, సమన్వయం, సమయ పాలన, సమస్యల నుంచి పరిష్కారాలు తెలుసుకోవడం, నాయకత్వ లక్షణాల గురించి తెలుసుకోవచ్చని వివరించారు. ఈ పుస్తక రచనకు ప్రోత్సహించి, ఆవిష్కరణ దిశగా నడిపించిన అనురాగ్ యూనివర్సిటీ చైర్మెన్, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి, అనురాగ్ యూనివర్సిటీ సీఈఓ ఎస్. నీలిమా, అనురాగ్ అకాడమీ లీడర్ షిప్ టీంకు, తన సతీమణి డాక్టర్ అరుణ కుమారి, కుమార్తె వీణా రావు, తల్లి సౌభాగ్యమ్మ, చెల్లెలు ఎం. గాయత్రీ, అల్లుడు చేతన్ సాయి కృష్ణ, ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేటి సమాజానికి ఎంతో అవసరం : పల్లా రాజేశ్వర్ రెడ్డి

నేటి సమాజానికి ఇలాంటి పుస్తకం ఎంతో అవసరమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ పుస్తక రచయిత డాక్టర్ మహిపతీ శ్రీనివాస్ రావుకు అభినందించారు.

జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ సభ్యులు జగదీశ్‌రెడ్డిపై ఏకపక్షంగా విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తి వేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను అవమానించలేదనీ, చట్టసభలంటే బీఆర్ఎస్‌కు ఎనలేని గౌరవమని గుర్తు చేశారు. తమ సభ్యుడు శాసనసభలో వ్యక్తిగతంగా దూషించినట్టు వీడియో ఉంటే బయట పెట్టాలని డిమాండ్ చేశారు. స్పీకర్ దళితుడు కావడంతోనే గౌరవించటం లేదనే కొత్త వాదాన్ని తేవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ సభను, ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దళితులపై గౌరవంతోనే తమ పార్టీ దేశంలో ఎక్కడా లేని విధంగా నెక్లెస్ రోడ్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేసి సభను సజావుగా నడపాలని సూచించారు.

సీఎంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై ఆ పార్టీ నేతలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానందగౌడ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు పేట్ బషీరాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కాగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌వో ఈ సందర్భంగా వారికి తెలిపారు.

కేసీఆర్‌ను ఏమైనా చేయాలని కుట్ర చేస్తున్నారా?

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

సీఎం రేవంత్‌రెడ్డిపై పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు



నవతెలంగాణ - బంజారాహిల్స్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌నుద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్‌ను ఏమైనా చేయాలని కుట్ర చేస్తున్నారా అని అనుమానం వ్యక్తం చేశారు. అనుమానాస్పద ఘటనలు జరిగితేనే డెడ్ బాడీలు మార్చురీకి వెళ్తాయన్నారు. మరి మార్చురీకి వెళ్తాయని సీఎం రేవంత్‌రెడ్డి అనడం ఏంటని ప్రశ్నించారు. తప్పుడు వాగ్దానాలను ప్రశ్నించినందుకా మార్చురీకి పోయేది? అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసినందుకా? అని నిలదీశారు. ఓ ఎమ్మెల్యే, సీఎం రేవంత్ రెడ్డి కలిసి కేసీఆర్‌ను హత్య చేయాలని కుట్ర చేస్తున్నారా అని ప్రశ్నించారు. మార్చురీ అని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. నోరు తెరిస్తే బూతులు మాట్లాడే ఏకైక సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. ఇలాంటి భాషను పిల్లలు కూడా నేర్చుకుంటు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌పై మాట్లాడిన భాషపై డీజీపీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి డబ్బులు ఇచ్చి పీసీసీ అధ్యక్ష పదవి కొన్నారని సాక్షాత్తు తోటి మంత్రి కోమటిరెడ్డినే అన్నారని గుర్తు చేశారు. 'నీ బ్లాక్ మెయిల్ ఏంటో మీ నాయకులకు తెలుసని' అన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. అంతకుముందు బంజారాహిల్స్‌లో ఖైరతాబాద్ సీనియర్ నాయకులు మన్నె గోవర్ధన్‌రెడ్డి సైతం ఫిర్యాదు చేశారు.

కాగితాల్లోనే మిగులు విద్యుత్

(మొదటిపేజీ తరువాయి)

ఎందుకొస్తుందని విద్యుత్‌రంగ నిపుణులు ఎమ్ వేణుగోపాలరావు ప్రశ్నించారు. దానికి డిస్కంలు ఇచ్చిన సమాధానం 'ఏవేవో అనుకుంటాం...అవన్నీ జరుగుతాయా ఏంటి? అని అదేదో సినిమాలో డైలాగ్ చెప్పినట్టు గమ్మత్తుగా జవాబు ఇచ్చారు. "భవిష్యత్‌లో రానున్న విద్యుత్ ప్లాంట్లు, స్వల్ప, దీర్ఘకాల విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, థర్మల్ కేంద్రాల విద్యుదుత్పత్తి సామర్థ్యం (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్), స్వల్పకాలిక విద్యుత్ కొనగోళ్లు, అమ్మకాలు వంటి అనేక అంశాలతో తాము ఏఆర్ఆర్‌లో పేర్కొన్న లెక్కల ప్రకారం అంత మిగులు ఉండొచ్చు...ఉండకపోవచ్చు" అని సశేష సమాధానం ఇచ్చారు. మరి డిస్కంల నష్టాలు, అప్పుల సంగతి ఏంటి అని మరో అర్జీదారు ప్రశ్నిస్తే...కేంద్రప్రభుత్వం ప్రకటించిన 'ఉదయ్' స్కీం సొమ్ము మొత్తం అణాపైసలతో సహా రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు ఇచ్చేసిందని చెప్పారు. మరి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకం బకాయిలు ఏమన్నా ఉన్నాయా అంటే...అబ్బే అలాంటిదేం లేదు.

ప్రభుత్వం అప్‌డేట్‌గా గృహజ్యోతి సొమ్మును ఇచ్చేస్తుందని చెప్పారు. మరి వ్యవసాయానికి ఇస్తున్న ఉచిత విద్యుత్ బకాయిలు ఏమన్నా ఉన్నాయా అని అడిగితే...'అదేం లేదు. వాటిని కూడా ప్రభుత్వం ఠంచనుగా ఇచ్చేస్తుంది' అని చెప్పుకొచ్చారు. అన్నీ సక్కంగా ఉన్నాక, ఇంకా ఆర్థిక కష్టాలేంటి అని అడిగితే... 'అదంతే' అనే సమాధానమే వస్తుంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో డిస్కంల ఆదాయ లోటు రూ.20,151 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. అదే సమయంలో డిస్కంలకు వివిధ కేటగిరిల వినియోగదారుల నుంచి రూ.22,622.32 కోట్ల బకాయిలు రావల్సి ఉందని పేర్కొన్నారు. ఆ సొమ్ములో వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రావల్సిన బకాయిలు అక్షరాలా రూ.11,756.25 కోట్లు ఉన్నాయని చెప్పారు. సర్కారు ఈ బకాయిలు చెల్లించేసి, రావల్సిన ఇతర బాకీలు వసూలు చేసుకుంటే, ఆదాయలోటు ఉండదు కదా! అంటే...అవన్నీ రావద్దూ...అనే నిట్టూర్పే వినిపిస్తుంది.

ఇంకో విషయం 2024-25 నుంచి 2028-29 వరకు రిటైల్ వ్యాపారం ఏఆర్ఆర్‌ల దాఖలును 2024 సెప్టెంబర్ 18 తేదీనాడు టీజీఈఆర్సీకి సమర్పించారు. వాస్తవంగా వీటిని అంతకుముందు ఏడాది నవంబర్‌లో ఇవ్వాల్సిఉంది. ఆలస్యంగా సమర్పించినందుకు డిస్కంలు రూ.21.60 లక్షల్ని టీజీఈఆర్సీకి జరిమానాగా చెల్లించాయి. ప్రజలకు సంబంధంలేని అంశంలో ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్మును జరిమానాగా ఎలా చెల్లిస్తారనే ప్రశ్నకు సమాధానం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ హామీతో డిస్కంలు రూ.3,738 కోట్ల అప్పు చేశాయి. ఈ సొమ్మును విద్యుత్ కొనుగోలు చెల్లింపుల కోసం ఖర్చు చేశారు. వీటన్నింటిపై టీజీఈఆర్సీ ఈనెల 19న ఎన్పీడీసీఎల్ పరిధిలో, 21న ఎస్పీడీసీఎల్ పరిధిలో బహిరంగ విచారణలు నిర్వహించి, డిస్కంల వాస్తవ లెక్కల్ని తేల్చనుంది.

19 నాటికి సునీతా రిటర్న్!



న్యూయార్క్: గత తొమ్మిది నెలలుగా అంతరిక్షంలోనే చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలిమమ్స్, బుచ్ విల్‌మోర్ భూమిపైకి తిరిగి రావడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కేవలం 8 రోజుల మిషన్? కోసం జూన్ 6న కు వెళ్లిన వీరిద్దరూ వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా ఇప్పటివరకూ అక్కడే గడపాల్సి వచ్చింది.అటు నాసా అధికారులు, స్పేస్?ఎక్స్ ఇంజనీర్లు వీరిని తీసుకురావడంపై ప్రతీసారి ఒక కొత్త తేదీని ప్రకటిస్తున్నారు. ఈసారి వీరు కచ్చితంగా భూమికి తిరిగి వస్తారని చెప్పినప్పుడల్లా మళ్లీ ఏదో ఒక సాంకేతిక సమస్య తలెత్తడంతో వారి రాక మరింత ఆలస్యం అవుతోంది. ఈ క్రమంలో వీరిని భూమికి తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా క్రూ-10 మిషన్‌ను బుధవారం అంటే మార్చి 13న ప్రయోగించేందుకు అంతా సిద్ధమైంది. అయితే ఈ మిషన్‌లోనూ సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రయోగం మళ్లీ నిలిచిపోయింది.ఆస్ట్రొనాట్స్ మార్చి 19 నాటికి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి బయలుదేరనున్నట్టు ప్రకటించింది. ఇప్పటికైనా ఆ ఇద్దరు వ్యోమగాముల్ని భూమిపైకి తీసుకురావటంతో సఫలమవ్వాలని అందరూ కోరుకుంటున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నవతెలంగాణ-హయత్‌నగర్

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు సరూర్నగర్ విద్యుత్ డీఈ రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11 కేవీ గ్రీన్ హిల్స్ ఫీడర్.. గ్రీన్ హిల్స్ కాలనీ, కృష్ణానగర్, మొయ్య నగర్, ద్వారకా నగర్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుండి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 11 కెవి హుడా సాయి నగర్ ఫీడర్.. జడ్జెస్ కాలనీ, విజయశ్రీ కాలనీ, వివేకానంద నగర్ కాలనీ, సహా సహారా ఎస్టేట్స్ పరిసర ప్రాంతాల్లో, 11 కెవి అష్టలక్ష్మి ఫీడర్.. అష్టలక్ష్మి టెంపుల్ పరిసర ప్రాంతాల్లో, వాసవి కాలనీ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం రెండు గంటల నుండి మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అఫ్‌కమ్‌తో కైజెన్ ఇనిస్టిట్యూట్ భాగస్వామ్యం

నవతెలంగాణ-సిటీబ్యూరో

లీన్, కైజెన్ పద్ధతుల్లో ప్రత్యేకత కలిగిన ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ కైజెన్ ఇనిస్టిట్యూట్ ఇండియా కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడానికి, నిరంతర మెరుగుదల సంస్కృతిని పొందుపర్చడానికి అఫ్‌కమ్ హెూల్డింగ్స్ లిమిటెడ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ సహకారం అఫ్‌కమ్ కార్యకలాపాల్లో కైజెన్ సూత్రాలను ఏకీకృతం చేయడం, క్రమబద్ధీకరించబడిన ప్రక్రియలు, మెరుగైన ఉత్పాదకత, దీర్ఘకాలిక వ్యాపార స్థితిస్థాపకతను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా కైజెన్ ఇనిస్టిట్యూట్ ఇండియా సహ వ్యవస్థాపకుడు అండ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జయంత్ మూర్తి మాట్లాడుతూ "కార్యాచరణ నైపుణ్యం వైపు వారి ప్రయాణంలో అఫ్‌కమ్‌తో భాగస్వామ్యం కావడం చాలా ఆనందంగా ఉంది. ఈ భాగస్వామ్యం అఫ్‌కమ్ అధిక సామర్థ్యం, తగ్గించబడిన కార్యాచరణ వ్యర్థాలు, మెరుగైన సేవా స్థిరత్వాన్ని సాధించడంలో సహాయపడుతుంది" అని తెలిపారు.

కిడ్నీ సమస్యలకు 'కామినేని'లో రోబోటిక్ చికిత్సలు



• యూరాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రకాశ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

గడిచిన దశాబ్ద కాలంగా వయస్సుతో సంబంధం లేకుండా చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు.. అన్ని వయస్సుల వారికీ కిడ్నీ సమస్యలు బాగా ఎక్కువ అవుతున్నాయని కామినేని ఆస్పత్రి యూరాలజీ విభాగం డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ వి.సూర్యప్రకాశ్ అన్నారు. కిడ్నీ సమస్యలన్నింటికీ కావినేని ఆస్పత్రిలో అత్యాధునికమైన రోబోటిక్ శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు. ప్రపంచ కిడ్నీడే సందర్భంగా ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్యాకేజీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మీడియాతో మాట్లాడుతూ "అధిక రక్తపోటు, మధుమేహం, నొప్పి నివారణ మందులను అతిగా వాడటం, జీవనశైలిలో మార్పులు, జంక్‌ఫుడ్, మాంసాహారాలు ఎక్కువగా తీసుకోవడం లాంటి కారణాల వల్ల ప్రధానంగా కిడ్నీ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. కామినేని ఆస్పత్రిలోనే రోజుకు సుమారు 40 మంది వరకు కిడ్నీ సంబంధిత సమస్యలతో వస్తున్నారు. ఇటీవలి కాలంలో కిడ్నీల్లో రాళ్లు, పలు రకాల కణితులు, ప్రోస్టేట్ సమస్యలు ఉంటున్నాయి. జీవన్మృతుల నుంచి అవయవాలు సేకరించి మార్పిడి చేసే కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు ఆస్పత్రిలో జరుగుతున్నాయి. గడిచిన 20 రోజుల్లోనే ఐదుగురికి ఇలా కిడ్నీలు మార్చాం. సీఎంఆర్ రోబో అనే అత్యాధునిక రోబో సాయంతో రోబోటిక్ శస్త్రచికిత్సలు కూడా ఇక్కడ చేస్తున్నాం" అని తెలిపారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి..

వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువ అవుతున్నప్పుడు తగినంత నీరు తీసుకోకపోతే శరీరంలో క్రిస్టల్స్ ఏర్పడి, అవి చివరకు కిడ్నీల్లో రాళ్లుగా మారుతాయి. ఈ సమస్య వేసవిలోనే ఎక్కువగా కనిపిస్తుంది. రోజుకు రెండు లీటర్ల మూత్రవిసర్జన జరిగేలా నీళ్లు తాగాలి. అంటే రోజుకు మూడున్నర నుంచి నాలుగు లీటర్ల నీళ్లు తాగాలి. దాంతోపాటు ఆరంజ్, నిమ్మకాయ, దబ్బకాయ లాంటి సిట్రస్ జాతి ఫలాలను వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. వేసవిలో శరీరానికి తగినంత హైడ్రేషన్ అవసరం. అలాగే ఉప్పు వాడకం బాగా తగ్గించాలి. సోడియం ఎక్కువైతే అదే రాళ్లు ఏర్పడటానికి కారణం అవుతుంది. దాంతోపాటు అధిక రక్తపోటు, మధుమేహాలను అదుపులో ఉంచుకుంటే కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు" అని డాక్టర్ సూర్యప్రకాశ్ వివరించారు. సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, డాక్టర్ వి.విష్ణువర్ధనరెడ్డి మాట్లాడుతూ, "శరీరానికి తగినంత వ్యాయామం ఇవ్వడంతో పాటు.. మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవాలి. సమతులాహారం తినాలి. తాజా పండ్లు, ఆకు కూరలు, కూరగాయలు రక్తంలో ఆమ్లం మోతాదును తగ్గించి కిడ్నీలను కాపాడతాయి. వీలైనంత వరకూ ఇంట్లో వండిన ఆహారమే తినాలి" అని సూచించారు. సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్ డాక్టర్ ఎ.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ "కిడ్నీ వ్యాధుల తొలిదశలో పెద్దగా లక్షణాలేవీ ఉండవు. చివరి దశలో కిడ్నీలు పూర్తిగా విఫలమవుతాయి. జబ్బు ముదురుతున్న కొద్దీ లక్షణాలు బయటపడతాయి. నిస్సత్తువ, మూత్రంలో నురగ, రక్తం పడటం, పాదాలు, కాళ్ల వాపులు, ఆయాసం, రక్తపోటు బాగా పెరగడం వంటివి కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలేవైనా గమనిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి" అని చెప్పారు.

రోగ నిర్ధారణలో ల్యాబ్ టెక్నిషియన్ల కృషి అద్వితీయం



నవతెలంగాణ-సిటీబ్యూరో

అత్యంత భయంకరమైన పరిస్థితులకు ఎదురొడ్డి ప్రమాదకర వైరస్, బాక్టీరియాలతో ప్రత్యక్షంగా పోరాడుతూ రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంలో అవిశ్రాంతంగా పని చేస్తున్న ల్యాబ్ టెక్నిషియన్ల కృషి అభినందనీయమని రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రం సీనియర్ లాబ్ టెక్నిషియన్ రవికుమార్ సంతోజు అన్నారు. ల్యాబ్ టెక్నిషియన్స్ డే సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో ల్యాబ్ టెక్నిషియన్ల కృషి, ఖచ్చితత్వం, అంకితభావాన్ని గుర్తించి, వారి వృత్తి ధర్మాన్ని గౌరవించడమే ల్యాబ్ టెక్నిషియన్ దినోత్సవ ప్రధాన ఉద్దేశమన్నారు. మైక్రోబయాలజిస్ట్ హారిక మాట్లాడుతూ ప్రధానంగా వైద్యశాఖలో ల్యాబ్ టెక్నిషియన్లది ఎంతో భాధ్యతాయుతమైన పాత్ర అన్నారు.

ల్యాబ్ టెక్నిషియన్ సంఘం సుధాకర్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో ల్యాబ్ టెక్నిషియన్ల పాత్ర అద్వితీయమనీ, వైద్య రంగంలో వారి అంకితభావం, ఖచ్చితత్వం ఎంతో ముఖ్యమైనవి కాగా ఇవి నిర్దిష్టమైన రోగ నిర్ధారణలు, చికిత్సలకు గణనీయంగా దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు వై.వి.లక్ష్మినారాయణ, ఫారుక్, రాధిక, అలీం, ఏ.సుధాకర్, సాయి, రవి, ప్రదీప్, నరేష్, స్వప్న, కల్పణ, జ్యోతి, రాణీబాయి, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

నవతెలంగాణ- హయత్‌నగర్



మానసిక విక లాంగుడు అదృశ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రజయ్ గుల్మోహర్, కుంట్లూరుకి చెందిన సిద్ధంశెట్టి నరసింహ రాజు.. ఈ నెల 11న కుంట్లూర్‌కి వెళు న్నానని చెప్పి ప్రజయ్ గుల్మోహర్ నుండి వెళ్లాడు. వెళ్లేటప్పుడు తన మొబైల్ ఫోన్ ఇంట్లోనే పెట్టాడు. సాయంత్రం అయినప్పటికీ కూడా తిరిగి రాకపోయేసరికి అతని గురించి కుంట్లూర్ చుట్టుపక్కల ప్రాంతాలలో, వారి బంధువుల దగ్గర వెతికినా ఎటువంటి ఆచూకీ లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నవతెలంగాణ-హయత్‌నగర్

తల్లితో గొడవపడి ఓ యువతి అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చింతలకుంట,



శక్తి నగర్‌లో నివాసం ఉంటున్న అమీనా ఫాతిమా... ఇంట్లో ఎలాంటి పని చేయకుండా ఖాళీగా ఉంటుందని ఈ నెల 4న తన తల్లి ఆమెతో గొడవ పడడంతో ఇంట్లో నుంచి వెళ్ళిపోయింది. చుట్టు పక్కల వారిని, బంధువులను ఆరా తీయగా ఎలాంటి ఆచూకీ లభించలేదు. అంతేకాదు ఆమె ఫోన్ కూడా స్విచాఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నవతెలంగాణ-హయత్ నగర్



ఓ యువకుడు అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నాగార్జున కాలనీ, హస్తినాపురంలో నివాసం ఉంటున్న భీమ గాని నరేష్ రోజు మాదిరిగానే ఆఫీసుకు వెళ్తున్నాను అని చెప్పి ఈ నెల 12న ఇంట్లో నుండి వెళ్లాడు. కానీ ఇప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పలు చోట్ల హోలీ వేడుకలు

నవతెలంగాణ-ఎల్బీనగర్

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తన నివాసంలో కుటుంబ సభ్యులతో హెూలీ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఎల్బీనగర్ ప్రజలకు హెూలీ శుభాకాంక్షలు తెలియజేశారు.



నవతెలంగాణ-నాగోల్

నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ తన నివాసంలో వివిధ కాలనీ వాసులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి హోలీ సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వసంత శోభతో ఫరిడవిల్లె సప్త వర్ణాల శోభిత మైన రంగుల హరివిల్లు హెూళీ అని అన్నారు. అనంతరం డివిజన్ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.





నవతెలంగాణ -హయత్‌నగర్

జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయంలో శుక్రవారం జీహెచ్ఎంసీ మహిళా కార్మికులు, అభిమానులు, వివిధ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి ఆనందోత్సవాల మధ్య హోలీ సంబురాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు మునగాల హరీష్ రెడ్డి, కొప్పుల ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని శ్రీరాం కాలనీలో శుక్రవారం వివిధ పార్టీల నాయకులు కుల మతాలకు అతీతంగా ప్రజలందరూ హెూళీ పండుగ సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ జహంగీర్, బీజేపీ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు కపిల్ గౌడ్, నాయకులు శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

యువజన కాంగ్రెస్ నేత, ప్రజా సేవకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి శుక్రవారం..కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య హెూళీ సంబరాలను జరుపుకున్నారు.



ఎల్బీనగర్‌లో చిన్నారులు హెూళీ వేడుకలు జరుపుకుంటూ.. ఒక్కరిపై ఒకరు రంగులు చల్లుకుంటున్నారు.



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నాదర్‌గుల్ గ్రామంలోని మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలోని 150 మంది అభాగ్యుల మధ్యన ఆశ్రమం ఫౌండర్ గట్టు గిరి కుటుంబ సభ్యులతో కలిసి ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా హెూళీ సంబరాలు జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు, డాన్సుల మధ్యన హెూళీ పండుగను నిర్వహించుకున్నారు.



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, ఇనాంగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని యశోద కాలనీలో హోలీ జరుపుకుంటున్న చిన్నారులు..





నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

హెూళీ పర్వదిన వేడుకలను పురస్కరించుకొని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి.. అభిమానులతో కలిసి హోలీ సంబురాలను జరుపుకున్నారు.

ఎల్బీనగర్‌లో రంగులు చల్లుకుంటున్న ఇద్దరు చిన్నారులు..





పల్లవి మోడల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

• పాల్గొన్న ప్రిన్సిపాల్ మేడ నందిత రెడ్డి

నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని పిండి పుల్లారెడ్డి గార్డెన్స్‌లో పల్లవి మోడల్ స్కూల్ మొదటి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ మేడ నందిత రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్స్ ఏ. రామ్ రెడ్డి, ఎం. గోపాల్ రెడ్డి, ఈ. మధుకర్ రెడ్డి, రవీందర్ రెడ్డిలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ పాఠశాలలో సరికొత్త విద్యా విధానాలతో కొనసాగుతూ విద్యార్థులకు సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. అంతేకాదు విద్యార్థులకు చిన్నతనం నుండే మంచి నడవడికను అలవాటు చేస్తున్నామని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లవి మోడల్ స్కూల్ ఉపాధ్యాయ, సిబ్బంది బృందం తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం



నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

కాంగ్రెస్ పార్టీ ఆకారణంగా శాసనసభ నుండి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంతకల్ల జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేసినందుకు నిరసనగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మతో కలిసి శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రజా సమస్యలు లేవనెత్తితే అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలను పాతరేస్తూ నిరాధారణ ఆరోపణలతో సస్పెండ్ చేయడం దారుణం అన్నారు. ప్రభుత్వ నియంత్రిత్వ పోకడలు మానుకోవాలని, సస్పెండ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ ఉద్యమకారుల కన్వీనర్ న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు కొండ్ర శ్రీనివాస్, జగన్మోహన్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, బండారి మల్లేష్ ముదిరాజ్, సంతోష్ రజక, శివ శివ నాయక్, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు హెూలీ శుభాకాంక్షలు



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన మైనార్టీ నాయకులు బద్రుద్దీన్, రహీం. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బైరీ నవీన్ గౌడ్, ఇంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం



నవతెలంగాణ-కల్చరల్

నిత్యం మన రోడ్ల ను పరిశుభ్రం చేసే పారిశుధ్య కార్మికులను గౌరవించటం అరుదైన సంఘటన రవీంద్ర భారతి సమావేశ మందిరంలో ఉజ్వాల సాంస్కృతిక సేవా సంస్థ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మహిళా పారిశుధ్య కార్మికులకు సత్కార కార్యక్రమం చేశారు. జీహెచ్ఎంసీ డీప్యూటీ కమిషనర్ మారుతీ దివాకర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు లేకుంటే వీధులు ఎలా వుంటాయెూ ఊహించుకోలేమన్నారు. వారి సేవలు గుర్తించి గౌరవించడం విశేషమన్నారు. ఈ సభలో సంఖ్య శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ కార్పొరేటర్ పద్మ వెంకట రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు సిద్ధార్థ్ ముదిరాజు పాల్గొన్న సభకు సంస్థ అధ్యక్షులు లక్ష్మి స్వాగతం పలికారు.

కన్జ్యూమర్ కార్నివాల్ కార్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో

లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ ఇండోర్ స్టేడియంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, కన్జ్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో నేడు ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కన్జ్యూమర్ కార్నివాల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్జ్యూమర్ ఆర్గనైజేషన్ సభ్యులు వివిధ జిల్లాల నుంచి విచ్చేసి బీఐఎస్, సీఆర్ఓ అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్స్యూమర్ ఫోరం రిటైర్డ్ జస్టిస్ ఎంఎస్‌కే జైస్వాల్, కన్జ్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామగిరి హరిబాబు, బ్యూరో ఇండియన్ స్టాండర్డ్స్ చైర్మెన్ డాక్టర్ సతీష్, డైరెక్టర్ హరీష్, ఎఫ్ఎస్ఐ రిటైర్డ్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి హాజరై వినియోగదారులకు జరిగే నష్టాలు వారికి ఉండాల్సిన అవగాహన, వారికి సమస్యలు ఎక్కడ ఎదురవుతాయి, వాటిని ఎక్కడ పరిష్కరించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌వో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.శివకుమార్, రవి, ప్రధాన కార్యదర్శి, కిరణ్ కుమార్, కార్యదర్శులు రాజేష్, ప్రభాకర్, ఉమెన్ వింగ్ కమిటీ, వీణ, ప్రీతి, సబిత, హేమ, ప్రసన, తదితరులున్నారు.

యువత క్రికెట్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి

పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి,సీఐ అద్దాని సత్యనారాయణ



నవతెలంగాణ-మేడ్చల్

ఫ్రెండ్లీ పోలీసులో భాగంగా క్రికెట్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని నినాదంతో మేడ్చల్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటు శుక్రవారం మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మూడు రోజులపాటు కొనసాగే ఈ టోర్నమెంట్ లో మొదటి మ్యాచ్ మేడ్చల్ పోలీసులు వర్సెస్ జర్నలిస్టుల మధ్య జరిగింది. ఉత్కంఠ భరితంగా కొనసాగిన ఈ మ్యాచ్ లో మొదట టాస్ గెలిచిన పోలీస్ జట్టు నిర్ణీత 7ఓవర్లలో 69 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జర్నలిస్టుల జట్టు నిర్ణీత 7ఓవర్లలో 67పరుగులు చేసి 2 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన జర్నలిస్టు జట్టు నుంచి ముప్పిడి రాజశేఖర్, పోలీస్ జట్టు నుండి శేఖర్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసులో భాగంగా మేడ్చల్ పోలీస్‌ల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. మేడ్చల్ సీఐ అద్దాని సత్యనారాయణను అభినందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మేడ్చల్ ప్రింట్ మీడియా అధ్యక్షుడు జల్లి హరినాథ్, సీనియర్ జర్నలిస్ట్ లు మురళీధర్, బారి, మల్లారెడ్డి, భాస్కర్ ఎస్సైలు మన్మథరావు, అశోక్ తదితరులున్నారు.

మహనీయులకు నివాళి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో ప్రపంచాన్ని సామాజికంగానూ వైజ్ఞానిక రంగాలలో మలుపుతిప్పిన మహనీయులు జయంతి, వర్ధంతుల సందర్భంగా నివాళి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సామాజిక మార్పులకు కృషిచేసిన కార్ల మార్క్స్ వర్ధంతి, వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దృక్పథాన్ని మార్చిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతి, జీవితకాలం తన అవయవాలు పనిచేయకపోయినప్పటికీ వైజ్ఞానిక రంగంలో ఎంతో గొప్ప కృషి చేసిన స్టీఫెన్ హాకింగ్ వర్ధంతి కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాద గిరిరావు అధ్యక్ష వహించారు. ముందుగా కార్ల్ మార్క్స్ చిత్రపటానికి కోమటి రవి, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చిత్రపటానికి ఎం భాస్కర్‌రావు, స్టీఫెన్ హాకింగ్ చిత్రపటానికి శారద పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోమటి రవి కార్ల్ మార్క్స్ ప్రపంచ గమనాన్ని శాస్త్రీయ దృక్పథంతో వివరించి మానవాళికి ఎంతో ఉపయుక్తంగా సిద్ధాంతికరించారని చెప్పారు. శతాబ్ద కాలంలో అత్యంత ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తుల్లో కార్ల్ మార్క్స్ అగ్రగణ్యుడని ప్రపంచం గుర్తించిందని చెప్పారు. శారద మాట్లాడుతూ ముగ్గురు మహెూన్నత శాస్త్రవేత్తలు ప్రపంచానికి ఎంతో మేలు చేశారని వారి యెుక్క బాటలో శాస్త్రీయ దృక్పథంతో జీవించాలని కోరారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్ భౌతిక శాస్త్రవేత్తలుగా ప్రపంచ మనుగడకు ఒక కొత్త రూపును తీసుకొచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా కృష్ణమాచార్యులు, గద్దల నరసింహారావు, శివన్నారాయణ, జి శివరామకృష్ణ, ఎం భాస్కర్ రావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎం శ్రీనివాసరావు, జి శ్రీనివాస్, శారద, కృష్ణమాచార్యులు, గద్దల నరసింహారావు, గొడుగు యాదగిరిరావు, జి శివరామకృష్ణ, ఎం భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

హెూలీ పండుగ రోజు శాస్త్రీయ నృత్య సంగమ కేళి



నవతెలంగాణ-కల్చరల్

భారతీయ శాస్త్రీయ నృత్య ప్రక్రియలకు హెూలీ పండుగ రోజు శ్రీ త్యాగరాయ గానసభ వేదిక ఇంది. ప్రముఖ నాట్య శిక్షణా సంస్థ కథక్ కళా క్షేత్ర నిర్వహణలో కళా పోషకుడు సారిపల్లి కొండలరావు సహకారంతో నృత్యాంజలి పేరిట భారతీయ శాస్త్రీయ నృత్య మహెూత్సవం జరిగింది. మృణాళిని శిష్య బృందం కొలువై ఉన్నాడే దేవ దేవుడు అంశాన్ని కన్నుల పండుగగా నర్తించి తిల్లానను శాస్త్ర బద్ధంగా ప్రదర్శించారు. మాస్టర్ సాయి వేదాంత పేరిణి నాట్య అంశంలో త్రి లింగ తత్వాన్ని తాండవం తో ప్రేక్షకులకు ఉత్తేజం కలిగించారు. కథక్ అంజి బాబు శిష్యురాలు కైవల్య కథక్ ప్రక్రియలో లాస్య నర్తనంతో ఆకట్టుకుంది. ప్రియంకా మిశ్రా శిష్యురాలు రమ్య ఒడిస్సీ నాట్యంతో ప్రశంస పొందారు. చివరగా గౌతమి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ప్రశంసనీయం గురురాజ్ శిష్యుడు మేధన్స్ రాము శిష్యుడు మోక్షుత్ డ్రమ్స్ విన్యాసంతో అలరించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ కళ పత్రిక సంపాదకుడు రఫీ కళా విపంచి సంస్థ అధ్యక్షులు నరసింహా రావు నాట్య గురువు నిర్మల ప్రభాకర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని నాట్య ప్రక్రియలతో వొక వేదిక పై కథక్ అంజి బాబు తెచ్చారని ప్రశంసించారు. సంస్థ స్థాపకుడు అంజి బాబు మాట్లాడుతూ పలువురు కళా కారులకు వేదిక కల్పించటం కోసం ప్రతి నెలా నృత్యాంజలి నిర్వహిస్తున్నమని తెలిపారు.

సమస్యలను ఎత్తిచూపితే సస్పెండ్ చేస్తారా..?





- నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ కాప్రా

సమస్యలను ఎత్తిచూపితే సస్పెండ్ చేస్తారా అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బడ్జెట్ సమావేశాల నుంచి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్రెడ్డిని సస్పెండ్ చేయడంపై బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చింది. దానిలో భాగంగా ఈసీఎల్ ఎక్స్ రోడ్డు వద్ద ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ నేతలతో కలిసి ధర్నా నిర్వహించారు. పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడు తూ గవర్నర్ ప్రసంగంలోని అసత్యాలు, అర్ధసత్యాలను ఎత్తిచూపుతున్న జగదీశ్వర్రెడ్డిని ప్రభుత్వం కుట్రపూరితంగానే సస్పెండ్ చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో, కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోమశేఖర్‌రెడ్డి, సాయి జెన్ శేఖర్, మహిపాల్ రెడ్డి నవీన్ గౌడ్, మహేష్ గౌడ్, బద్రుద్దీన్, బాబు యాదవ్ , మనెమ్మభాస్కర్, బాల కృష్ణ, నర్సింగ్ రావు, పిట్టల నరేష్ , మధు సుదన్ రెడ్డి, మోహన్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బోడుప్పల్

అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై నిజాలు మాట్లాడ కుండా కాంగ్రెస్ సర్కారు కుట్రలు చేస్తుందని దానిని ప్రజాస్వామిక వాదులు తిప్పికొట్టాలని బీఆర్ఎస్ బోడుప్పల్ కార్పొరేషన్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను బీఆర్ఎస్ శ్రేణులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలను లేవనెత్తిన మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిపై కాంగ్రెస్ సర్కారు నియంతృత్వ ధోరణితో అసెంబ్లీ సమావేశాలకు బహిష్కరించడం ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ గౌడ్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం.. బీఆర్ఎస్ నేతల అరెస్ట్

నవ తెలంగాణ-మేడ్చల్

మాజీ మంత్రి,ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని బడ్జెట్ సమావేశాలు ముగిసింతవరకు అసెంబ్లీ నుండి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లుగా మేడ్చల్ బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారి 44పై అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బీఆర్ఎస్ నాయకులను అడ్డుకోడానికి పోలీసులు ప్రయత్నించగా తోపులాట జరిగింది. అనంతరం బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు వద్దురా నాయన కాంగ్రెస్ పాలన అంటూ బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ బీఆర్ఎస్ అధ్య క్షుడు భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ నుండి సస్పెండ్ చేయడాన్ని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే అసెంబ్లీ నుండి సస్పెండ్ చేశారని విమర్శించారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తు న్నారని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మున్సిపల్, మండల ప్రధాన కార్యదర్శిలు సుదర్శన్, విష్ణు చారి, మండల, మున్సిపల్ ఉపాధ్యక్షులు శైలేందేర్, రఘుపతి రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్, మాజీ సర్పంచ్ జగన్ రెడ్డి, రాజ మల్లారెడ్డి, సీనియర్ నాయకులు ఆకిటి నవీన్ రెడ్డి, సందీప్ గౌడ్, శ్రీనివాస్ రాజు, వంగేటి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా బాయ్స్ హాస్టల్..!

గతంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని సాయి మణికంఠ బాయ్స్ హాస్టల్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నిలుస్తుంది. మేడ్చల్ ఆర్టీసీ బస్సు డిపోకు కూతవేటు దూరంలో ఈ హాస్టల్ ఉంది. కాగా రెండు అంతస్తుల్లో హాస్టల్ నిర్వహణ కొనసాగిస్తూ అదే భవనంలోని మరో అంతస్తులో అసాంఘిక కార్యకలాపాలు రాత్రి పగలు అనే తేడా లేకుండా యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఈ హాస్టల్ ఎదురుగా ఉన్న దారిగుండా వందలాది మంది విద్యార్థులు, మహిళలు ప్రతినిత్యం రాకపోకలు కొనసాగిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ హాస్టల్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్ యాదవ్ మేడ్చల్ పోలీస్ స్టేషన్ లో గతంలో లికిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు. ఇప్పటికైనా సదరు హాస్టల్ నిర్వాహకులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-కాప్రా

మైనార్టీ సోదరులకు పవిత్ర రంజాన్ మాసంలో అణుపురం కాలనీలో గల జాన్ మసీద్ ఈ మహమ్మ దీయ మసీదు నందు రిహాజ్ ఖాన్ అహ్మద్ ఆధ్వర్యంలో మైనార్టీ సోదరులు కు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మిస్టర్ నాని అప్ప, మైబిల్ అహ్మద్ ఖాన్, పాష,పెద్దాపురం కుమార స్వామి, లచ్చిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ప్రమోద్ చారి, ఈ మెసేజ్ కి సంబంధించిన మైనార్టీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.



హెూలీ పండుగ సందర్భంగా మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును నానకురామ్ గూడలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకె అందజేసి హెూలీ శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య.

నవతెలంగాణ కాప్రా

హకింపేట డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



నవతెలంగాణ-శామీర్ పేట

తుంకుంట మున్సిపాలిటీ పరిధిలోని హకీంపేట బస్ డిపో వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్టీసీ జేఏసీ వైస్ చైర్మెన్ థామస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసి ఆర్టీసీ డ్రైవర్ల చేత నడిపించాలని, రెండు పీఆర్సీలు ఇవ్వాలని పని గంటలు తగ్గించి యూనియన్లను ఆర్టీసీలో పునరుద్ధరించాలని పలు రకాల సమస్యల పై 21 డిమాండ్లతో ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆర్టీసీ జేఏసీ ఎప్పుడు పిలిపిస్తే అప్పుడు ఉద్యోగులందరూ సమ్మెకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ వైస్ చైర్మెన్ థామస్ రెడ్డి, టీఎంయూ వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్ గౌడ్, కో కన్వీనర్లు సుద్దాల సురేష్, ఎస్ఎంయు వల్లూరి బాబు పాల్ కార్మిక పరిషత్ యాదగిరి డిపో జేఏసీ నాయకులు బాల రాజు, గోపు శ్రీనివాస్, రామచందర్, రమేష్, సుగుణ చారి, రాజేందర్, నాగరాజు, ఎండి ఇబ్రహీం,శర్ఫోద్దీన్ పద్మ, వినోద, నాగమణి, సునీత, సుజాత, తిరుపతమ్మ, మొగులమ్మ పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా హెూలీ సంబరాలు..



బోడుప్పల్‌లో..

మారుతి నగర్‌లో చిన్నారుల హెూలీ వేడుకలు



కాప్రాలో..



శామీర్‌పేటలో..



ఆల్వాల్‌లో..



కీసరలో ఘనంగా హెూళి వేడుకలు



కాప్రాలో..

హెూలీ సంబరాలలో మీర్‌పేట హెచ్‌బీ కాలనీ డివిజన్ బీజేపీ అధ్యక్షులు రామ్ ప్రదీప్ మునుగంటి

నవతెలంగాణ కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ నాలుగో డివిజన్ ఫేస్ వన్ ఆనంద్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్లేగ్రౌండ్‌లో రాజస్థానీ మార్వాడి సంఘం ఆధ్వర్యంలో హెూలీ సంబరాలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజస్థానీ మార్వాడి సంఘం అధ్యక్షులు కైలాష్ శర్మ, ఉపాధ్యక్షులు సోహన్లాల్, ప్రధాన కార్యదర్శి దగడ రామ్జి, సహాయ కార్యదర్శి నరేందర్ సాంగ్ల మాట్లాడుతూ హెచ్‌బీ కాలనీ మౌలాలి రాజస్థానీ మార్వాడి సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా హెూలీ సంబరాలు ఏడు రోజులుగా కొనసాగుతాయని ఈ సంబరాల్లో రాజస్థానీ మార్వాడీ కుటుంబాలు మహిళలు పురుషులు వారి వారి సాంప్రదాయక కళాసాధనాలతో ఒక దగ్గరికి చేరి వారి సాంప్రదాయక కళా పరికరాలతో సాంస్కృతిక కళ ప్రదర్శనలు ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమంలో హెచ్‌బీ కాలనీ రాజస్థానీ మార్వాడి సంఘం నాయకులు సభ్యులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ-శామీర్‌పేట

తుంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట, మూడు చింతలపల్లి మండలాల వ్యాప్తంగా పిల్లలు, పెద్దలు, యువత, మహిళలు ఆనందోత్సాహల మధ్య ఉత్సాహంగా, కేరింతలతో హెూలీ పండుగ సంబరాలు జరుపుకున్నారు. గురువారం రాత్రి ఉమ్మడి శామీర్ పేట మండలంలో ఆయా గ్రామాల్లోని ప్రధాన చౌరస్తాల్లో కామ దహనం నిర్వహించారు. యువకులు పెద్ద ఎత్తున కేరింతలు కొడుతూ, గ్రామస్తులు ఎంతో ఉత్సాహంగా కామ దహనంలో పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఆల్వాల్

పంచశీల కాలనీలో హెూలీ సంబరాలు అంబరాన్నంటాయి. డీజే పాటలతో, సహజసిద్ధమైన రంగులతో, రెయిన్ డ్యాన్సులతో హెూలీ వేడుకలు కన్నులపండువగా జరిగాయి. అందరూ ఆటపాటలతో హెూరెత్తించారు. ఈ హెూలీ సంబరాల్లో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంటరీ నియోజకవర్గం సభ్యుడు ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మహిళలతో కలిసి డ్యాన్సుల్లో పాల్గొన్నారు. ఎంపీ ఈటెల రాజేందర్ హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ రాజేష్ అగర్వాల్, భరత్ రెడ్డి, రవి, బసవరాజ్, విజయవర్ధన్ రెడ్డి, చారి, శ్రీకాంత్, నరేష్, మిట్టల్, కరిందర్ సింగ్, సింగ్ మా నాయకులు మాణిక్య రెడ్డి, మహిపాల్ రెడ్డి, బీ.ఎల్.ఎన్. రెడ్డి , కాలనీ వాసులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కాప్రా

కాప్రాలోని ఆదిత్య నగర్‌లో హెూలీ సందర్భంగా సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు.



కాప్రాలోని ఆదిత్యనగర్ కాలనీ హెూలీ సంబరాలు



ఉప్పల్‌లో..

ఉప్పల్‌లో హెూలీ సంబరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు అనుమానాస్పద మృతి



నవతెలంగాణ-కొంపల్లి

పేట్ బషీరాబాద్ పరిధిలోని బైసాకి దాబా ముందు టీవీఎస్ ఎక్సెల్ పై వెళ్తున్న ప్రకాష్ సాహు(25) అనే యువకుడిని శుక్రవారం సుమారు 3.30 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో అతడు అక్కడే మృతి చెందాడు. అతడు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వాడని, ఉపాధి నిమిత్తం మూడు సంవత్సరాల కిందట కొంపల్లి వచ్చి రోజువారి కూలీగా పనిచేస్తున్నాడు. మృతుడి బావ ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

'సీఎం సహాయ నిధి చెక్కు అందజేత'



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బేగంపేట్ డివిజన్(149)కు చెందిన గంశత్ రౌత్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో రూ.60 వేలు విలువ గల చెక్కు మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం ఆ చెక్కును బండి రమేష్ చేతుల మీదుగా బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, మాజీ వైస్ చైర్మెన్ లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ పుష్పా రెడ్డి, కూకట్ పల్లి ఏంసి డైరెక్టర్ అరుణ్, బోయినపల్లి ఏంసి డైరెక్టర్ అస్లాం, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలను రెచ్చగొట్టే సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు కెపి.వివేకానంద్, మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఇటీవల నగరంలోని రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలు కోరారు. ఈ మేరకు వారు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏళ్ల పాటు శాంతియుత ఉద్యమాలు చేసి, రాష్ట్రాన్ని సాధించి.. 10 సంవత్సరాలు ప్రజలతో ఎన్నుకోబడి బంగారు రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన గౌరవ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై వారి చావు కోరుతూ అనుచిత వ్యాఖ్యలు చేసి రాష్ట్ర ప్రజలు, కేసీఆర్ అభిమానుల ఆత్మాభిమానాన్ని కించపరిచేలా రెచ్చగొడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదని విమర్శించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రజలు సంయమనాన్ని కోల్పోవద్దని, కాలమే వారికి సరైన బుద్ధి చెబుతుందన్నారు. కేసీఆర్ మరియు తెలంగాణ సమాజంతో పెట్టుకున్న వారు కాలగర్భంలో కలిసిపోయారని తెలిపారు.



తమ స్వార్థ చిల్లర రాజకీయాల కోసం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తమ స్వార్థం కోసం ఎదుటి ఎదుటివారి నాశనాన్ని కోరుకునే నైజాన్ని, ముఖ్యమంత్రి మానసిక స్థితిని తెలియజేస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఎదుటివారి వినాశనాన్ని కోరుకోవడం సిగ్గుచేటని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలను, కేసీఆర్ అభిమానులను, బీఆర్ఎస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలను తీవ్ర మన వేదనకు గురిచేశాయని అన్నారు. తమ స్వార్థ రాజకీయాల కోసం చిల్లర మాటలు మాట్లాడుతూ విద్వేషాలను రెచ్చగొట్టి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుత్బుల్లాపూర్‌లో కారు బీభత్సం

- కార్ డ్రైవర్‌ను చితకబాదిన స్థానికులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లోని జగద్గిరిగుట్ట, షాపూర్‌లలో ఓ కారు బీభత్సం సృష్టించింది. జగద్గిరిగుట్ట ఔట్ పోస్ట్ ప్రయాణికులను గుద్ది ఆపకుండా వెళ్లిన కారు.. షాపూర్‌లో మరికొంతమందిని ఢీకొట్టింది. వరుస రోడ్డు ప్రమాదాలు చేసి దూసుకుపోతున్న కారును పోలీసులు చాకచక్యంగా అడ్డుకున్నారు. డ్రంకెన్ డ్రైవ్ చేయగా మద్యం మత్తులో ఉన్నాడని తేలింది. స్థానికులు ఆవేశంతో డ్రైవర్‌ను చితకబాదారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ఓ కారు జగద్గిరిగుట్ట వద్ద కొందర్ని ఢీకొట్టింది. కారు ఆపేందుకు చూడగా దూసుకెళ్లింది. ఛేజ్ చేసి రాళ్లతో కొట్టినా కారును అందుకోలేకపోయారు. కొందరు ప్రయాణికులకు గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. తరువాత షాపూర్ నగర్‌లోనూ మరికొన్ని వాహనాలను, ప్రజలను ఢీకొట్టి దూసుకెళ్తున్న కారు ఘటనపై జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్ఐ సందీప్ చాకచక్యంగా వ్యవహరించి కారును అడ్డుకున్నారు. ట్రాఫిక్ సిగ్నల్ నిలిపివేసి, కారును ఆపి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేయగా డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని తేలింది. ఆవేశానికి లోనైన ప్రయాణికులు ప్రమాదం చేసి పరారవుతున్న డ్రైవర్‌ను చితకబాదారు. సూరారం పోలీసులు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి, కారు నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. హ్యుండయ్ అమేజ్ కారు తమిళనాడులో రిజిస్ట్రేషన్ అయింది. ప్రమాదానికి కారణమైన కారు TN70 AS6815 అని పోలీసులు తెలిపారు.

సింపోలో టైల్స్ అండ్ బాత్‌వేర్ 200వ డిస్‌ప్లే గ్యాలరీ ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

భారతీయ సిరామిక్ పరిశ్రమలో అగ్రగామైన సింపోలో టైల్స్ అండ్ బాత్‌వేర్ శంషాబాద్ శాతంరాయ్ వద్ద తన కొత్త సెఫర్ డిజైన్స్ 200వ డిస్‌ప్లే గ్యాలరీని ప్రారంభించింది. ఈ డిస్‌ప్లే సెంటర్ సింపోలో బెస్ట్ సెల్లింగ్, తాజా ఉత్పత్తులను ప్రదర్శిస్తుంది. వీటిలో లార్జ్-ఫార్మాట్ సింటెర్డ్ కాంపాక్ట్ సర్ఫేస్‌లు, 16/20 ఎంఎం అవుట్‌డోర్ టైల్స్, కిచెన్ ప్లాట్‌ఫామ్ టైల్స్, గ్లేజ్డ్ విట్రిఫైడ్ టైల్స్, వాల్ టైల్స్, విప్లవాత్మక స్ట్రాంగ్‌ఎక్స్ సర్ఫేస్ ఉన్నాయి. ఈ సందర్భంగా సింపోలో గ్రూప్ సీఎండీ జితేంద్ర అఘార మాట్లాడుతూ "పరిశ్రమ అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా వినూత్నమైన, అధిక-నాణ్యత గల సిరామిక్ సొల్యూషన్‌లను అందించడంలో మా నిబద్ధతకు ఈ ప్రారంభం నిదర్శనం. మా వృద్ధి వ్యూహంలో భాగంగా మేం దేశం అంతటా మా అడుగుజాడలను నిరంతరం విస్తరిస్తున్నాం. అత్యాధునిక సాంకేతికత, స్థిరమైన తయారీ పద్ధతుల్లో పెట్టుబడి పెడుతున్నాం. సింపోలోలో డిజైన్ ఎక్సలెన్స్, మన్నిక, కస్టమర్ అనుభవంలో కొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేయాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. సిరామిక్ పరిశ్రమలో మార్కెట్ లీడర్‌గా మా స్థానాన్ని బలోపేతం చేస్తాం" అని తెలిపారు.



ఎఫ్‌టీఎల్ ఆక్రమణ దారులపై హైడ్రా చర్యలు

నవతెలంగాణ- ప్రతినిధి (కొంపల్లి)

పేట్ బషీరాబాద్ కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫాక్స్ సాగర్ చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్ ల్యాండ్‌లో ఆక్రమణదారులు అక్రమంగా టిప్పర్ల సహాయంతో మట్టి పోస్తుండగా హైడ్రా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు పేట్ భాషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. తర్వాత ఘటనా స్థలానికి వెళ్లి మట్టి పోస్తున్న ఒక టిప్పర్‌ని సీజ్ చేసి చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు.

హాస్టల్స్‌కు అద్దె కడ్తలేరు..!

- అద్దె భవనాల్లో బీసీ, ఎస్టీ, ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్స్
- నెలలుగా పెండింగ్‌లో భారీగా బిల్లులు
- యజమానుల నుంచి అధికారులకు ఒత్తిళ్లు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రూ.కోట్లలో బకాయి





నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోవడం లేదు. వేల మంది విద్యార్థుల భవిష్యత్‌తో ముడిపడిన ఈ హాస్టళ్లకు ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేస్తుండటంతో నిర్వహణ రోజురోజుకూ ఇబ్బందిగా మారుతోంది. సకాలంలో అద్దెలు చెల్లించకపోవడంతో యజమాల నుంచి అధికారులకు ఒత్తిళ్ల వస్తుండటంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇటీవల ములుగు జిల్లాలో అద్దె చెల్లించడం లేదని హాస్టల్‌కు తాళం వేయడం సంచలనంగా మారింది. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం ఆయా భవనాల యజమానులతో ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి నచ్చజెప్పారు. ఇప్పటి వరకు సమస్యాత్మకంగా ఇబ్బందులు తలెత్తకున్నా.. సంబంధిత శాఖల అధికారులకు యజమానుల నుంచి ఒత్తిళ్ల మాత్రం తప్పడం లేదు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, గురుకులాల్లో దాదాపు 10 వేల మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ఇందులో సగానికిపైగా హాస్టళ్ల అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. జిల్లాలో ఉన్న 14 బీసీ పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు ఒక్క దానికి కూడా సొంతం భవనం లేదు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, గురుకులాలు సగం అద్దె భవనాల్లోనే ఉన్నాయి. ఈ అద్దెలను ప్రతి నెలా కాకుండా ఏడాదికి రెండు, మూడు దఫాల్లో ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. కానీ బీసీ హాస్టల్స్‌కు అద్దె చెల్లించక దాదాపు 23 నెలలు కాగా, ఎస్సీ హాస్టల్స్‌లో కొన్నింటికి కొత్తగా తీసుకున్న వాటికి 4, 5 నెలలుగా, మరికొన్నింటికి 16 నెలలుగా అద్దె ఇవ్వడం లేదు. ఇక ఎస్టీ హాస్టల్స్‌ది కూడా దాదాపుగా ఇదే పరిస్థితి. దీంతో భవనాలకు ఏవైనా మరమ్మతులు అవసరమైతే యజమానులు సరిగా స్పందించడం లేదు. అద్దె డబ్బులు ఇవ్వండి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తాం.. లేదంటే మీరు చేయించుకోండి.. అంటూ యజమానులు చెబుతున్నారు. జిల్లాలో ఏ హాస్టల్‌కు చూసినా చెల్లించాల్సిన బిల్లులు భారీగా పేరుకుపోయాయి. కేవలం బీసీ హాస్టల్స్‌కే దాదాపు రూ.3 కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, గురుకులాలకు కలిపి దాదాపు మరో రూ.2 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

జిల్లాలో హాస్టల్స్ వివరాలు ఇలా..

హాస్టల్ పేరు	హాస్టల్స్	మొత్తం విద్యార్థులు	అద్దె భవనాలు	ప్రభుత్వ భవనాలు
బీసీ హాస్టల్స్	20	4 వేలు	అన్నీ	లేవు
ఎస్సీ హాస్టల్స్	13	1,500	4	9
ఎస్టీ హాస్టల్స్	8	1,200	3	5

యజమానులతో ఉన్నతాధికారుల వీసీ

నెలలుగా బకాయిలు పేరుకుపోవడంతో ఇంటి యజమానులు హాస్టల్స్‌కు తాళాలు వేస్తామని చెప్పడంతో విషయాన్ని జిల్లా అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇదే సమయంలో ఇటీవల ములుగు జిల్లాలో అద్దె చెల్లించడం లేదని యజమాని హాస్టల్‌కు తాళం వేయడంతో అప్రమత్తమైన సర్కార్ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బిల్డింగ్ యజమానులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇక నుంచి సకాలంలో అద్దెలు చెల్లిస్తామనీ, భారీగా బకాయిలు పేరుకుపోకుండా జాగ్రత్త పడుతామని భరోసానిచ్చారు. అయినా కొందరు యజమానులు బకాయిలు చెల్లించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని జిల్లా అధికారులను ప్రశ్నిస్తుంటే.. వారు సంబంధిత ఉన్నతాధికారులకు రిమాండ్స్, లేఖలు అందజేస్తూ ఉన్నారు.

రిమాండ్ పెడుతున్నాం

సగం వరకు ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ అద్దె భవనాల్లోనే ఉన్నాయి. యజమానుల నుంచి ఒత్తిళ్ల ఎక్కువవుతున్నాయి. ప్రతి రోజూ ఎవరో ఒకరు ఆఫీసుకు వచ్చి బకాయిల గురించి మాట్లాడి వెళుతున్నారు. ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు రిమాండ్ చేస్తున్నాం. ఇంటి యజమానులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటి వరకైతే ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు.

- వినోద్ కుమార్, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

సర్కార్‌కు లెటర్లు పెడుతున్నాం

బీసీ పోస్ట్‌మెట్రిక్ హాస్టలన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అద్దె చెల్లించకుంటే హాస్టల్స్‌కు తాళాలు వేస్తామని యజమానులు చెబుతున్నారు. దీంతో ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదు. ఒత్తిళ్ల ఎక్కువవుతున్నాయి. ఈ విషయమై ఎప్పటికప్పుడు సర్కార్‌కు లెటర్లు పెడుతున్నాం. ఇటీవల కూడా సంబంధిత కమిషనర్‌ను పరిస్థితి గురించి వివరించాను.

- ఝాన్సీ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

ఘనంగా హోలీ సంబరాలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సేవలో నిత్యం బిజీగా ఉండే నాయకులు హోలీ సందర్భంగా ఉల్లాసంగా గడిపారు. 130 సుభాష్ నగర్ డివిజన్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం హెూలీ సంబరాలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి , మహిళలు , చిన్నారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ... డాన్స్ చేస్తూ ఆనందోత్సవాల మధ్య మధ్య హెూలీ చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి డివిజన్ ప్రజలకు హెూలీ శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని మాజీ కౌన్సిలర్ తూము ఎల్లారావు తన అనుచర మిత్ర బృందంతో శుక్రవారం ఘనంగా హెూలీ జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కె. కిష్టయ్య గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ మాజీ జాయింట్ సెక్రెటరీ అశోక్ చారి, కూకట్‌పల్లి వార్డ్ సభ్యులు రాజ్ కుమార్, బీఆర్ఎస్ నాయకుడు సతీష్, శివ, మహేందర్ మిత్ర బృందం పాల్గొన్నారు.



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

హెూలీ పండుగను పురస్కరించుకొని శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ పద్మా నగర్‌లోని పలు కాలనీలో హెూలీ పండుగను చిన్నారులు, పెద్దలు అందరూ కలిసి సరదాగా జరుపుకున్నారు.





నవతెలంగాణ- ప్రతినిధి(కొంపల్లి)

పేట్ బషీరాబాద్ కొంపల్లి ప్రాంతాలలో హెూలీ పండుగను కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి ఘనంగా జరుపుకున్నారు.



బీఆర్‌ఎస్వీ నేతలపై ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో సీఎం రేవంత్ రెడ్డిని కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్వీ నేతలపై చర్యలు తీసుకోవా లని కోరుతూ సీనియర్ కాంగ్రెస్ నేత మానవత రాయ్ , ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకట స్వామిలు శుక్రవారం ఓయూ పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్ట హరి ప్రసాద్ సైతం గురువారం రాత్రి రహదారులపై ఏర్పాటు చేసిన కామదాహనం కార్యక్రమాల వల్ల ట్రాఫిక్ జాం కాకుండా చర్యలు తీసుకునేందుకు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా పర్యటించి పరిశీలించారు. నవతెలంగాణ-బంజారాహిల్స్

ముచ్చటగా 3 జాబ్‌లు

- మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఓయూ విద్యార్థిని, నాగర్ కర్నూల్ జిల్లా గడ్డంపల్లి వాసి మద్దెల అరుణ
- కుటుంబం, పిల్లలు ఉన్నా కృషి పట్టుదలతో సాధన



నవతెలంగాణ-ఓయూ

కృషి, పట్టుదల అంకితభావం ఉంటే ఏదైనా సాధించవచ్చని నాగర్ కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలం, గడ్డంపల్లి గ్రామానికి చెందిన మద్దెల పుల్లయ్య, బాలమ్మ దంపతుల కుమార్తె మద్దెల అరుణ నిరూపించారు. ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. మద్దెల అరుణ తల్లిదండ్రులు నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. వారికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.పిల్లల్ని చదివించే స్తోమత లేక అందరిని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివించారు.



అరుణకి డా. జవహర్‌లాల్‌తో 2021 లో పెండ్లి కాగా ఒక కుమారుడు ఒక కూతురు కూడా ఉన్నారు. భర్త ప్రోత్సాహంతో జేఎల్ సాధించారు.ఇలా కుటుంబం ఉన్నా కూడా ఇలా హ్యాట్రిక్ జాబ్స్ పొందటం విశేషం. ఆమె 5వ, తరగతి వరకు గడ్డంపల్లి ప్రాథమిక పాఠశాలలో పూర్తి చేశారు. గురుకులంలో ఎంట్రన్స్ రాయగా మన్ననూర్ TSWREISలో ఆరో తరగతి సీటు సాధించి 12 వరకు అక్కడే చదివారు.డిగ్రీని కోఠి ఉమెన్స్ కాలేజీలో పూర్తి చేశారు. ఆ తర్వాత ఎంట్రెన్స్ రాసి ఎమ్మెస్సీ ఫిజిక్స్ లో ఉస్మానియా యూనివర్సిటీలో సీటు సాధించారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. చిన్నప్పటినుంచి చదువే తన లక్ష్యంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు.

ప్రభుత్వ ఉద్యోగాలు :-

2018 సంవత్సరం లో బీసీ వెల్ఫేర్ లో పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ), ఫిజిక్స్ లో చేరి వర్గల్‌లో విధులు నిర్వహించారు. 2019 సంవత్సరం లో గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ లెక్చరర్‌గా (డీఎల్) ఉద్యోగం సాధించి సూర్యాపేటలో విధులు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. 2025 సంవత్సరంలో ఇటీవల ప్రకటించిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఆమె ప్రభుత్వ జూనియర్ లెక్చరర్‌గా గవర్నమెంట్ గర్ల్స్ జూనియర్ కాలేజ్ నాగర్ కర్నూల్‌లో ఉద్యోగం సాధించారు.తన తల్లిదండ్రులు చాలా కష్టపడి చదివిపించారని, మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం తనకు చాలా సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.నిరుపేద కుటుంబానికి చెందిన మద్దెల అరుణ మహిళలకు, నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలిచారు.వివిధ జిల్లాల నుండి ఉద్యోగస్తులు, విద్యార్థులు, స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



ఆ మాటల్లో మోసం ఉన్నట్టే



> గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఈజీగా డబ్బులు సంపాదించొచ్చని నాలుగు మాయమాటలు చెప్తే చాలు ఇవతలి వ్యక్తులు ఇట్టే నమ్మేస్తారు... ఉన్నత చదువులు చదువుకున్న వారుసైతం అత్యాశకు పోయి బ్యాంక్ ఖాతాలో డబ్బులు విత్‌డ్రా అయ్యేంత వరకు గుర్తించరు. ఆ తర్వాత పోలీసుల వద్దకు ఉరుకులు పరుగులు పెడ్తారు.... ఉరికేతే డబ్బు రాదు.. కష్టపడితేనే డబ్బు... ఈజీగా డబ్బు సంపాదించవచ్చంటూ ఎవరైనా చెప్పారంటే అక్కడ మోసం ఉంటుందని గుర్తించండి... అంటూ రాచకొండ పోలీసులు వినూత్న పద్ధతిలో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు..

- ఈజీగా డబ్బులు సంపాదించొచ్చంటే ఆలోచించాల్సిందే
- రాచకొండ పోలీసులు వినూత్న పద్ధతిలో సోషల్ మీడియాలో ప్రచారం

నవతెలంగాణ-సిటీబ్యూరో

రోజు రోజుకు సైబర్ బాధితులు పెరుగుతూ కోట్ల రూపాయలు నష్టపోతున్నారు. గత ఏడాది దేశ వ్యాప్తంగా రూ. 22,812 కోట్ల రూపాయల సైబర్ క్రైమ్ జరిగింది. ఒక్క తెలంగాణ లోనే లక్షా 20 వేల 869 మంది సైబర్ నేరాల బారినపడ్డారని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. అక్కడ ఇక్కడ తేడా లేకుండా దొరికిన వారిని సైబర్‌నేరగాళ్లు దోచేస్తున్నారు. దీంతో రాచకొండ పోలీసులు సైబర్ నేరాలపై మరింత అవగాహన తీసుకువ చ్చేందుకు వివిధ మార్గాలలో ప్రజలలోకి వెళ్తున్నారు. సైబర్ మోసగాళ్ల చేతిలో బలవ్వకండి అంటూ ప్రచారం చేస్తున్నారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలతో ఇంటి నుంచే భారీగా ఆదాయం సంపాదించవచ్చు.. హెూటల్ రివ్యూలు, గోల్డెన్ ఆఫర్స్ అంటూ అజ్ఞాత నెంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లు, కాల్స్ లింక్‌లకు స్పందించవద్దంటూ ప్రజలకు సూచిస్తున్నారు.

రివ్యూలు రాయమంటూ....

సైబర్‌నేరాలలో మోసపోతున్న వారందరూ దాదాపు చదువుకున్న వాళ్లే. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ట్రేడింగ్ పేరుతో జరుగుతున్న భారీ మోసాలతో ఉద్యోగులు, వ్యాపారులు వీరి మోసపు మాటలకు బలవుతున్నారు. అయితే ఈ రెండు అంశాలలో బాధితుల ఆశ కూడా నేరగాళ్లకు కలిసి వస్తోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ట్విట్టర్, వాట్సాప్, టెలిగ్రామ్ ఇలా సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌ను సైబర్‌నేరగాళ్లు ఉపయోగిస్తూ ప్రజలను ఈజీగా బుట్టలో పడేస్తు న్నారు. అవతలి వ్యక్తులు చెప్పే మాటలు ఈజీగా వినేందుకు సైబం నేరగాళ్లు టెక్నికల్‌గా మాట్లాడుతూ, చెప్పినట్టే మొదట్లో తక్కువ పెట్టుబడులతో లాభాలు చూపిస్తున్నారు. ప్రయివేటు ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ సంబంధిత ఉద్యోగాలు చేసేవారితో పాటు చదువుకున్న గృహిణిలు కూడా సైబర్‌నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్నారు. వెబ్‌సైట్లకు, వివిధ వ్యాపారాలకు సంబంధించిన రివ్యూలు రాయడం, మంచి రివ్యూలతో వ్యాపారాలను పెంచుకోవడం కోసం కొన్ని సంస్థలు సొంతంగా రివ్యూలు రాయిస్తుంటాయి. ఇలాంటి అంశాలపై సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన వారికి అవగాహన ఉంటుంది. దీంతో సైబర్‌నేరగాళ్లు చెప్పేవి నిజమనే భ్రమలో వారుంటారు. అసలైన సంస్థలు ఫోన్లు చేసి, మేసేజ్‌లు చేసి రివ్యూలు రాయమంటూ ఎవరిని అడుగరు అనే విషయ పరిజ్ఞానం లేకపోవడంతో ఈజీగా మోసపోతున్నారు.

సోషల్‌మీడియాతో...

సోషల్‌మీడియాలో వస్తున్న ప్రకటనలకు ఆకర్షితులవుతూ చాల మంది మోసాల బారినపడుతున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చేవి నిజమనేది నిర్ధారణ లేకుండానే చాలామంది వాటిని ఫాలోఅవుతున్నారు. ఈ క్రమంలో వాటిని నిర్ధారించు కోవాలంటూ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. నేరుగా ప్రజలలోకి వెళ్లడం ఒకటైతే... సోషల్‌మీడియా ద్వారానే ప్రజలలో విస్తృతంగా అవగాహన తీసుకురావాలని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే సోషల్‌మీడియాలో ఆయా మోసాలపై భిన్న మైన వీడియోలతో అవగాహన తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టా రు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ట్రేడింగ్ పేరుతో ఎక్కువ మొత్తంలో మోసాలు జరుగుతున్నాయి, డిజిటల్ అరెస్ట్‌లు కొద్దిమేర తగ్గుముఖం పట్టాయి. కేంద్ర ప్రభుత్వం వివిధ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా, ప్రజలలోకి ఆశించిన మేర వెళ్లడం లేదు. కేవలం సెల్‌ఫోన్ రింగ్‌టోన్‌లో వచ్చే సమాచారం మాత్రమే ఎక్కువగా ప్రజలలోకి వెళ్తుందనే చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యం లోనే సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌లలో విస్తృతంగా ప్రచారంపై పోలీసులు దృష్టిపెట్టారు. అవగాహనతోనే పూర్తిస్థాయిలో సైబర్‌నేరాలు కట్టడి చేయొచ్చనే పోలీసులు పేర్కొంటున్నారు.

చిన్న, పెద్ద తేడా లేకుండా జరుపుకునే పండుగ హెూలీ



నవతెలంగాణ-బేగంపేట

చిన్న, పెద్ద తేడా లేకుండా ఎంతో సంతోషంగా జరుపుకునే పండుగ హెూలీ అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం మోండా డివిజన్ బండి మెట్ లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాగేందర్ (నాగులు) ఆధ్వర్యంలో నిర్వహించిన హెూలీ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అందరికీ హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యనారాయణ, శ్రీనాథ్, వెంకట్, అమర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంటోన్మెంట్

హెూలీ పర్వదినాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులు తెలంగాణ ప్రజలపై ఉండాలని ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివద్ధి పథంలో దూసుకెళ్లాలని ఆకాంక్షించారు చెప్పారు. అంతకుముందు ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు వేదపండితులు సాదర స్వాగతం పలికి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేసారు.

యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసే బాధ్యత పాలకులదే

- అవినీతి, దోపిడీ, అక్రమాలు లేని సమసమాజ స్థాపనకు కృషి చేయాలి
- శాస్త్రవేత్త, సామాజిక కార్యకర్త కృష్ణ ప్రసాద్



నవతెలంగాణ-ఓయూ

యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసే బాధ్యత పాలకులదేనని, భగత్ సింగ్ కలలుగన్న అవినీతి, దోపిడీ, అక్రమాలు లేని సమసమాజ స్థాపనకు పౌరులంతా కృషి చేయాలని శాస్త్రవేత్త, సామాజిక కార్యకర్త కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 94వ వర్ధంతిని పురస్కరించుకుని ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఓయూ లోని క్రికెట్ గ్రౌండ్‌లో 2వ రోజు ఏర్పాటు చేసిన భగత్ సింగ్ మెమోరియల్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఎన్నో క్రీడలు అంతరించి పోతున్నాయని వాటిని గుర్తించి కాపాడాల్సిన బాధ్యత పాలకులదేనన్నారు. భగత్ సింగ్ ఆశయ సాధనకు నేటి యువత పాటుపడాలన్నారు. నేడు దేశంలో అవినీతి, అక్రమాలతో కూడిన రాజకీయాలు సమా జాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేసేలా ఉన్నాయని, రాజకీయాలంటే కార్పొరేట్ శక్తులు మాత్రమే అనేలా అపహాస్యం చేసేలా ఉన్నాయన్నారు. సేవ చేయాలనే యువత ఆలోచనలను నేటి పాలకులు కుతంత్రాలతో నాశనం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులలో ఆర్థిక అరాచకాలు,నేరాలు చేసిన వారే ఉన్నారని ఇది మన దేశ భవిష్యత్‌కు పెను ప్రమాదమన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐ వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ,కె. ధర్మేం ద్ర, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, కార్యవర్గ సభ్యులు మాజీద్, కళ్యాణ్, అనిల్,హేమంత్, బాలు, విజయ్,మహేష్,తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి

- బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగారంప్రశాంత్



నవతెలంగాణ-ఓయూ

ప్రవేశపెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టోలో చెప్పినట్టుగా విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఓయూ న్యూస్ సెమినార్ హాల్లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ గడిచిన 15 నెలలు గా విద్యా రంగానికి నిధులు లేక నాసిరకం భోజనాల వల్ల గురుకులాల్లో చదువుతున్న 58 విద్యార్థులు మరణించారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వ హయాంలో విద్యార్థులని ఎవరెస్టు శిఖరం ఎక్కిస్తే మీరు విద్యార్థులను పాడెలు ఎక్కిస్తున్నారని.. ఇది మీ చరిత్ర అని మండిపడ్డారు. గురుకులాల్లో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ. 50 లక్షలు ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఎనమిది వేల కోట్లు తక్షణమే విడుదల చేయాలని, ఓయూకి వెయ్యి కోట్ల రూపాయలు తెలంగాణలో ఉన్న యూనివర్సిటీలకు అదనంగా వంద కోట్ల రూపాయలు కేటాయించాలని సూచించారు. విద్యా శాఖ మంత్రిని నియమించకుంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను కలుపుకొని పెద్ద ఎత్తున దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



సోమాజిగూడ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కామదహనం కార్యక్రమాలలో కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ పాల్గొని హెూళీ పండుగను ఘనంగా నిర్వహించారు. నవతెలంగాణ-బంజారాహిల్స్

ఉత్సాహంగా హెూలీ సంబరాలు



చీకటి వదిలి వెలుగులు నింపే హెూలీ

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ-బంజారా హిల్స్

చీకటి వదిలి వెలుగు నింపే రంగుల రంగేలి హెూలీ అనిమేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. నగర ప్రజలకు హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. బంజారాహిల్స్ డివిజన్ 93 ఎన్ బీ టీ నగర్ అయ్యప్ప స్వామి దేవాలయం దగ్గర ఏర్పాటు చేసిన కాముడు దహనంలో బస్తీ వాసుల తో కలిసి మేయర్ దంపతులు పాల్గొన్నారు.ఆ తరువాత హెూలీ పండుగ శభాకాంక్షలు తెలుపుకోని ఒకరికొకరు హెూలీ రంగులు పూసుకొని ఘనంగా పండుగ జరుపుకున్నారు.



కుల మతాలకతీతంగా హెూలీ సంబరాలు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండలో హెూలీ సంబరాలు అంబరాన్నంటాయి. రాజ్ నగర్‌లో హెూలీ సంబరాలలో డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నగర బీసీ సంఘంసెక్రెటరీ మహేష్ కాసుల, బస్తీ వాసులు ప్రతీ సంవత్సరం కుల మతాలకతీతంగా ఘనంగా హెూలీ వేడుకలు నిర్వహించారు. హెూలీ వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని ,అందరికీ హెూలీ శుభాకాంక్షలు తెలిపారు.



ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో హెూలీ సంబరాలు..

నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట శుక్రవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో హెూలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రితేష్ రావు, ఎన్ఎస్‌యూఐ నేషనల్ డెలిగేట్ మెంబర్ పవన్, రాష్ట్ర నాయకులు రాజు ,వినయ్,మణికంఠ గౌడ్, ఎన్ఎస్‌యూఐ యూనివర్సిటీ నాయకులు మోహన్, సురేష్, ప్రవీణ్, అభిలాష్, రవి, లోకేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.



ప్రతాప్ ఆధ్వర్యంలో వేడుకలు

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు న్యూ బోయిన్‌పల్లిలో హెూలీ వేడుకలు శుక్రవారం కన్నులపండువగా జరిగాయి. రంగులు చల్లుకుంటూ పలువురు హెూలీ వేడుకల్లో పాల్గొన్నారు. బాపుజీనగర్. బోయిన్ పల్లి ప్లే గ్రౌండ్ లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పాల్గొన్నారు. ప్లే గ్రౌండ్ లో జంపన ప్రతాప్ సరదాగా కర్రసాము చేసి అందరిని ఆశ్చర్యానికి గురి చేశారు.

బోరబండలో తాగునీటి సమస్య రాకుండా చూడండి

- వాటర్ వర్క్స్ మేనేజర్‌ను ఆదేశించిన కార్పొరేటర్ బాబా ఫసివుద్దీన్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

బోరబండలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని, ప్రజలకు సరిపడా నీరు విడుదల చేయాలని, ఎక్కువ ప్రెషర్‌తో ఎక్కువ సమయం నీరు విడుదల చేయాలని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసివుద్దీన్ శుక్రవారం బోరబండ వాటర్ వర్క్స్ మేనేజర్‌ను కోరారు. ఆయనతో కలిసి సైట్ -2లోని వాటర్ స్టోరేజ్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. స్పందించిన వాటర్ వర్క్స్ మేనేజర్ తప్పకుండా ప్రజలకు సరిపడా తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

హెచ్‌సీయూ భూములను అమ్మితే ఊరుకునేది లేదు



నవతెలంగాణ-ఓయూ

హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల ప్రభుత్వ భూమిని వేలం వేయాలనే ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చెందిన భూములను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూడడం సరి కాదన్నారు. యూనివర్సిటీ భూములను కార్పొరేట్ కంపెనీలకు అమ్మడం వల్ల క్యాంపస్ వాతావరణాన్ని చెడగొట్టడం అవుతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



హెూలీ పండుగను పురస్కరించుకొని శుక్రవారం చిన్నారులు హెూలీ సంబరంగా జరుపుకున్నారు. వెస్ట్ మారేడుపల్లి చిన్నారి హెూలీ ఆడుతున్న దృశ్యం.

నవతెలంగాణ-బేగంపేట



జూబ్లీహిల్స్ డివిజన్ అంబేద్కర్ నగర్ రోడ్ నెంబర్ 46కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, ఫిల్మ్‌నగర్ జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు,సిబ్బందితో కలిసి జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ హెూళీ పండుగ ఘనంగా జరుపుకున్నారు. శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ - బంజారాహిల్స్

మహిళా కార్మికులకు చీరలు పంపిణీ

నవతెలంగాణ-కంటోన్మెంట్

హెూలీ వేడుకల్లో భాగంగా వార్డు మాజీ మహిళా సభ్యురాలు జంపన్న విద్యావతి శుక్రవారం పారిశుధ్య మహిళా కార్మికులను కలసి సంబరాలు నిర్వహించారు. అనంతరం కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా యాదవ్, కరణ్ సింగ్, శ్రీకాంత్, పవన్, బండి శ్రీనివాస్, శశి తదితరులు పాల్గొన్నారు.





మాజీ ఎమ్మెల్సీ నివాసంలో హెూలీ

నవతెలంగాణ-ఓయూ

మాజీ ఎమ్మెల్సీ నారపరాజు రాంచందర్ నివాసంలో హెూలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సారంగపాణి, వెంకటేష్ గౌడ్, సత్యనారాయణ , ప్రకాష్ గౌడ్, శ్రీధర్, రాముువర్మ కరుణాకర్, హైమ రెడ్డి జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలనాటి పాటలలో సంగీతం సాహిత్యం చిరస్మరణీయం

నవతెలంగాణ-కల్చరల్

అలనాటి సినీ పాటలలో సంగీతం సాహిత్యం చిరస్మరణీయమని ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. అమెరికాలో ఉన్న శారద ఆరు దశాబ్దాల పైబడిన సంగీత దర్శకులు స్వర పరచిన పాటలను ఎంచుకుని ఇక్కడ కార్యక్రమం నిర్వహించటం అభినందనీయన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ శారద అకునూరి(అమెరికా) నిర్వహణ లో స్వర కర్తలకు స్వర నీరాజనం పేరిట ఏభై అరవై దశకంలో పది మంది సినీ దర్శకుల స్వర పరచిన పాటలను శారద సహా గాయకులు బాల కామేశ్వర రావు రాము రమణలతో కలసి ఆలపించారు. శారద బాల కామేస్వర రావు ఆలపించిన చిరు నవ్వు లోని హాయి పాటకు శ్రోతలు ప్రశంసలు వర్షం కురిపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రేలంగి నరసింహా రావు మాట్లాడుతూ అమెరికాలో విదేశీ సంస్కృతీకి ఆకర్షింపపడకుండా పాత పాటలలోని మాధుర్యాన్ని తాను ఆస్వాదించి ఇక్కడ వారికి అందిస్తున్నారని కొనియాడారు. సాంస్కృతిక పోషకుడు బొల్లినేనీ కృష్ణయ్య తమ అభినందన తెలిపారు. వంశీ రామరాజు స్వాగతం పలికి శారదను సత్కరించారు



పంచశీల కాలనీలో హోలీ సంబరాలు..

ఆల్వాల్‌లో..

పారిశుధ్య సిబ్బందిపై దుర్భాషలాడిన, దాడి చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు

- శానిటరీ సూపర్వైజర్ సుదర్శన్



నవతెలంగాణ-చర్లపల్లి

విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బందిపై ఎవరైనా అకారణంగా దుర్భాషలాడిన, అకారణంగా వాదోపవాదాలకు దిగినా, వారి మనోభావాలు దెబ్బతినేట్టు ప్రవర్తించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి, చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ శానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ హెచ్చరించారు. శుక్రవారం కాప్రా సర్కిల్ చక్రిపురం ఏరియాలో ప్రతి మంగళవారం జరిగే వారాంతపు సంతలో వ్యాపారానంతరం వ్యాపారస్తులు, చెత్తను జీహెచ్ఎంసీ వాహనాలకు మాత్రమే అందించాలని, గత నెల రోజుల నుండి జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి, పారిశుధ్య సిబ్బంది ద్వారా వ్యాపారుస్తులకు అవగాహన కలిగిస్తూ, కూరగాయల వ్యర్థాలను తొలగిస్తున్నారు.

అందులో భాగంగా ఈనెల 11న మంగళవారం మార్కెట్‌లో విధులలో ఉన్న పారిశుధ్య సిబ్బందిని, చక్రిపురం నివాసి సీనియర్ సిటిజన్ వెంకట రమణ అనే వ్యక్తి మార్కెట్‌లో ట్రాన్స్‌జెండర్ తిరుగుతూ ప్రతి షాపు వద్ద దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేస్తున్నందుకు, తను బాధతో స్పందిస్తూ అట్టి వారిని అక్కడే ఉన్న జీహెచ్ఎంసీ పారిశుధ్య సిబ్బంది నివారించాలని కోరారు. అయితే నివారించకపోతున్నందుకు అకారణంగా దుర్భాషలాడి దౌర్జన్యంగా వాగ్వాదానికి దిగడం జరిగింది. సిబ్బంది అట్టిపని తమది కాదని చెప్పినా వినిపించుకోక, వాదోపవాదాలు దిగి సిబ్బందిపై చేయి చేసుకున్నాడు. ఇట్టి విషయమై పోలీసు కేసు నమోదు చేస్తామని తెలిపిన అనంతరం తన తప్పును తెలుసుకొని తన ఆరోగ్యం సరిగా లేదని, బీపీ ఎక్కువగా ఉన్నందున, అలా ప్రవర్తించానని అలాంటి తప్పు ఇకముందు చేయనని, శుక్రవారం పారిశుధ్య సిబ్బంది ముందు తన తప్పును క్షమించవలసిందిగా కోరారు. అనంతరం మానవత దృక్పథంతో క్షమించినట్లు సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా శానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ మాట్లాడుతూ.. విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బందిపై ఎవరైనా అకారణంగా దుర్భాషలాడిన, ఇంకా ఎలాంటి వాదోపవాదాలకు దిగి, వారి మనో బావాలు దెబ్బతినేట్టు ప్రవర్తించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి, చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధులు నిర్వహించే పారిశుధ్య సిబ్బందిపై ఎలాంటి సంఘటనలు జరగకుండా, పారిశుధ్య అధికారులు తమకు అండగా ఉంటారని, ఎవరు ధైర్యం కోల్పోకూడదు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకుడు మిర్యాల సాయిలు, అరవింద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కామ దహనం



నవతెలంగాణ చాంద్రాయణగుట్ట

అఖిలభారతవిశ్వకర్మ మహాసభ ఆధ్వర్యంలో హోలీ పండుగ సందర్భంగా కామ దహనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత విశ్వకర్మ మహాసభ అధ్యక్షులు కవులే జగన్నాథం పాల్గొని సాగర్ కాంప్లెక్స్ కాలనీ చౌరస్తాలో కామదహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ కాలనీ ఏర్పడ్డ తర్వాత ప్రతి సంవత్సరం కాలనీ ప్రెసిడెంట్‌గా కామదానం కార్యక్రమం చేస్తుంటామని తెలిపారు. కాలనీ వాళ్లందరూ సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుని కోరుకుంటు న్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి రవి, శశి ఇతరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కిడ్నీపై అవగాహన కలిగి ఉండాలి

- కిడ్నీ పేషెంట్‌లు ఈ డయాలసిస్ సెంటర్‌ను వినియోగించుకోవాలి
- ఆస్పత్రి మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ నజియా నౌషిన్ సిద్ధిఖా



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో కొనసాగుతున్న కిడ్నీ సెంటర్‌ను కిడ్నీ రోగులు వినియోగించుకోవాలని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నజియా నౌషిన్ సిద్ధిఖా అన్నారు. శుక్రవారం కిడ్నీ మనిషి శరీరంలో నిర్వహించే పనితీరు గురించి మాట్లాడారు. మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం పై ప్రజల్లో అవగాహన అవసరమన్నారు. మూత్ర పిండాలు మన శరీరంలో ఎంత ముఖ్యమైనవో వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అందరికీ కిడ్నీలు మానవ శరీరంలో కేవలం వ్యర్థాలను ఫిల్టర్ చేయడానికి మాత్రమే అనుకుంటారని, నిజానికి అవి మన శరీరంలో ప్రధానమైన పాత్రను పోషిస్తాయన్నారు. శరీరంలో కిడ్నీలు దెబ్బతింటే జీవన విధానం మారిపోతుందని, ఆరోగ్యంగా జీవించడం చాలా కష్టంగా మారుతుందన్నారు. ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు కొనసాగుతున్నాయన్నారు. మన శరీరంలో కిడ్నీలు ప్రముఖంగా చేసే ఏడు పనులు ఏంటో తెలుసుకుంటే అవి ఎంత ముఖ్య మైనవో అర్థమవుతుందన్నారు. మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు ఆరోగ్యం వంతమైన జీవన శైలిని అలవ ర్చుకోవాలి అన్నారు. 30 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరూ రక్తపోటు, మధుమేహ స్క్రీనింగ్ పరీక్షల ప్రతి సంవత్సరం చేయించుకోవాలని సూచించారు. మధుమేహము, రక్త పోటు ఉన్నవారు.క్రమం తప్పకుండా మాత్రలు వాడుతూ వీటిని అదుపులో ఉంచుకోవాలి. ప్రతిరోజు కనీసం 40 నిమిషాలు నడక, వ్యాయామం, యోగాసనాలు నిత్య జీవితంలో ఒక భాగంగా అలవర్చు కోవాలన్నారు. త్రాగునీరు సరిపోయినంత తాగాలి (కనీసం 10-12 గ్లాసులు) నొప్పుల మాత్రలు వైద్యుల సలహా మేరకే వాడాలని, ప్రతి సంవత్సరం కిడ్నీ ఫంక్షన్ టెస్ట్ (ఆర్ఎఫ్) చేయించుకోవాలని సూచించారు. మూత్రం తక్కువగా రావడం, నీరసము, కాళు మొఖములో వాపు రావడం, ఆకలి మందగించడం తదితర లక్షణాలు కనిపిస్తే నిర్ల క్ష్యం చేయకుండా దగ్గర్లోని ఆరోగ్య కేంద్రాన్ని, ప్రభుత్వ ఆసు పత్రిని సంప్రదించాలని ప్రజలకు సూచించారు. తమ హాస్పిటల్ డయాలసిస్ సెంటర్ లో మూడు షిఫ్టువారీగా రోగులకు డయాలసిస్ చేస్తున్నామన్నారు. డయాలసిస్ పేషెంట్ ఉచిత బస్‌పాస్ సౌకర్యం ఉందన్నారు. ఈ సెంటర్‌ను వారు వినియోగించుకోవాలని సూచించారు.

ఫుట్‌పాత్‌ను ఢీకొన్న కారు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 1 బాలకృష్ణ ఇంటి సమీపంలో మాదాపూర్ నుండి రోడ్ నెంబర్ 45 మీదుగా అతివేగంగా వచ్చిన కారు ఫుట్‌పాత్‌ను ఢీ కొట్టింది. వేగంగా వస్తున్న కారును చూసి భయాందోళనలకు గురైన జనం పరుగులుపెట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నాడా? లేక మద్యం సేవించి నడిపాడా ?అనే కోణంలో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ కారు వదిలి వెళ్లిపోయినట్లు గుర్తించి, కారును జూబ్లీహిల్స్ పీఎస్‌కు తరలించారు. అన్ని విషయాలు దర్యాప్తులో తెలుస్తాయని జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE VI ADDL DISTRICT AND SESSIONS JUDGE RANGA REDDY DISTRICT; AT :: KUKATPALLY
OS.No 154 OF 2023

Between:-
Smt.V.Shivani Goud ...**Plaintiff**
AND
Smt.Sangam Anuradha & others ...**Defendants**

To.
1. Smt. Parasa Aruna Goud W/o Bipin Goud Age: 38 years, Occ: House hold R/o Plot No. 140, Heaven Colony, Village, Ismailkhanguda, Keesara Mandal
2. Smt P. Shailaja Goud W/o Likith Goud Age: 36 years, Occ: Household R/o Flat No. 201, Sri Krishna Shobha Apartments Friends colony, Puppalguda, Manikonda Hyd

(Defendant Nos 3 & 4)

Please take notice that the Plaintiff had filed the above suit for Partition and Separate As notices in the suit Possession against you as Defendant nos 3 and 4 in the suit. proceedings could not be served on you in spite of best efforts, the Hon'ble court ordered notice through Paper publication. The matter is posted to **21/03/2025** for your appearance.
Therefore, you are directed to be present before the Hon'ble court on **21/03/2025 AT 10- 30 A.M.,** either in person or through an Advocate, failing which the matter will be decided exparte, according to law.

//BY THE ORDER OF THE COURT//
Sd/-
SHERI PARTHAP REDDY
E. SHRAVAN KUMAR
ADVOCATE'S
Off: 307 Lorven Complex, Chaitanyapurim Hyderabad

NOTICE OF NAME CORRECTION

I, Mohammad Imtiazuddin, S/o. Mohammad Muneeruddin, R/o: 8-1-332/3/A/200, Flat No. 101, lane 13, Aravind Nagar Colony, Tolichowki, Hyderabad. My Passport No is N0383998. I have correction in my father name, My Father Name spelled as "Mohammad Muneeroddin," should be corrected to "Mohammad Muneeruddin" in the passport.

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUIOR CIVIL JUDGE CUM ADDITIONAL JFCM COURT AT SANGAREDDY
I.A. No. 722 of 2024
IN
OS NO. 590 OF 2021

BETWEEN:
Bhagari Jyothi and others ...Petitioners/ Plaintiffs
AND
Kowlampeta @ Malachenna Manemma and others ...Respondents/ Defendantss

NOTICE

To,
R4. P. Gandhi Raju S/o Satyanarayana Raju, Aged about 75 years, R/o Plot No. 41-A, Flat No. 101, Srirama Nilayam, Venngalrao Nagar Colony, Hyderabad-500038.
R5. Dr. Kaidindi Sitaram Kumar S/o Dr. K.A.J. Varma, Aged about 52 years, Occ: Service, R/o D-66,67, Surya Residency, Madhu Nagar, Hyderabad-500038.
R6. G. Ashok Reddy S/o Malla Reddy, Aged about 50 years, Occ: Business, R/o Flat No. 204, Shilpa manor, Shilpa Park, Kondapur, Hyderabad.
R7. B. Damoder Reddy S/o Venkat Narsimha Reddy, Aged about 65 years, Occ: Business, R/o At B.D. Reddy garden, Chitanya Colony, B.N. Reddy Nagara, Hyderabad.
R8. P. Ranga Reddy S/o Sathi Reddy, Aged about 43 years, Occ: Business, R/o Flat No. 204, Shilpa manor, Shilpa Park, Kondapur, Hyderabad.
R9. M/S Cygnuss Educational Society, Secunderabad, Rep By its Secretary T. Jhansi Rani W/o A. Shiva Prasad, Aged about 50 years, Office At Flat No. 402, Prithvi Apartments, Sree Vensai Projects, Kompally, Secunderabad.
...Respondent/ Defendant No. 4 to 9

Take notice that the petitioners/ Plaintiffs filed the above IA NO. 722 OF 2024 IN O. S. No. 590 of 2021 for passing of final decree along with appointment of advocate commissioner for partitioning the suit schedule properties against the Respondents/ Defendants including you, and the above petitions stands posted on 28-03-2025 at 10.30 AM for appearance either you in person or through counsel before the HON'BLE I ADDITIONAL JUIOR CIVIL JUDGE CUM ADDITIONAL JFCM COURT AT SANGAREDDY, failing which on that day the matter will be heard Ex-Party and decided accordingly as per law.

// BY COURT ORDER //
Sd/-
T. RATNAKAR,
G. PENTAIAH,
Advocates, Sangareddy.
Mobile No. 949344324

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.A NOS: 237,130, 236/2024
IN
O.S NO.37/2023

Between:
Smt. Vydyabhusana Vasantha Kumari ...Petitioner/Plaintiff
And:-
Sadu Ramanna (dies) and others ...Respondents/Defendants

To,
R-3: Sadu Raja Rao, S/o late Appalaramayya, Cultivation, Kottapeta Village, Near Collector Office, Srikakulam Town and District.

NOTICE

Take notice that the above petitioner/plaintiff filed the above petitions and suit against the respondents /defendants and the honourable court posted the matter on 17-03-2025 for your appearance. Hence you are advised to appear on **17-03-2025** at 10.30 AM before the honourable court either in person or thorough lawyer failing which the court will be decided the petitions exparte in your absence.

(BY ORDER OF THE HONOURABLE COURT)
D. PARDHA SARADHI
ADVOCATE, SRIKAKULAM.

IN THE COURT OF THE HON'BLE V SENIOR CIVIL JUDGE:: CITY CIVIL COURT:: AT HYDERABAD
I.A.No.242 OF 2024
IN
O.S.No.208 OF 2024

BETWEEN:-
Sri.MARABOINA VENKATESH, And others ..Petitioners/ PLAINTIFFS
AND
Sri.MARABOINA GOPAL YADAV And others

To,
1.SAI YADAV (S/o Late A.SUSHEELA)S/o A.Anjaiah, Aged about 36 years, Occ: private employee,
2.NANDINI (D/o Late A.SUSHEELA) D/o A. Anjaiah, Aged about 32 years, Occ: house hold, Both R/o H.No.1-7-261, Bakaram, Zamisthanpur, Ram Nagar, Hyderabad 500020
...Respondent No.6 & 7/ DEFENDANT No. 6 & 7

NOTICE

It is hereby take Notice that the Petitioners/Plaintiffs filed above Suit for seeking Partition and Separate Possession and that the Petitioners/Plaintiffs are entitled ½ share in the Suit Schedule Property by metes and bounds. And also filed the above I.A.No.242 of 2024, and sought the relief for granting of Mandatory direction directing the defendants not to disturb or interference in using of Petitioners/ Plaintiffs, the steps from South-East corner of Suit Schedule Property to go for Second and further floors till alternative arrangements takes place over the Suit Schedule Property.
The said case is posted on 18-03-2025 for your appearance either personal or through the Advocate at 10-30 AM in the above mentioned court. And if you failed to appear the matter will be decided accordingly.

SCHEDULE OF PROPERTY

All that the new Municipal No.5-9-937 to 40, Gunfoundary, Hyderabad (old Municipal No.861 to 864, Block No.1, Ward No. (B), New No. 941 to 937/A & B) admeasuring 112 Sq.yards situated at Hyderguda, Hyderabad which is bounded as follows: EAST: House belongs to Smt.Mahboob Bee WEST: ROAD leading to Hyderguda Bazar, NORTH : House belongs Mallaiah Milk Vendor, SOUTH : Ground and Government Bathroom

(BY THE ORDER OF THE HON'BLE COURT)
P. NAVEEN KUMAR
MIR TAQI HUSSAIN
ADVOCATE
(O) 3-1-425/1, Nimboli Adda, Kachiguda, Hyderabad TS

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT: TENALI
O.S.No.72 of 2024

Between:
Talluri Suchitra Pramila Devi
And
Talluri Paul Surendra Raj and Others....

NOTICE

To,
D4.Sri Talluri Dayakar Raj, S/o. Late Talluri Joseph Gnanaraj, Age: 65, H.No: 34-136, Raghavendra Enclave, Matrupuri Colony,Bharani Colony, Sainikpuri, Secunderabad-500056, Telangana State.
D5.Paluri Renuka Devi, W/o. Paluri Ratnakar, Age: 65, Flat No: 401, Lakshmi Jewel Apart, Venkateswaranagar, Kondapur, Hyderabad- 500084

The Plaintiff herein filed the above SUIT for Partition and Separate Possession against the above Defendants. Hence, if any Objections from you, you are required to Appear before the Honorable Court either in Person OR through Council on 07.04.2025 at 10.30 AM failing which the Matter will be heard and Decide in your absence.

// BY ORDER OF THE COURT//
CH.RADHA KRISHNA
(Advocate)
Advocate for the Plaintiff
Nagaram, Medchal-Malkajigiri Dist
Hyderabad, Mobile: 8332882452

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT: SANGAREDDY
O.S.No.148 Of 2021

Between:
Andhra Pradesh Grameena Vikas Bank Formerly Manjira Grameena Bank, Presently Telangana Grameena Bank Patancheru Branch, Rep. By its Authorized Person i.e., Field Officer. ......Plaintiff
AND
Bilugadi Rajeshwaramma and others ...Defendants

To,
1.Gurrala Prem Kumar, S/oGurrala Venkaiah, R/o H.No.1112 B, Type IV Quarters, Near Jyothi Vidyalaya School, BHEL Township, R C Puram, Sangareddy Dist.-502032
2.Musuku @ Yemmela Parvathi W/o Musuku Bhaskar Reddy H.No.8-3-222/8/31. E-7, Madhura Nagar, Opp: Vellanki Foods, Sanjeeva Reddy Nagar, Hyderabad-500038.
Staff Nurse, Emp Code 04759, NIMS Hospital, Panjagutta, Hyderabad
...Defendants No. 2 & 3

The above Suit is filed for Recovery of Rs. 3,14,324/- and the court summons sent to you were returned un-served. The suit is finally posted on 26-03-2025 for your appearance in person or through pleader. You are directed by the Hon'ble Court to appear in person or through pleader on 26-03-2025 at 10-30 AM and to reply the plaint pleadings and in default the Hon'ble Court will decide the case ex-parte on the merits of the case.

//BY ORDER OF THE COURT//
B.R.Pramod Kumar
Advocate
Flat No. 408, TEJA's HARI VILLU. Near Excise Police Station Manjeera Road, Huda Colny, Chandanagar. Hyderabad 500050
Cell: 9866032875

IN THE COURT OF THE XXII th JR. CIVIL JUDGE, CITY CIVIL COURT,AT : HYDERABAD
OS No. 287 OF 2024

Between :
State Bank of India SMEC-Hyderabad Rep. by its Manager ...Plaintiff
And
M/s. Sri Ram Mobiles Rep. by its Prop. Nimmala Gopal ...Defendant

To
M/s. Sri Ram Mobiles
Rep. by its Prop. Nimmala Gopal
H.No. 18-34, Ameena Complex, Opp. Survey of India, Uppal, Hyderabad-500039.

NOTICE

The abovenamed plaintiff filed suit for Money Recovery against both of you for Rs. 3,49,342/- (Rupees Three Lakhs Forty Nine Thousand Three Hundred and Forty Two only) before the Hon'ble XXIIth Jr. Civil Judge, City Civil Courts, Hyderabad. The Hon'ble Court has directed notice against you through paper publication and the matter is posted to **16-04-2025** for your appearance. You have to appear before Hon'ble XXII th Jr. Civil Judge, City Civil Courts, at Hyderabad, at 10-30 AM or If you fail to appear before Hon'ble Court, the matter will be heard and you are set ex-parte.

By order of the VIIth Jr. Civil Judge, City Civil Courts, Hyderabad.
M.P. SANJAY
Advocate for the Plaintiff
H.No. 31, Tarbund Bazar, Tarbund, Secunderabad – 500 009
Ph : 040-29558473, Cell : 8885625424

IN THE COURT OF THE VIIth JR. CIVIL JUDGE, CITY CIVIL COURT, AT : HYDERABAD
OS No. 324 OF 2023

Between :
State Bank of India SMEC-Hyderabad Rep. by its Manager ...Plaintiff
And
M/s. Medi Ex Pharmacy Rep. by its Prop. K. Shankarl. ...Defendant

To,
M/s. Medi Ex Pharmacy
Rep. by its Prop. K. Shankarl
H.No. 2-1-34/4/NR, Ground Floor, Shop No. 3, Saraswathi Colony, Uppal, Hyderabad-500039.

NOTICE

The abovenamed plaintiff filed suit for Money Recovery against both of you for Rs. 2,93,472/- (Rupees Two Lakhs Ninety Three Thousand Four Hundred and Seventy Two only) before the Hon'ble VIIth Jr. Civil Judge, City Civil Courts, Hyderabad. The Hon'ble Court has directed notice against you through paper publication and the matter is posted to **17-04-2025** for your appearance. You have to appear before Hon'ble VIIth Jr. Civil Judge, City Civil Courts, at Hyderabad, at 10-30 AM or If you fail to appear before Hon'ble Court, the matter will be heard and you are set ex-parte.

By order of the VIIth Jr. Civil Judge, City Civil Courts, Hyderabad.
M.P. SANJAY
Advocate for the Plaintiff
H.No. 31, Tarbund Bazar, Tarbund, Secunderabad – 500 009
Ph : 040-29558473, Cell : 8885625424

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT: SANGAREDDY
O.S. No. 302 Of 2021

Between:
Andhra Pradesh Grameena Vikas Bank Formerly Manjira Grameena Bank, Presently Telangana Grameena BankPatancheru Branch, Rep. By its Authorized Person i.e., Field Officer. ...... /Plaintiff
AND
Katta Durga Prasad and others ..... Defendants

To,
1. Mr. Katta Durga Prasad, S/o Laxmaiah,Designation: Kallasi, Emp. ID: 678,Telangana Government Text Book Press, Mint Compound, Hyderabad 500063- Telangana
2. Mr. M. Naresh, S/o Yadaiah, Designation: Auxilary Hand, Emp. ID: 691,Telangana Government Text Book Press,Mint Compound, Hyderabad 500063- Telangana
3. Mrs. K. Shobha W/o Narayana, Designation: Binder, Emp. ID: 775, Telangana Government Text Book Press,Mint Compound, Hyderabad 500063- Telangana
4. The Assistant Accounts Officer Telangana Government Text Book Press,Mint Compound, Hyderabad 500063-Telangana
..... Defendants

The above Suit is filed for Recovery of Rs. 3,82,213/- and the court summons sent to you were returned un-served. The suit is finally posted on 26-03-2025 for your appearance in person or through pleader. You are directed by the Hon'ble Court to appear in person or through pleader on **26-03-2025** at 10-30 AM and to reply the plaint pleadings and in default the Hon'ble Court will decide the case ex-parte on the merits of the case.

//BY ORDER OF THE COURT//
B.R. Pramod Kumar
Advocate
Flat No. 408, TEJA's HARI VILLU. Near Excise Police Station Manjeera Road, Huda Colny, Chandanagar. Hyderabad 500050
Cell: 9866032875

IN THE COURT OF HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT RAJENDERNAGAR
O.S NO. 90 OF 2025

Between:
1. SMT THOPUDURTHY ARUNA W/o. Late Sri Thopudurthy Sreedhar, Age: 50 yrs, Occupation: Housewife, R/o. H.No. 3-1-5/JP/2b/4/056, Janapriya Uthopia, Hyderguda, Ranga Reddy Dist, Telangana-500048
2. SMT.THOPUDURTHY BHARGAVI D/o. Thopudurthy Sreedhar Age: 26 yrs, Occ: Pvt. Employee, R/o. H.No. 3-1-5/JP/2b/4/056, Janapriya Uthopia, Hyderguda, Ranga Reddy Dist, Telangana-48
3. KUM. THOPUDURTHY HEMASRI SAI VAISHNAVI D/o. Thopudurthy Sreedhar Age: 17 yrs, Occ: Student R/o. H.No. 3-1-5/JP/2b/4/056, Janapriya Uthopia, Hyderguda, Ranga Reddy Dist, Telangana - 500048 (Represented through Natural Mother Smt. Thopudurthy Aruna)
...Plaintiff No. 1 to 3
AND
1. The Mandal Revenue officer (Rajendernagar)
2. All Concerned
Defendant No. 1 & 2

Whereas the Plaintiff herein have filed the above mention suit for To declare that the plaintiffs are Class-1 legal heirs of Sri Thopudurthy Sreedhar who expired on 10-06-2024. The case stands posted to **19-03-2025** at 10.30 AM for appearance of defendants in the above said court. Therefore, take notice that if defendants failed to appear on the said date and time before this Hon'ble court the matter will be decided as ex-parte.

(By Order of the Court)
Counsel for the Plaintiff.
Shreekanth Bangray
Advocate
H.No. 9-1-152, 3rd Floor, Sebastian Road, Opp: St. Patricks High School 5.D. Road, SECUNDERABAD-500 003.
(Mob. 9246889188)

IN THE COURT OF THE PRL JUNIOR CIVIL JUDGE AT: SANGAREDDY
O.S. No. 307 Of 2021

Between:
Andhra Pradesh Grameena Vikas Bank Formerly Manjira Grameena Bank, Presently Telangana Grameena Bank Patancheru Branch, Rep. By its Authorized Person i.e., Field Officer. ...... Plaintiff
AND
Fareed and others .... Defendants

To,
1. Fareed S/o Yousuf, Designation: Binder,Emp. ID: 723,Telangana Government Text Book Press, Mint Compound, Hyderabad 500063-Telangana
2. Md. Ghouse, S/o Jahangeer, Designation: Kallasi,Emp. ID: 811, Telangana Government Text Book Press,Mint Compound, Hyderabad-500063-Telangana
3. M. Shyam Sunder, S/o Lingaiah, Designation: M/ Attender,Emp. ID: 435,Telangana Government Text Book Press,Mint Compound, Hyderabad 500063- Telangana
.... Defendants

The above Suit is filed for Recovery of Rs. 5,73,374/- and the court summons sent to you were returned un-served. The suit is finally posted on 26-03-2025 for your appearance in person or through pleader. You are directed by the Hon'ble Court to appear in person or through pleader on **26-03-2025** at 10-30 AM and to reply the plaint pleadings and in default the Hon'ble Court will decide the case ex-parte on the merits of the case.

//BY ORDER OF THE COURT//
B.R. Pramod Kumar
Advocate
Flat No. 408, TEJA's HARI VILLU. Near Excise Police Station Manjeera Road, Huda Colny, Chandanagar. Hyderabad 500050
Cell: 9866032875

IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD
O.S.No.919 of 2025

Between:
1.Gajam Anjaiah S/o Late. Gajam Narsimha, aged about 69 years, Occ: Business
2.Gajam Ramesh S/o Gajam Anjaiah Aged 48 years, Occ: Business
3.Gajam Murali Krishna S/o Gajam Anjaiah Aged 46 years, Occ: Business
4.Gajam Sravan Kumar S/o G.Anjaiah Aged 39 years, Occ: Business Plaintiffs No. 1 to 4 are R/o H. No. 11-7-140/3, A-36, HUDA Colony, Saroor Nagar, Hyderabad The Plaintiffs No. 2 to 4 are represented by their GPA Holder Gajam Anjaiah S/o Late. Gajam Narsimha, aged about 69years, Occ: Business R/o 11-7-140/3, A-36, HUDA Colony, Saroor Nagar, Hyderabad ...Plaintiffs
And
1.To whom so ever it may concern
2. The Tahsildar, Saroor Nagar Mandal, At Saroor Nagar, Ranga Reddy District.
3.Smt.Chiluveru Dhanalakshmi D/o Gajam Anjaiah W/o Chiluveru Narendra Narayan R/o Villa No.18, Aditya Casa Grande, Sy. Nos. 155 & 156, Narsingi Village, Gandipet Mandal, Gandipet, Ranga Reddy District.
...Defendants

NOTICE

To,
TO WHOM SO EVER IT MAY CONCERN
All Concerned are hereby informed to take notice that, the above named Plaintiffs have filed the suit O.S. No. 919 of 2025 on the file of Hon'ble XIX Junior Civil Judge, City Civil Court, Hyderabad (i) to declare the Plaintiffs and Defendant No.3 as legal heirs of deceased Smt.Gajam Anasuya and (ii) to declare the Plaintiffs and Defendant No. 3 as absolute owners in respect of the suit property i.e., 'All that piece and parcel of open land admeasuring 50 sq. yards out of 100 sq. yards of Plot No. 4, situated at Aziz Bagh, Bagh Amberpet, Hyderabad' and the same is posted to 27.03.2025, for objections if any. If any person/s have any objections may attend the court on the said date at 10-30 a.m., failing which the matter will be decided according to law.

(BY ORDER OF THE COURT)
V.MALLI BABU
ADVOCATE
#202, Komala Nilayam, H.No.1-5-932, Road No.2, New Maruthi Nagar, Kothapet, Hyderabad – 060
Mob: 98487-81545

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUIOR CIVIL JUDGE CUM ADDITIONAL JFCM COURT AT SANGAREDDY
I.A. No. 723 of 2024
IN
OS NO. 590 OF 2021

BETWEEN:
Bhagari Jyothi and others ... Petitioners/ Plaintiffs
AND
Kowlampeta @Malachenna Manemma and others ...Respondents/ Defendantss

NOTICE

To,
R4. P. Gandhi Raju S/o Satyanarayana Raju, Aged about 75 years, R/o Plot No. 41-A, Flat No. 101, Srirama Nilayam, Venngalrao Nagar Colony, Hyderabad-500038.
R5. Dr. Kaidindi Sitaram Kumar S/o Dr. K.A.J. Varma, Aged about 52 years, Occ: Service, R/o D-66,67, Surya Residency, Madhu Nagar, Hyderabad-500038.
R6. G. Ashok Reddy S/o Malla Reddy, Aged about 50 years, Occ: Business, R/o Flat No. 204, Shilpa manor, Shilpa Park, Kondapur, Hyderabad.
R7. B. Damoder Reddy S/o Venkat Narsimha Reddy, Aged about 65 years, Occ: Business, R/o At B.D. Reddy garden, Chitanya Colony, B.N. Reddy Nagara, Hyderabad.
R8. P. Ranga Reddy S/o Sathi Reddy, Aged about 43 years, Occ: Business, R/o Flat No. 204, Shilpa manor, Shilpa Park, Kondapur, Hyderabad.
R9. M/S Cygnuss Educational Society, Secunderabad, Rep By its Secretary T. Jhansi Rani W/o A. Shiva Prasad, Aged about 50 years, Office At Flat No. 402, Prithvi Apartments, Sree Vensai Projects, Kompally, Secunderabad.
...Respondent/ Defendant No. 4 to 9

Take notice that the petitioners/ Plaintiffs filed the above IA NO. 722 OF 2024 IN O. S. No. 590 of 2021 for passing of final decree along with appointment of advocate commissioner for partitioning the suit schedule properties against the Respondents/ Defendants including you, and the above petitions stands posted on 28-03-2025 at 10.30 AM for appearance either you in person or through counsel before the HON'BLE I ADDITIONAL JUIOR CIVIL JUDGE CUM ADDITIONAL JFCM COURT AT SANGAREDDY, failing which on that day the matter will be heard Ex-Party and decided accordingly as per law.

// BY COURT ORDER //
Sd/-
T. RATNAKAR,
G. PENTAIAH,
Advocates, Sangareddy.
Mobile No. 949344324

IN THE COURT OF THE HON'BLE PRINCIPLE JUNIOR CIVIL JUDGE AT SANGAREDDY
O.S. NO. 553 OF 2024

Between
Smt. Gudla Sujatha ...Plaintiff
AND
B.Shamaiah@Samuel & others. ..Defendants

To
Kalikar Janabai W/o Late K. Narsing Rao Aged about: 70 years Occ: Household R/o H.No. 18-7-466/1/10, Hanuman Nagar, Uppuguda, Hyderabad. Pin code-500053
...Defendants No.3

Whereas the Plaintiff filed the above suit seeking the relief of the Declaration of title respect of suit schedule property against you vide in O.S No. 553 of 2024 pending Hon'Ble Principal junior civil Judge Court at Sangareddy for your appearance and same is posted on 25-03-2025 at 10.30 a.m before the above court. If you fail to appear on the abive said date and time either in person or through counsel the matter will be heard and decided in your absence in accordance withe law.

// BY ORDER OF THE COURT//
G. Madhavi
Advocate
Sangareddy
Cell: 9440319000

IN THE COURT OF THE XXth JR. CIVIL JUDGE, CITY CIVIL COURT,AT : HYDERABAD
OS No. 1813 OF 2023

Between :
State Bank of India SMEC-Secunderabad Rep. by its Manager ...Plaintiff
And
M/s. Sri Hanuman Swagath Hair Saloon Rep. by its Prop. V.Bhaskar ...Defendant

To,
M/s. Sri Hanuman Swagath Hair Saloon Rep. by its Prop. V.Bhaskar ,Door No.2-129/9, Vijayapuri Colony Near Balaji Nursing Home ,Uppal Hyderabad-500018.

NOTICE

The abovenamed plaintiff filed suit for Money Recovery against both of you for Rs. 2,06,681/- (Rupees Two Lakhs Six Thousand Six Hundred and Eighty One only) before the Hon'ble XXth Jr. Civil Judge, City Civil Courts, Hyderabad. The Hon'ble Court has directed notice against you through paper publication and the matter is posted to **17-03-2025** for your appearance. You have to appear before Hon'ble XXth Jr. Civil Judge, City Civil Courts, at Hyderabad, at 10-30 AM or If you fail to appear before Hon'ble Court, the matter will be heard and you are set ex-parte.

By order of the XXth Jr. Civil Judge, City Civil Courts, Hyderabad.
M.P. SANJAY
Advocate for the Plaintiff
H.No. 31, Tarbund Bazar, Tarbund, Secunderabad – 500 009
Ph : 040-29558473, Cell : 8885625424

IN THE COURT OF THE XXII JR. CIVIL JUDGE, CITY CIVIL COURT, AT : HYDERABAD
OS No. 1810 OF 2023

Between :
State Bank of India SMEC-Secunderabad Rep. by its Manager ...Plaintiff
And
M/s. Joysna Sai Saloon Rep. by its Prop. N. Santosh ...Defendant

To,
M/s. Joysna Sai Saloon Rep. by its Prop. N. Santosh Shop No. 8-4-390/A/15/A, Prem Nagar, Erra gadda, Hyderabad-500018.

NOTICE

The abovenamed plaintiff filed suit for Money Recovery against both of you for Rs. 2,73,413/- (Rupees Two Lakhs Seventy Three Thousand Four Hundred and Thirteen only) before the Hon'ble XXII Jr. Civil Judge, City Civil Courts, Hyderabad. The Hon'ble Court has directed notice against you through paper publication and the matter is posted to 03-04-2025 for your appearance. You have to appear before Hon'ble XXII th Jr. Civil Judge, City Civil Courts, at Hyderabad, at 10-30 AM or If you fail to appear before Hon'ble Court, the matter will be heard and you are set ex-parte.

By order of the VIIth Jr. Civil Judge, City Civil Courts, Hyderabad.
M.P. SANJAY
Advocate for the Plaintiff
H.No. 31, Tarbund Bazar, Tarbund, Secunderabad – 500 009
Ph : 040-29558473, Cell : 8885625424



హెూలీ వేడుకల్లో పాల్గొన్న అంబర్‌పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది నవతెలంగాణ-అంబర్‌పేట



ముషీరాబాద్ నియోజకవర్గంలో పలువురు కార్యకర్తలు పాల్గొని చిన్న పెద్దలతో కలిసి వేడు హెూలీ సంబరాలలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ - ముషీరాబాద్

ఎగ్జిబిషన్ మైదానంలో ఘనంగా హెూలీ సంబరాలు

డీజే పాటలకు నృత్యాలు చేసిన, మహిళలు యువతీ యువకులు



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

పండుగలు, పరస్పరం, సోదర భావాన్ని పెంపొందిస్తాయని, కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డి సతీమణి జి కావ్య రెడ్డి తెలిపారు. శుక్రవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కౌబాయ్ ప్రొడక్షన్ నిర్వాహకులు, సప్పిడి రోహిత్ రెడ్డి నేతృత్వంలో డీజే హెూరులో హెూలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కావ్య కిషన్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఈ హెూలీ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, రకరకాల రంగుల వలే అన్ని రంగాల్లో, మహిళలు రాణిస్తూ ఆర్థిక సౌలభ్యం సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. కౌబాయ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా, ఈ హెూలీ సంబరాలు ఎంతో వైభవంగా రోహిత్ రెడ్డి నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ వేడుకలకు నగర శివార ప్రాంతాల నుంచి వేలాది మంది యువతీ, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సాహంగా పరస్పరం రంగులు జల్లుకుంటూ హెూలీ శుభాకాంక్షలు, తెలుపుకున్నారు. పేద ధనిక అనే, తారతమ్యం పెద్ద సంఖ్యలో హెూలీ ఉత్సవాల్లో పాల్గొనడం విశేషం

సీఎం వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలి

- బీఆర్ఎస్ యువ నాయకులు ముఠా జై సింహ



నవతెలంగాణ-ముషీరాబాద్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ యువ నాయకులు ముఠా జై సింహ అన్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై శుక్రవారం చిక్కడ పల్లి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతలతో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ముఠా జై సింహ మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ప్రస్తుతం స్ట్రెచర్‌పై ఉన్నారని, తొందర్లోనే మార్చురీకి వెళ్తారంటూ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఇంత త్వరగా ప్రజా వ్యతిరేకతను మూట కట్టుకున్న ముఖ్యమంత్రి తమరే అని ఎద్దేవా చేశారు. తానొక ముఖ్య మంత్రి అనే విషయాన్ని గుర్తు పెట్టుకుని రేవంత్ రెడ్డి చిల్లర వేషాలు మానుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకు నియామక పత్రాలిస్తూ.. ఇంకెంత కాలం డప్పుకొట్టుకుంటావని ప్రశ్నించారు. కేసీఆర్‌పై చిల్లర విషయాలు చెబితే నమ్మడానికి ఉద్యోగాలు పొందిన వారు అమాయకులు కాదని స్పష్టం చేశారు. పార్టీ డివిజన్ల ప్రెసిడెంట్‌లు బల్ల శ్రీనివాస్ రెడ్డి,శంకర్ ముదిరాజ్,శివ ముదిరాజ్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, మీడియా ఇన్‌చార్జి ముచ్చుకుర్తి ప్రభాకర్, దీన్ దయాల్ రెడ్డి, పున్న సత్యనారా యణ, ఆకుల శ్రీనివాస్, ముదిగొండ మురళి, పోతుల శ్రీకాంత్, టెంట్ హౌస్ శ్రీను, రామస్వామి, వంశీ ,తదితరులు పాల్గొన్నారు

ఉమ్మడి హైదరాబాద్ ఆదివాసీ సంఘీభావ వేదిక నిర్మాణం



నవతెలంగాణ - ముషీరాబాద్

ఉమ్మడి హైదరాబాద్ ఆదివాసి సంఘీభావ వేదిక నిర్మాణం శుక్రవారం విద్యానగర్ లోని మార్క్స్ భవనంలో జరిగింది. కన్వీనర్‌లుగా దళిత లిబరేషన్ ఫ్రంట్ నుండి ఇందిరా, ప్రజా కళామండలి రాణి, చైతన్య మహిళా సంఘం జయక్క, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం రవి, ఏఐ ఎఫ్టీయూ నుంచి మల్లేష్, ఏపీఎల్ నుంచి సురేష్ కుమార్, పీడీఎస్‌యూ మహేష్, అమరుల బంధుమిత్రుల సంఘం నుంచి సత్య, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నుంచి రాంబాబు కొనసాగుతారని తెలిపారు. ఈ కన్వీనర్ నిర్మాణానికి పౌరహక్కుల సంఘం హైదరాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. ఈ కన్వీనర్ కమిటీలో రైతు కూలి సంఘం జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆదివాసులపై మారణ హెూమాన్ని నిలిపివేయాలని సహజ వనరుల దోపిడిని నిలిపివేయాలని, పర్యావరణాన్ని రక్షించాలని, పోలీస్ క్యాంపులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది.

రేషన్‌కార్డులు వచ్చేనా..!

- లక్షల్లో దరఖాస్తులు.. ముందుకు సాగని వెరిఫికేషన్
- జిల్లాలో 1.52 లక్షల మంది దరఖాస్తుదారుల ఎదురుచూపులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొత్త రేషన్‌కార్డుల కోసం లబ్దిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటికే అనేక సార్లు లబ్దిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించినా కార్డులు మాత్రం మంజూరు చేయడం లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మార్చి 1 నుంచి కొత్త కార్డుల పంపిణీకి చర్యలు తీసుకుంటుందని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. కానీ నగర పరిధిలో మాత్రం ఇంటింటికి సర్వే చేపట్టి.. క్షేత్రస్థాయి వెరిఫికేషన్ పూర్తి చేసిన తర్వాతే కొత్త కార్డుల మంజూరు ఉంటుందని సంబంధిత జిల్లా అధికారులు తెలియజేశారు. ఈనెల 3వ తేదీ నుంచి ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రారంభమవుతుందని చెప్పినా అధికారులు.. నేటికి ఆ ఊసేత్తకపోవడం గమనార్హం. మరోవైపు మీ సేవా కేంద్రాలు, ప్రజాపాలన, కులగణన సర్వే ద్వారా దరఖాస్తు చేసుకున్నా లబ్దిదారులు తమ ఇంటికి వెరిఫికేషన్ కోసం అధికారులు ఎప్పుడొస్తారని చూస్తున్నారు. రోజులు గడుస్తున్నా.. ఇంటికి రాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.

వెల్లువలా దరఖాస్తులు..

జిల్లాలో కార్డుల కోసం దరఖాస్తులు భారీగా వచ్చాయి. మీ సేవా కేంద్రాలు, ప్రజా పాలనతో పాటు కులగణన సర్వేలోనూ అధికంగా దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో చేసుకున్న వారందరివి పెండింగ్‌లో ఉన్నాయి. ఈ జాబితాలో ఉన్నవారిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎంపిక చేయాల్సి ఉంటుందని సంబంధిత జిల్లా అధికారి ఒకరు చెప్పారు. ఇందులోనూ ఎంతమందికి వస్తాయో లేదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఇటీవల మీసేవా కేంద్రాల్లో కొత్త దరఖాస్తులు కోసం అవకాశం కల్పించగా ఇప్పటివరకు 1.52లక్షలు దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు కొత్త కార్డుల కోసం దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. వీటికి ఎప్పుడు మోక్షం కలుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇదిలావుంటే ప్రజాపాలన, కులగణనలో తీసుకున్న దరఖాస్తులకు సంబంధించి కూడా స్పష్టత లేదు. నగరంలోని 9 సర్కిళ్ల పరిధిలో అక్కడక్కడ ఇంటింటికి సర్వే చేస్తున్నట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు. అదికూడా పూర్తి స్థాయిలో జరగడం లేదని, రోజుకు అయిదు నుంచి పది మించడం లేదని చెబుతున్నారు.



60వేలకు చేరిన 'తొలగింపు' వినతులు

ఇదిలావుంటే పాత కార్డుల్లోని పేర్ల తొలగింపు కోసం కార్డుదారులు సర్కిల్ కార్యాలయాలకు వస్తున్నారు. కొత్త రేషన్ కార్డులతో పాటు పాతవాటిల్లో మ్యుటేషన్స్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా పెండ్లయిన జంటలు, వేరు కాపురం ఉన్నవారు, విడిపోయిన కుటుంబాల వారు.. కొత్తగా రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోవాలంటే.. కుటుంబ సభ్యుల కార్డుల్లో నుంచి డిలిట్ కావాల్సి ఉంటుంది. అప్పుడే వారి నుంచి కొత్త కార్డు కోసం దరఖాస్తు స్వీకరిస్తారు. దీంతో రోజుకు వందలాది మంది తమ కుటుంబ సభ్యుల పేర్ల తొలగింపు కోసం సర్కిల్ కార్యాలయాలకు వస్తున్నారు. దీంతో ఇప్పటివరకు నగరంలోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో 60వేలకుపైగా కార్డుదారులు తమ పాత కార్డుల్లోని పేర్ల తొలగింపునకు దరఖాస్తు చేసుకున్నారనీ, ఇలా వచ్చిన దరఖాస్తుల పరిశీలన అనంతరం అధికారుల పేర్లను తొలగిస్తున్నారు.



బ్లాక్‌లో మద్యం విక్రయించిన ముగ్గురు అరెస్ట్

నవతెలంగాణ - ముషీరాబాద్

హెూలీ పండుగ సందర్భంగా మద్యం షాపులు మూసివేయడంతో అదునుగా భావించి బ్లాక్‌లో మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని చిక్కడపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా హెూలీ పండుగ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్యం షాపులు బంద్ చేయడంతో అదునుగా భావించి అంబర్ పేట ,బాగ్‌లింగంపల్లి, అచ్చయ్య నగర్, ప్రాంతాలలో బ్లాక్‌లో మద్యం విక్రయిస్తున్న అంబర్‌పేట్‌కు చెందిన జావిద్ ఖాన్, అచ్చయ్య నగర్‌కు చెందిన సయ్యద్ సహజీద్, బాగ్‌లింగంపల్లికి చెందిన శివకుమార్ అనే వ్యక్తులు బ్లాక్‌లో మద్యం విక్రయిస్తున్నారు. వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 77 క్వార్టర్ బాటిల్స్ విస్కీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయం పట్ల గౌడ కులస్తుల సంఘం హర్షం



నవతెలంగాణ - ముషీరాబాద్

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పలు మార్లు చర్చలు జరిపి నెక్లెస్ రోడ్డులో ఉన్న నీరాకేఫ్ భవనం దాని పరిధిలో ఉన్న ఆస్తులను తెలంగాణ కల్లు గీత ఆర్థిక సహకార సంస్థకు పునరుద్ధరిస్తూ ఇరు శాఖల మంత్రులు ఒప్పందాల పై సంతకాలు చేయడం హర్షణీయమని గౌడ కులస్తుల గీత కార్మిక సంఘాలు రాష్ట్ర నాయకులు కటామొని వెంకటేష్ గౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్రిక ప్రకటన విడుదల చేశారు. నీరా కేఫ్ ను కల్లు కార్పొరేషన్ కు అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఇతర గౌడ్స్ కులస్తులు, కల్లుగీత కార్మిక సంఘం ఇతర సంఘాలను కలుపుకొని సంబంధిత అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది, పోరాటలే ఫలితంగా నిర్ణయం తీసుకోవడం సంతోషకరం అన్నారు.ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక విప్లవ అభినందనలు తెలిపారు



కవాడిగూడ ఇంద్ర పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెూలీ పండుగ సంబరాలు ఘనంగా జరిగాయి ఈ సంబరాలలో బీజేపీ రాష్ట్ర స్పోక్ పర్సన్ బండారు విజయలక్ష్మి, కవాడిగూడ కార్పొరేటర్ రచన శ్రీ, తదితర మహిళా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.
నవతెలంగాణ - ముషీరాబాద్



నెక్లెస్ రోడ్డు వద్ద హెూలీ సంబరాలు



హెూలీ పండుగ సంబరాల్లో ఎమ్మెల్యే

నవతెలంగాణ - ముషీరాబాద్

కవాడిగూడ డివిజన్‌లో ఇందిరాపార్క్ వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెూలీ పండుగ సంబరాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెూలీ అందరి జీవితాలను రంగులతో నింపాలన్నారు. హెూలీ కష్టాలన్నీ తొలగించాలని జీవితం ఆనందమే కావాలని కోరుకుంటున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ప్రభాకర్ యాదవ్, నరేందర్ రెడ్డి, మీడియా ఇన్‌చార్జి ముచ్చుకుర్తి ప్రభాకర్, నాయకులు రామచందర్, పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.



పాతబస్తీలో హెూలీ..

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

పాతబస్తీలోని పలు ప్రాంతాలలో హెూలీ పండుగని ఆనంద ఉత్సవాల తో జరుపుకున్నారు. ఉప్పుగూడ రక్షపురం కాలనీలో బస్తీ వాసులు ఒకరిపై ఒకరు రంగులు వేసుకుంటూ డీజే పాటలు పెట్టుకుని నృత్యాలు చేసుకుంటూ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

హెూలీ రంగుల కేళీ



పారిశుధ్య కార్మికులతో కార్పొరేటర్ హెూలీ వేడుకలు

నవతెలంగాణ-ముషీరాబాద్

గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులతో హెూలీ పండుగ వేడుకలు నిర్వహించారు. పేద-గొప్ప, కులం-మతం, చిన్న-పెద్ద అన్న తారతమ్యలు లేకుండా ప్రేమ, అభిమానం, ఆప్యాయతలకు ప్రతీకగా సప్తవర్ణ రంగులు ఒకరికొకరు పుసుకొనే వేడుక హెూలీ అని, ఈ రంగుల హెూలీ పండగ అందరి జీవితాలను సుఖసంతోషాలతో రంగుల మయం చేయాలని ఆశీస్తున్నట్టు తెలిపారు. అందరికీ హెూలీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, జవాన్ లు విజయ్ కుమార్,నర్సింగ్ రావు, ఎస్ఎఫ్ఏ లు, రాజ్ కుమార్,సోమేష్,గోపాల కృష్ణ,శివ కుమార్,ఆనంద్ లు పాల్గొన్నారు.

హెూలీ వేడుకల్లో పాల్గొన్న ఆడియాలజిస్ట్ డాక్టర్ డీకే వీణ, వైద్య సిబ్బంది తదితరులు.
నవతెలంగాణ - సుల్తాన్ బజార్




అంబర్‌పేట శంకర్ నగర్ లో హెూలీ వేడుకల్లో చిన్నారులు
నవతెలంగాణ-అంబర్‌పేట





సీఈ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హెూలీ వేడుకల్లో పాల్గొన్న బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి. పద్మ వెంకట్ రెడ్డి
నవతెలంగాణ-అంబర్‌పేట

బడ్జెట్‌లో సాంస్కృతిక శాఖకు ప్రాధాన్యత దక్కేనా..!



నవతెలంగాణ-కల్చరల్

కాంగ్రెస్ ప్రభుత్వం కళలను సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తుందని.. కళా కారుల పట్ల తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల విషయం లో గత ప్రభుత్వం సరైన విధానాలు చేపట్ట లేదని నేటి ప్రభుత్వ పెద్దలు పలు సార్లు చెప్పిన సంగతి తెలిసిందే. కళల పరిరక్షణ సాహిత్య వ్యాప్తి తమ లక్ష్యంగా ప్రకటిస్తూ వస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదికిపైగా అయినా ఇప్పటి వరకూ సాహిత్య అకాడమీకి చైర్మెన్ నియామకం జరుగలేదు. కాగా భాషా సాంస్కృతిక శాఖ కు గత కొన్ని ఏండ్లుగా బడ్జెట్ లో కేటాయింపులలో గొప్ప గా లేకున్నా కేటాయించిన నిధులను కూడా పూర్తి గా విడుదల చేయడం లేదు.

గత ఏడాది బడ్జెట్‌లో రూ.12 కోట్లు సాంస్కృతిక శాఖకు కేటాయించారు. ఇందులో ప్రముఖులు జయంతి లు వారి పేరిట ఇచ్చే నగదు పురస్కారంతో పాటు పలు వేడుకలు పండుగలకు కళా ప్రదర్శనలు ఇలా ఎన్నో సంవత్సరం అంత కేటాయించిన నిధి లోనే ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. శివ రాత్రి వంటి పండుగలకు రాష్ట్ర వ్యాప్తం గా ఉన్న శివా లయ ప్రాంగణాల్లో ప్రతిభా వంతులైన కళా బృందాలచే ప్రదర్శనలు నిర్వహిస్తారు. అంతే కాక రవీంద్ర భారతి లో జరిగే నాణ్యమైన కార్యక్రమాలకు తోడు ఇతర వేదిక లపై జరిగే సంగీత నృత్య నాటక జానపద కళా ప్రదర్శనలు నిర్వహించే సంస్థలకు ఆర్థిక సౌజన్యం సాంస్కృతిక శాఖ అందిస్తూ వస్తోంది. అంతే కాక ఇతర రాష్ట్రాలలో జరిగే కళా ప్రదర్శనలకు ఇక్కడి నుంచి కళా కారులను పంపటం తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కళా బృందం ప్రదర్శనలు, వివిధ ప్రక్రియల శిక్షణా శిబిరాలు కూడా నిర్వహిస్తూ వస్తున్నారు. సంవత్సరం అంతా రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు సాంస్కృతిక శాఖ సహకారం అవసరం కానీ బడ్జెట్ లో తక్కువ కేటాయింపుల వల్ల అందరికీ సరైన న్యాయం జరుగటం లేదని పలువురు కళాకారులు అభిప్రాయ పడుతున్నారు. అలాగే కేటాయించిన 12కోట్ల రూపాయల నిధి పూర్తి విడుదల కావడం లేదన్నది వాస్తవమని పలువురు చెబుతున్నారు. కేవలం 6 నుంచి 9 కోట్లు రూపాయలు మాత్రమే రెండు మూడు విడతలుగా విడుదల చేస్తున్నారని తెలుస్తోంది. దీనితో ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులు తమ పారితోషికాల కోసం ఎదురు చూడవలసిన పరిస్థితి నెలకొంది. సాంస్కృతిక శాఖ లోని రాష్ట్ర సచివాలయం లో ఉండే పై అధికారుల వద్దకు వారు వెళ్లరు సంచాలకుడు వద్ద సమస్యలు వెళ్లబోసు కుంటూ ఉంటారు. ఇలా ఒక పక్క ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ప్రభుత్వ పరం గా చేసే ప్రతి కార్యక్రమం పలు హంగులతో ఆకర్షించే విధంగా లోటు లేకుండా నిర్వహించటం సాంస్కృతిక శాఖ సంచాలకుడికి పరీక్ష డబ్బు దుబారా కాకుండా ఉన్న దానితో బ్యాలెన్స్ చేసుకొం టూ పోవాల్సిన పరిస్థితి. ఈ కారణాల దృష్ట్యా రాష్ట్రం లో సాంస్కృతిక చైతన్యం ఉద్దీపన కోసం ఈ నెల లో ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో ప్రత్యేకించి సాంస్కృ తిక రంగానికి కనీసం రూ.50 కోట్లు కేటాయిస్తే ప్రస్తుతం ఉన్న సంచాలకుడు తన సృజనాత్మకత తో నూతన కార్యక్రమాలు రూపొందించే అవకాశం ఉంది. రాష్ట్రం లో సాంస్కృతిక రంగం ఉత్తేజితం కావటంతో పాటు పలు ప్రక్రియల ఎందరో కళా కారులకు ప్రభుత్వ పరంగా అవకాశాలు వస్తాయి. ఇలా కాంగ్రెస్ ప్రభుత్వం అలోచన కు చెప్పే మాట కు చేత కూడా ఉంటే త్రికరణ శుద్ధి గా ఉంటుంది



కొలెస్ట్రాల్‌ని కరిగించే ఉలవలు

ఉలవలు.. ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ప్రోటీన్, ఫైబర్, విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. వీటిని మన రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే చాలా ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని నిపుణులు చెబుతున్నారు.

బ్లడ్ షుగర్

ఉలవలు తినడం వల్ల ఒంట్లో బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గుతాయి. పచ్చి ఉలవల్లో ఇన్సులిన్ రెసిస్టెన్స్ తగ్గించే గుణాలు ఉన్నాయి. వీటిని తీసుకోవడం వల్ల షుగర్ ఉన్నవారికి కూడా మేలు జరుగుతుంది. అయితే, మోతాదులోనే తీసుకోవాలి.

రక్తహీనత

రక్తహీనతతో బాధపడేవారు ఐరన్ కంటెంట్ ఎక్కువగా ఉన్న ఉలవల్ని తింటే రక్తం పెరుగుతుంది. వీటిని రోజుకి రెండు చెంచాలైనా తీసుకుంటే రక్తహీనత, ఎముకల సమస్యల వంటివి ఇట్టే తగ్గిపోతాయి. అంతేకాదు, ఉలవలకి రక్తనాళాలల్లో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ని కరిగించేందుకు హెల్ప్ చేస్తాయి.

బరువు తగ్గడం

ఉలవల్లో ఫైబర్, ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల బరువు మేనేజ్ చేయడానికి హెల్ప్ అవుతుంది. ఉలవల్ని మనం గుగ్గిల్లు, స్నాక్స్, ఉలవచారు, ఉలవచారు బిర్యానీ ఇలా ఎన్నో రకాలుగా మన డైట్‌లో యాడ్ చేసుకుంటే ఈజీగా బరువు తగ్గుతారు.

స్కిన్ ప్రాబ్లమ్స్

ఉలవల్లో యాంటీ మైక్రోబయల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి స్కిన్ ఇన్ఫెక్షన్స్ దూరం చేసి కొన్ని రకాల సమస్యల్ని తగ్గిస్తాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్, ఖనిజ లవణాలు ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకుంటే చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. దీంతో రోజంతా యాక్టివ్‌గా కూడా ఉంటారు.

నమ్మకం అవసరం...



నమ్మకం అనేది భార్యాభర్తల మధ్య అత్యంత ముఖ్యమైనది. అది లేకపోతే అనేక సమస్యలు వస్తాయి. ప్రతి చిన్న విషయానికీ గొడవలు మొదలవుతాయి. అందుకే అసలు అనుమానం అనేదే రాకుండా చూసుకోవాలి. కొందరు అనవరసరంగా ఏవేవో ఊహించుకొని అనుమానాలు పెంచుకుంటారు. లోతుగా పరిశీలిస్తే అక్కడ సమస్య ఏమీ ఉండదు. మనసు పెట్టి ఆలోచిస్తే ప్రతి సమస్యకూ పరిష్కారం దొరుకుతుంది. అలా ఆలోచించపోతే ఎన్నో సమస్యలు వస్తాయి. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్‌లో...

పావనికి 35 ఏండ్లు ఉంటాయి. ఆమెకు 12 ఏండ్ల కిందట రవితో పెండ్లి జరిగింది. ఇద్దరు పిల్లలున్నారు. ఒక పాప, ఒక బాబు. రవి ఉద్యోగ రీత్యా ముంబయిలో వుంటున్నాడు. పెండ్లయిన కొత్తలో ఇద్దరూ ముంబయిలోనే ఉండేవారు. పిల్లలు పుట్టిన తర్వాత వారి చదువు కోసం పావనీ హైదరాబాద్ వచ్చేసింది. రవి మాత్రం ముంబయిలోనే ఉండేవాడు. పావనీ తన అమ్మ వాళ్ల ఇంటికి కొంచెం దగ్గర్లో ఇల్లు తీసుకుంది. ఏదైనా అవసరం ఉంటే అన్నా, వదినలు ఆమెకు సాయం చేస్తారు. రవి మాత్రం నెలకో, రెండు నెలలకో ఒకసారి వచ్చి పోతుంటాడు.

ఎందుకో తెలియదు కాని కొన్ని రోజుల తర్వాత రవిలో భార్యపై అనుమానం మొదలయింది. దాంతో ఆమెకు ఎప్పుడు పడితే అప్పుడే ఫోన్లు చేసి మాట్లాడడం మొదలుపెట్టాడు. అర్ధరాత్రి రెండు, మూడు గంటలకు కూడా ఫోన్ చేసేవాడు. అంతే కాకుండా వాళ్ళ అన్న వాళ్ళకు కూడా రాత్రి సమయంలో ఫోన్ చేసి ఇంటికి పంపించేవాడు. సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు ఆమె ఫోన్ చెక్ చేసేవాడు. రవి ఫోన్ చేసిన వెంటనే ఆమె ఫోన్ తియ్యాలి. అతను ఫోన్ చేసినప్పుడు ఫోన్ ఎంగేజ్ రాకూడదు. ఒక వేళ వచ్చిందంటే సంబంధం పెట్టుకున్న వాళ్లతోనే మాట్లాడుతుందని గోల చేసేవాడు.

ఎప్పుడైనా రవి రెండు మూడు సార్లు ఫోన్ చేసినా, ఏదైనా పనిలో వుండి పావనీ ఫోన్ తియ్యలేకపోతే వెంటనే చుట్టు పక్కల వారికి, ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ చేసేవాడు. దాంతో ఇంటి పక్క వారు కూడా పావనిని చూసి జాలిపడేవారు. ఈ బాధ భరించలేక 'మీరు అక్కడ, నేను ఇక్కడా ఎందుకు, మీరు కూడా హైదరాబాద్ వచ్చేయవచ్చు కదా' అని భర్తను అడిగింది పావని. ఆమె కుటుంబ సభ్యులు కూడా అదే చెప్పారు. దాంతో రవి ఆరు నెలల తర్వాత హైదరాబాద్ షిఫ్ట్ అయ్యాడు.

> **'మీరు అక్కడ, నేను ఇక్కడా ఎందుకు, మీరు కూడా హైదరాబాద్ వచ్చేయవచ్చు కదా' అని భర్తను అడిగింది పావని. ఆమె కుటుంబ సభ్యులు కూడా అదే చెప్పారు. దాంతో రవి ఆరు నెలల తర్వాత హైదరాబాద్ షిఫ్ట్ అయ్యాడు.**

రవి రావడంతో అనుమానం సమస్య తీరిపోయిందనుకున్నారు. కానీ హైదరాబాద్ వచ్చిన తర్వాత ఆ సమస్య మరీ ఎక్కువై పోయింది. చుట్టుపక్కల వున్న పిల్లలతో, పెద్దవారితో ఎవరితో మాట్లాడినా అనుమానించేవాడు. అతను బయటకు వెళ్ళినపుడు ఎవరితోనో మాట్లాడుతుందనుకునేవాడు. ఈ అనుమానంతో విసిగి పోయింది పావని. దాంతో ఇంట్లో ఉంటే ఇలాంటి అనుమానాలే వస్తాయని 'నేనూ ఉద్యోగం చేస్తాను' అంది పావని. ఆమె కూడా ఉద్యోగంలో చేరింది. ఇక ఆఫీస్ నుండి ఫోన్ వస్తే అనుమానించేవాడు. ఈ అనుమానంతో ఆమెను కొట్టడం కూడా మొదలుపెట్టాడు. 'వేరే వాళ్లతో సంబంధం పెట్టుకోకపోతే ఎందుకు నీకు ఇన్ని సార్లు ఫోన్లు చేస్తారు, ఇంత సేపు ఎందుకు మాట్లాడతారు' అంటూ వేధించేవాడు. ఇలాంటి పరిస్థితుల్లో 'రవి నుండి నాకు రక్షణ కావాలి' అంటూ ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

ఐద్వా అదాలత్
సెల్ : 9490098024

మేము రవికి ఫోన్ చేసి పిలిపిస్తే 'నాకు పావనిపై అనుమానం వుంది. ఎందుకంటే పావని వాళ్ల అమ్మ, మా మామయ్య ఉన్న తర్వాత కూడా వేరే వ్యక్తితో సంబంధం పెట్టుకుంది. ఆ విషయం తెలిసి ఆయన మనోవేధనతో చనిపోయాడు. తర్వాత ఆమె ఎవరితోనైతే సంబంధం పెట్టుకుందో అతనితోనే కలిసి ఉంటుంది. పిల్లలకు అతనే తండ్రి అని చెప్పింది. మమ్మల్ని కూడా అలాగే నమ్మించి పెండ్లి చేసింది. నాకూ ఈ మధ్యనే విషయం తెలిసింది. ఇదంతా నాకు నచ్చలేదు. కనీసం నేను వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడైనా అతన్ని ఇంటికి రానియ్యవద్దని చెప్పాను. అయినా వాళ్లకు నాకంటే అతనే ఎక్కువై పోయాడు. అందుకే అలాంటి తల్లికి పుట్టిన పావనిపై నాకు అనుమానం. ఈమె కూడా వాళ్ల అమ్మలాగే చేయ్యదని గ్యారెంటీ ఏంటీ? అలా కాకపోతే ఈ ఫోన్ లిస్ట్ చూడండి. ఈనెంబర్ నుండి ఆమెకు ఎన్ని ఫోన్లు వచ్చాయో మీకే తెలుస్తుంది. నేను ముంబయిలో ఉన్నప్పటి నుండి జరుగుతుంది ఇది. అందుకే నేను హైదరాబాద్ వచ్చేశాను' అన్నాడు.

పావనిని అడిగితే 'అవును మేడమ్ మా అమ్మకు వేరే వ్యక్తితో సంబంధం ఉంది. కానీ నేను ఫోన్లో మాట్లాడే వ్యక్తి నాకు ఫ్రెండ్ మాత్రమే. రవి ముంబయిలో ఉన్నప్పుడు ఇంట్లోకి ఏమైనా అవసరం అయితే తెచ్చి ఇచ్చేవాడు అంతే. అతని నెంబర్ కూడా నాకు రవినే ఇచ్చాడు. ఇప్పుడు ఇలా అనుమానిస్తున్నాడు. అతని భార్యను నేను వదిన అని పిలుస్తాను. అలాంటి వ్యక్తితో నాకు సంబంధం ఎలా ఉంటుంది మీరే చెప్పండి' అంది.

> **'నాకు పావనిపై అనుమానం వుంది. ఎందుకంటే పావని వాళ్ల అమ్మ, మా మామయ్య ఉన్న తర్వాత కూడా వేరే వ్యక్తితో సంబంధం పెట్టుకుంది. ఆ విషయం తెలిసి ఆయన మనోవేధనతో చనిపోయాడు. తర్వాత ఆమె ఎవరితోనైతే సంబంధం పెట్టుకుందో అతనితోనే కలిసి ఉంటుంది. పిల్లలకు అతనే తండ్రి అని చెప్పింది.**

ఆమె చెప్పింది విన్నారు కదా ఇప్పుడు ఏమంటారు అని రవిని అడిగితే 'నేను పావనితో కలిసి సంతోషంగా ఉండాలనుకుంటున్నాను. అలా ఉండాలి అంటే ఆమె వాళ్ల అమ్మవాళ్లకు దూరంగా ఉండాలి. ఈ విషయం మీరే చెప్పి ఆమెను ఒప్పించండి' అన్నాడు. దానికి పావనీ 'అప్పట్లో మా అమ్మ పరిస్థితి ఏమిటో మాకు తెలియదు. మాకు ఊహ తెలిసినప్పటి నుండి అతన్నే మేము డాడీ అని పిలుస్తున్నాము. అసలు విషయం నాకు పెండ్లికి ముందు తెలిసింది. ఇలాంటి విషయాలు అందరికీ ఎలా చెబుతాను. అందుకే రవికి నేను చెప్పలేదు. కానీ మా అమ్మ చేసినట్టు నేను ఎలా చేస్తాను? మా అమ్మ చేసిన పనికి ఇప్పుడు రవి దగ్గర ఎన్నో ఇబ్బందులు పడతాను. రేపు నా కూతురు పరిస్థితి కూడా ఇలాగే ఉంటుంది. ఎంత చెప్పినా రవి అర్థం చేసుకోవడం లేదు. నాకు నా భర్త, పిల్లలే ప్రపంచం. తెలిసి తెలిసి నేనూ అలాంటి తప్పు ఎలా చేస్తాను?' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది.

'రవి విన్నారు కదా పావని ఏం చెబుతుంతో.. ఇప్పటికీ మీరు ఆమెను వేధించడం, అనుమానించడం సరైనది కాదు. మీ ప్రవర్తన ఇలా ఉంటే మీ నుండి మీ పిల్లలు ఏం నేర్చుకుంటారు? అనవసరమైన అనుమానాలతో సమస్యలు తెచ్చుకోకండి. పావని తల్లి గురించి మర్చిపోండి. ఆమె పరిస్థితి అలాంటిది. మీరు ఇద్దరూ సంతోషంగా ఉండాలనుకుంటున్నారు. దాని గురించి మాత్రమే ఆలోచించండి. అనుమానాలతో మీ జీవితాన్ని మీరే నాశనం చేసుకుంటున్నారు. మీకు బెంగుళూరులో కొత్త ప్రాజెక్ట్ ఏదో ఉందన్నారు కదా! మీరంతా అక్కడకు వెళ్లిపోండి. అక్కడ పిల్లల చదువు కూడా బాగుంటుంది. కొత్త వాతావరణంలో హాయిగా ఉండొచ్చు. పాత విషయాలు అన్నీ మర్చిపోయి మళ్లీ కొత్త జీవితం మొదలుపెట్టండి' అన్నాము. దానికి ఇద్దరూ ఒప్పుకున్నారు. సాధ్యమైనంత త్వరగా బెంగుళూరు షిఫ్ట్ అవుతామని చెప్పారు.

- వై వరలక్ష్మి
9948794051

రాజకీయ ప్రత్యర్థుల

అణచివేతే లక్ష్యం

తిరువనంతపురం : కేరళలో మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా రాజకీయ ప్రత్యర్థుల అణచివేతకు ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం వినియోగిస్తుందని సీపీఐ(ఎం) ఎంపీ కె రాధాకృష్ణన్ శుక్రవారం విమర్శించారు. కర్నువన్నూర్ కోపరేటివ్ బ్యాంక్ స్కాం కేసులో తమ ముందు విచారణకు హాజరుకావాలని రాధాకృష్ణన్‌కు ఈడీ నోటీసులు జారీచేయడంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎంపీ పైవిధంగా స్పందించారు. అలాగే తనకు ఇచ్చిన నోటీసులో కర్నువన్నూర్ కోపరేటివ్ బ్యాంక్ స్కాం కేసు అని పేర్కొనలేదని, దానికి బదులుగా తన బ్యాంక్ అకౌంట్లు, భూమి వివరాలతో సహ తన ఆస్తుల వివరాలు సమర్పించాలని అడిగారని ఎంపీ తెలిపారు. 'ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాల కారణంగా సంస్థ ముందు విచారణకు హాజరుకాలేనని నేను ఒక లేఖ పంపాను. సమావేశాల తరువాత విచారణకు హాజరవుతాను' ఎంపీ తెలిపారు.

అధికారుల సమాచారం ప్రకారం కర్నువన్నూర్ కోపరేటివ్ బ్యాంక్‌లో అక్రమాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈ నెల 15న విచారణకు హాజరుకావాలని రాధాకృష్ణన్‌కు ఈడీ నోటీసులు జారీ చేసింది. సీపీఐ(ఎం) నియంత్రణలో ఉన్న ఈ బ్యాంక్‌లో రూ. 150 కోట్ల విలువైన అక్రమాలు జరిగాయని త్రిస్సూర్‌లోని కేరళ పోలీసు క్రైం బ్రాంచ్‌లో నమోదైన 16 ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది.

పారదర్శకతకు పాతర

(మొదటిపేజీ తరువాయి)

118.9 కోట్ల మంది టెలిఫోన్ సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ప్రస్తుతానికి భారత్‌లో జియో, ఎయిర్‌టెల్‌లు సింహ భాగంతో మార్కెట్‌ను శాసిస్తున్నాయి. భారత్‌లోని 81 శాతం మార్కెట్ ఈ రెండు టెలికాం సంస్థల చేతిలోనే ఉన్నదని తెలుస్తున్నది. భారత్‌లోకి స్టార్‌లింక్ సేవల రాకను వ్యతిరేకించే జియో, ఎయిర్‌టెల్ భయాలు సమర్థనీయమే. స్టార్‌లింక్ ద్వారా తమ మార్కెట్‌కు గండి పడుతుందన్నది వాటి భయం. ముకేశ్ అంబానీకి చెందిన జియో.. స్టార్‌లింక్‌ను ప్రధాన పోటీదారుగా చూసింది. గత రెండేండ్లుగా ప్రభుత్వం ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను కేటాయించే విషయం పై ఆందోళన వ్యక్తం చేసింది. భారత ఇంటర్నెట్ యూజర్లలో 40 శాతం మార్కెట్ షేర్‌తో దేశ మొబైల్ ఇంటర్నెట్ ప్రపంచంలో జియో తన ఆధి పత్యాన్ని ప్రదర్శిస్తున్నది. ఇది భారత ప్రభుత్వం వేలం వేసిన భూసంబంధమైన స్పెక్ట్రమ్ ను ఉపయోగిస్తున్నది. స్టార్‌లింక్ మాత్రం ఇంటర్నెట్ సేవలను అందించ టానికి శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను ఉపయోగిస్తున్నది. అయితే, భూసంబంధమైన ఇంటర్నెట్ ఆపరేటర్లు, శాటిలైట్ ఇంటర్నెట్ ఆపరేటర్ల మధ్య పోటీకి సంబంధించి 2023, జూన్‌లో జియో తన ఆందోళనను సైతం వ్యక్తం చేసింది. ఇందుకు స్టార్‌లింక్‌ను ఒక ఉదాహరణగా పేర్కొన్నది. వేలం ద్వారానే స్పెక్ట్రమ్‌ను పొందాలని వాదించింది. ఇది ప్రొవైడర్ల మధ్య సమతుల్య పోటీని నిర్ధారిస్తుందని వివరించింది. మోడీ ప్రభుత్వం మాత్రం వేలాలను రద్దు చేసి, టెలికమ్యూనికేషన్స్ చట్టం, 2023 ద్వారా ఉపగ్రహ స్పెక్ట్రం 'నిర్వహణ కేటాయింపు'ను అధికారికం చేసింది. అయినప్పటికీ, గతేడాది వరకూ జియో ఇదే వాదనను వినిపించింది.

స్టార్‌లింక్‌కు సానుకూలమయ్యే నిర్వహణ కేటాయింపును 2023, ఏప్రిల్ నుంచి ఎయిర్‌టెల్ సమర్థించింది. దీనర్థం.. భూసంబంధమైన ఇంటర్నెట్ సేవల ద్వారా 33 శాతం మార్కెట్‌ను కలిగి ఉన్న ఎయిర్‌టెల్.. స్టార్‌లింక్ వైపు ఉన్నట్టు కాదని నిపుణులు చెప్పారు. ఎందుకంటే.. స్టార్‌లింక్ నుంచి జియో ఎలాంటి ప్రమాదాన్ని ఎదుర్కొంటుందో ఎయిర్‌టెల్‌కు కూడా అదే ప్రమాదముంటుదన్నది ఆ సంస్థకు తెలుసని చెప్పారు. గతేడాది అక్టోబర్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మిట్టల్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత మార్కెట్‌పై దృష్టిపెట్టిన శాటిలైట్ కంపెనీలు.. టెలికాం కంపెనీల వలెనే స్పెక్ట్రమ్‌ను కొనుగోలు చేయాలనీ, అంతే లైసెన్స్ ఫీజును చెల్లించాలని అన్నారు. అయితే, ఆ తర్వాతి రోజే ఆయన తన వ్యాఖ్యలకు క్లారిటీ ఇచ్చుకోవాల్సి వచ్చింది. తాము ఇప్పటికీ శాటిలైట్ స్పెక్ట్రమ్‌కు 'నిర్వహణ కేటాయింపు'ను కోరుకుంటున్నట్టు చెప్పారు. అయితే, గతేడాది నవంబర్ నుంచి మాత్రం జియో చెప్తున్న మాటలనే ఎయిర్‌టెల్ వినిపించటం గమనార్హం.

గ్రూప్-3 స్టేట్ టాపర్ అర్జున్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

రెండో ర్యాంకు, 330.427 మార్కులతో మూడో ర్యాంకులో ఉన్నారు. 325.157 మార్కులతో మహిళల విభాగంలో ప్రథమ స్థానం సంపాదించారు. జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను టీజీపీఎస్సీ చైర్మెన్ బుర్రా వెంకటేశం ప్రకటించారు. గతేడాది నవంబర్ 17,18 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా 1,401 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-3 రాతపరీక్షలను నిర్వహించామని తెలిపారు. గ్రూప్-3కి రాష్ట్రవ్యాప్తంగా 5,36,400 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారనీ, వారిలో 2,67,921 మంది పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. 18,364 మంది ఓఎంఆర్ పత్రాలు చెల్లుబాటు కాదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జీఆర్ఎల్‌కు 2,49,557 మంది ఎంపికయ్యారని వివరించారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలను స్వీకరించామనీ, నిపుణుల కమిటీతో పరిశీలన చేయించామని తెలిపారు. ఆ కమిటీ సిఫారసులకు అనుగుణంగా తుది కీని రూపొందించి విడుదల చేశామని పేర్కొన్నారు. జీఆర్ఎల్, తుది కీతోపాటు మాస్టర్ ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశామనీ, అవి వచ్చేనెల 12 వరకు అందుబాటులో ఉంటాయని వివరించారు. వాటిపై అభ్యంతరాలను స్వీకరించబోమని స్పష్టం చేశారు. జీఆర్ఎల్ ఆధారంగా అవసరమైన వారిని ధ్రువపత్రాల పరిశీలనకు ఆహ్వానిస్తామని తెలిపారు. అభ్యర్థులకు వ్యక్తిగతంగా, కమిషన్ వెబ్‌సైట్ ద్వారా సమాచారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. అందుకోసం అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఏమైనా సాంకేతికపరమైన ఇబ్బందులు, ఇతర సమస్యలు ఎదురైతే అభ్యర్థులు 040- 23542185, 23542187 నెంబర్లు లేదా helpdesk@tspsc.gov.in మెయిల్ ద్వారా సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీపీఎస్సీ సభ్యులు యరబాది రామ్మోహన్‌రావు, పాల్వాయి రజినికుమారి, కార్యదర్శి నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ తొలి గ్రూప్-3 ద్వారా 1,388 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ 2022, డిసెంబర్ 30న నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే.

గ్రూప్-3 టాపర్లు

ర్యాంకు	హాల్‌టికెట్ నెంబర్	మార్కులు (450)
1	2295819138	339.239
2	2291113046	331.299
3	2295404444	330.427
4	2291818231	329.279
5	2295819112	327.245
6	2293324675	326.272
7	2296409046	326.225
8	2295818625	325.157
9	2296409077	323.184
10	2292807296	323.157

మహిళా టాపర్లు

8	2295818625	325.157
37	2293033457	312.11
46	2292014056	309.184
47	2294411415	309.157
51	2295302791	308.124
55	2295210215	307.097
70	2293033185	305.056
77	2295211076	304.103
82	2296414368	303.076
92	2293035165	301.239

గ్రూప్ - 2లో 18వ ర్యాంకు



నవతెలంగాణ - పాపన్నపేట

గ్రూప్-3 స్టేట్ టాపర్‌గా మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన అర్జున్ రెడ్డి అర్హత సాధించాడు. శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో ఆయన 339 మార్కులతో స్టేట్ ప్రథమ ర్యాంక్ సాధించాడు. ఇటీవల ప్రకటించిన గ్రూప్ -2లో స్టేట్ 18వ ర్యాంక్ సాధించారు. అర్జున్‌రెడ్డి ఇంజినీరింగ్ చేసి, ప్రస్తుతం హవేలీ ఘనపూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ, మెదక్ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. వరుసగా ప్రకటించిన గ్రూప్స్ ఫలితాల్లో అర్జున్ మంచి ప్రతిభ కనపర్చడం పట్ల మండలవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, గ్రూప్-2 పోస్టుకు ప్రాధాన్యత ఇస్తానని అర్జున్‌రెడ్డి తెలిపారు.

నారాయణపేట ముడమాల్ 'నిలువురాళ్లకు'

యునెస్కో జాబితాలో చోటు

(మొదటిపేజీ తరువాయి)

మార్పులు, రుతువులు, కాలాలను గుర్తించడానికి ఆదిమ మానవులు ఏర్పాటు చేసుకున్నట్టు చారిత్రక పరిశోధకులు పేర్కొంటున్నారు. యునెస్కో గుర్తింపు కోసం దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, తెలంగాణ హెరిటేజ్‌శాఖ కృషి చేస్తున్నాయి. గతంలో వరంగల్‌లోని రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు లభించిన విషయం తెలిసిందే.

ఈ నిలువురాళ్ల శిలాయుగానికి సంబంధించిన ఆనవాళ్లని చారిత్రక పరిశోధకులు చెబుతున్నారు. దాదాపు 80 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంతంలో 100 వరకు గండ శిలలు ఉండగా.. ఒక్కొక్కటి 12 నుంచి 14 అడుగుల ఎత్తు వరకు ఉన్నాయి. చిన్న, చిన్న రాళ్ల మరో రెండువేల వరకు ఉంటాయి. అయితే, వీటిని వాతావరణంలో మార్పులు, కాలాలను గుర్తించేందుకు నిలువురాళ్లను ఓ క్రమంలో ఏర్పాటు చేసినట్టు పరిశోధకులు పేర్కొన్నారు. ఆకాశంలో నక్షత్రాలను చూసి దిక్కులను, సమయాన్ని కచ్చితంగా గుర్తించేందుకు ఓ రాయిపై సప్తర్షి మండలాన్ని ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈ నెల 7న ఆయా ప్రదేశాలను తాత్కాలిక జాబితాలో చేర్చినట్టు యునెస్కో లేఖ రాసింది. ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చాలంటే.. ప్రపంచ వారసత్వ కేంద్రం తాత్కాలిక జాబితాలో చేర్చడం తప్పనిసరి. ఈ తాత్కాలిక జాబితాలో చేర్చబడిన ప్రదేశాల్లో ఛత్తీస్‌గఢ్‌లోని కంగేర్ వ్యాలీ నేషనల్ పార్క్, తెలంగాణలోని ముడుమాల్ మెగాలిథిక్ మెన్హిర్, పలు రాష్ట్రాల్లో నిర్మించిన అశోక శాసన ప్రదేశాలు, చౌసత్ యోగిని దేవాలయాలు, ఉత్తర భారతదేశంలోని గుప్త దేవాలయాలు, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లోని బుందేలాస్ రాజభవనాలు, కోటలు ఉన్నాయి.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

'జగిత్యాల' ఘటనపై సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జగిత్యాల జిల్లాకు చెందిన సంపత్ అనే వ్యక్తి పోలీసు రిమాండ్‌లో మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయనీ, ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో ప్రభుత్వం నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రటన విడుదల చేశారు. 'విదేశాల్లో ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశాడనే అభియోగంతో సంపత్ అనే వ్యక్తిని నిజామాబాద్ సైబర్ క్రైం పోలీసు అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. విచారణ ప్రక్రియలో ఉన్నప్పుడే అతడు అకస్మాత్తుగా మరణించాడు. పోలీసు కస్టడీలో చిత్రహింసలు పెట్టడంతో అతను చనిపోయాడనీ, సంపత్ శరీరంపై తీవ్రమైన గాయాలున్నాయనీ, అతన్ని చూడటానికి కూడా అనుమతించలేదని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు' అని తెలిపారు. విచారణ పేరుతో పోలీసులు చిత్రహింసలకు గురిచేయటం, దానికి సహకరించే పద్ధతుల్లో ప్రభుత్వం వ్యవహరిస్తే సమాజంలో ఇది ఒక తప్పుడు సంకేతాన్నిస్తుందని పేర్కొన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. పోలీసులే దీనికి కారణమని నిర్ధారణైతే సంబంధిత అధికారుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగ సమాఖ్యకు

డీలిమిటేషన్ విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఏకపక్ష ప్రయత్నాన్ని ప్రతిఘటించేందుకు ప్రభావిత రాష్ట్రాలు కలిసి వస్తున్నాయని పినరయి విజయన్ తెలిపారు. ఈ అంశంపై ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉండాలన్నారు. ఏ రాష్ట్రంలోనూ ప్రస్తుతం ఉన్న దామాషా సీట్ల వాటాను తగ్గించకుండానే డీలిమిటేషన్ చేయాలని డిమాండ్ చేశారు. జనాభా నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాలను శిక్షించకూడదన్నారు.

స్వాతంత్ర్యం తరువాత కేంద్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన విధానాలకు అనుగుణంగా జనాభాను తగ్గించుకున్న రాష్ట్రాలకు పార్లమెంటులో దామాషా ప్రాతినిధ్యాన్ని తగ్గించడం అన్యాయమన్నారు. ఈ చర్య వీటన్నింటిలోనూ విఫలమైన రాష్ట్రాలకు బహుమతులు ఇచ్చినట్టే అవుతుందని వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాలకు అదనపు నియోజకవర్గాలు లభిస్తాయనే కేంద్ర ప్రభుత్వ వాదనలను పూర్తిగా అంగీకరించలేమన్నారు. దక్షిణ భారత రాష్ట్రాల ఆందోళనలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏకపక్ష చర్యలను నివారించడంతో పాటు ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదాన్ని కాపాడటం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా ఐక్య పోరాటానికి సీపీఐ(ఎం) మద్దతుగా ఉంటుందని, పార్టీ తరుపున రాష్ట్ర కార్యదర్శి ఎమ్వీ గోవిందన్ సంఘీభావాన్ని తెలిపారు. జనాభా నియంత్రణ చర్యలను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాలు 2026 తరువాత జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ కసరత్తు చేస్తే గణనీయమైన సంఖ్యలో సీట్లను కోల్పోతాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ వంటి దక్షిణాది రాష్ట్రాలతో పాటు, ఒడిశా, పంజాబ్, పశ్చిమ బెంగాల్‌తో సహా ఇతర రాష్ట్రాలపైనా ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.

బాయ్‌కాట్ అమెరికా

(మొదటిపేజీ తరువాయి)

73,000 మంది సభ్యులు ఉండగా లగ్జెంబర్గ్ తర్వాత అత్యధిక సెర్చ్‌లు ఈ పేజీకే ఉన్నాయి. గూగుల్‌లో 'బాయ్‌కాట్ అమెరికా' కోసం అత్యధికంగా సెర్చ్‌లు జరుగుతున్న దేశాలలో స్వీడన్ నాలుగో స్థానంలో ఉంది.

అమెరికా వస్తువులకు వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకు అత్యుత్తమ సాధనంగా ఫేస్‌బుక్ పేజ్ ఉపయోగపడుతోంది. 'బాయ్‌కాట్ అమెరికా.. బై ఫ్రెంచ్ అండ్ యూరోపియన్' పేరిట ఫ్రాన్స్ నిర్వహిస్తున్న ఫేస్‌బుక్ పేజీ 20,000 మంది సభ్యులతో గూగుల్ సెర్చెస్‌లో మూడో స్థానంలో ఉంది. ఇప్పుడు 'బాయ్‌కాట్ అమెరికా' ప్రచారంలో కెనడా ముందు వరుసలో ఉంది. గూగుల్ సెర్చెస్‌లో ఐదో స్థానంలో నిలిచింది. యూఎస్‌తో ఎగుమతులు, దిగుమతులు చేసుకునే దేశాల్లోనూ ట్రంప్ తీరు మింగుడుపడటంలేదు. దీనికి వ్యతిరేకంగా కెనడా, మెక్సికో లాంటి దేశాలు గళం విప్పుతుంటే.. మోడీ సర్కార్ రాయబారాల తో నెట్టుకురావాలనుకుంటోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకోవైపు అమెరికా వస్తువుల బహిష్కరణ ఊపందుకోవటంతో..శ్వేతసౌధంలో చర్చనీయాంశంగా మారింది.

హోలీ ముసుగులో గంజాయి అమ్మకాలు

(మొదటిపేజీ తరువాయి)

ఎస్టీఎఫ్ అధికారుల దాడుల్లో ఈ అక్రమ దందా వెలుగు చూసింది. లోయర్ ధూల్‌పేటలోని మల్చిపూరాలో ఐస్ క్రీమ్ పార్లర్ నిర్వహిస్తున్న సత్యనారాయణ సింగ్ అనే వ్యక్తి గంజాయి అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారంతో అధికారులు దాడి చేసి వంద గంజాయి కుల్ఫీ చాక్లెట్లు, 72 బర్ఫీ స్వీట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి అంజిరెడ్డి తెలిపారు.

స్వయం ఉపాధికి.. రాజీవ్ యువ వికాసం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల యాక్షన్ ప్లాన్

- రూ.6 వేల కోట్లు కేటాయించనున్న ప్రభుత్వం
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ఛాన్స్
- లబ్దిదారుల ఎంపికకు మార్గదర్శకాలపై కసరత్తు
- ఐదేండ్లుగా కార్పొరేషన్ రుణాలకు విరామం
- ఎన్నికల ముందు మంజూరైనా గ్రౌండింగ్‌కాని యూనిట్లు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 'రాజీవ్ యువ వికాసం' పేరిట సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. 5 లక్షల మంది నిరుద్యోగులకు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలిచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. గత ప్రభుత్వంలో చివరి ఐదేండ్ల కాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు నిధులివ్వలేదు. ఎలాంటి ఉపాధి పథకాలూ అమలు కాలేదు. నిరుద్యోగులకు ఉపాధి పొందేందుకు వివిధ రకాల యూనిట్లను నెలకొల్పేందుకు రుణ సదుపాయం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఐదారేండ్ల విరామం తర్వాత కార్పొరేషన్ రుణాలివ్వనుండటంతో లక్షలాది మంది నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ పథకం గురించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇప్పటికే ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా ఆయా సామాజిక తరగతుల నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం సబ్సిడీతో కూడిన బ్యాంకు లింకేజీ రుణాల్ని మంజూరు చేయనున్నారు. రాష్ట్రంలో 5 లక్షల మంది యువతకు రుణాలిచ్చేందుకు రూ.6 వేల కోట్ల నిధుల్ని కేటాయించారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 4200 మంది వరకు నిరుద్యోగులకు రుణాలందనున్నాయి. రూ.3 లక్షల నుంచి ఐదు ఏడు లక్షల వరకు రుణాలిస్తారు. యూనిట్‌పై 35 శాతం వరకు సబ్సిడీ రూపంలో రాయితీ ఇవ్వనున్నారు.

రూ.6 వేల కోట్లతో రుణ ప్రణాళికలు

రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు రూ.6 వేల కోట్ల నిధుల్ని కేటాయించారు. బీసీ కార్పొరేషన్‌తోపాటు ఎంబీసీ కార్పొరేషన్, బీసీ ఫెడరేషన్‌లకు రూ.2500 కోట్లు, ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.2136 కోట్లు, మైనార్టీ కార్పొరేషన్‌కు రూ.800 కోట్లు, ఎస్టీలకు ట్రైకార్‌లో స్వయం ఉపధి కోసం రూ.657.76 కోట్ల చొప్పున నిధుల్ని కేటాయిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు ఆయా జిల్లాల్లోని జనాభాను బట్టి నిధులు కేటాయించనున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 4200 మంది యువతకు ఉపాధి కల్పించే అవకాశముంది.

15 నుంచి దరఖాస్తుల స్వీకరణ

రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా లబ్దిపొందేందుకు నిరుద్యోగ యువత నుంచి ఈ నెల 15 నుంచి దరఖాస్తుల్ని స్వీకరించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను సిద్ధం చేసింది. నోటిఫికేషన్ విడుదల చేసి ఆ రోజు నుంచే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల్ని స్వీకరించనున్నారు. ఏప్రిల్ 5 వరకు దరఖాస్తుల్ని స్వీకరించి.. మే 31 వరకు పరిశీలిస్తారు. మార్గదర్శకాల ప్రకారం అర్హులైన లబ్దిదారుల ఫైనల్ జాబితాను విడుదల చేసి రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న మంజూరీ పత్రాల్ని పంపిణీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. కార్పొరేషన్ల ద్వారా ఇప్పటి వరకు రుణాలు పొందని వారితో పాటు గతంలో లబ్దిపొంది ఐదేండ్లు దాటిన వాళ్లు కూడా దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారంటున్నారు. వయో పరిమితి కూడా 55 ఏండ్ల వరకు ఉండటంతో అందరికీ అవకాశం దక్కనుంది. కులం, ఆదాయం, విద్యార్హతలు, ఆధార్, అనుభవం వంటి పత్రాలతోపాటు యూనిట్ ప్రాజెక్టు రిపోర్టుతో దరఖాస్తు చేయాలి.

బ్యాంకు లింకేజీ రుణాలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రాజీవ్ యువ వికాసం పేరిట అమలు చేయనున్న పథకంలో కనీసం రూ.3 లక్షల నుంచి ఐదు లక్షలపైనే రుణాలిస్తామని ప్రభుత్వం చెబుతోంది. యూనిట్ పెట్టాలనుకున్న నిరుద్యోగులు అందుకు సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టుతో స్థానిక బ్యాంకర్లను సంప్రదించాలి. రూ.3 లక్షల రుణంతో యూనిట్ నెలకొల్పితే సదరు లబ్దిదారుడికి రూ.1.80 లక్షలు సబ్సిడీగా ప్రభుత్వం ఇస్తుంది. రూ.5 నుంచి 7 లక్షల వరకు రుణం తీసుకుంటే ప్రభుత్వం నుండి రూ.3 లక్షల సబ్సిడీ అందుతుంది. సబ్సిడీ పోగా మిగతా రుణ మొత్తాన్ని బ్యాంకు లేదంటే లబ్దిదారుడి వాటా ధనంగా భరించాల్సి ఉంటుంది.

పాత, కొత్త వాళ్లందరికీ రుణాలివ్వాలి



రాజీవ్ యువ వికాసం పథకంలో పాత, కొత్త వాళ్లందరికీ రుణాలివ్వాలి. గత ప్రభుత్వం చాలా ఏండ్లు కార్పొరేషన్లకు నిధులివ్వక రుణాలు మంజూరు కాలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు దళితబంధు, బీసీబంధు, ఇతర కార్పొరేషన్ రుణాలు మంజూరు చేసినా గ్రౌండింగ్ చేయలేదు. అంతకు ముందు రుణాలిచ్చినా సబ్సిడీ గ్రాంట్ విడుదల చేయలేదు. అలాంటి వాళ్లకూ రాజీవ్ యువవికాసంలో అవకాశమివ్వాలి. షరతుల్లేకుండా రుణాలిచ్చేందుకు బ్యాంకర్లకు ఆదేశాలివ్వాలి.

–అశోక్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, సంగారెడ్డి

కెనడా కొత్త ప్రధానిగా మార్క్ కార్నీ ప్రమాణం

ఒట్టావా: కెనడా నూతన ప్రధానమంత్రిగా మార్క్ కార్నీ (59) ప్రమాణ స్వీకారం చేశారు. అమెరికాతో వాణిజ్య యుద్ధం, ట్రంప్ నుంచి విలీన ముప్పు, ఫెడరల్ ఎన్నికలు వంటి సవాళ్ల నేపథ్యంలో 24వ ప్రధానిగా కార్నీ బాధ్యతలు స్వీకరించారు. కెనడా గవర్నర్ జనరల్ మేరీ సైమన్ సమక్షంలో కార్నీ నూతన ప్రధానిగా ప్రమాణం చేశారు. పీఎం పదవికి రాజీనామా చేస్తున్నట్టు జస్టిన్ ట్రూడో ఈ జనవరిలో ప్రకటించిన నేపథ్యంలో అధికార లిబరల్ పార్టీకి కొత్త సారథి ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలో పార్టీలో జరిగిన ఎన్నికల్లో బ్యాంక్ ఆఫ్ కెనడా, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లకు గతంలో గవర్నర్‌గా పనిచేసిన కార్నీ ఘన విజయం సాధించారు. అమెరికా–కెనడా సంబంధాలు దెబ్బతింటున్న సమయంలో కార్నీ బాధ్యతలు స్వీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఫోర్ట్ స్మిత్‌లో 1965లో జన్మించిన మార్క్ కార్నీ హార్వర్డ్‌లో ఉన్నత విద్య అభ్యసించారు. గోల్డ్‌మన్ శాక్స్‌తో ప్రయాణం ప్రారంభించి.. బ్యాంక్ ఆఫ్ కెనడా, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లకు గవర్నర్‌గా పనిచేశారు.

2008–09 ఆర్థిక సంక్షోభం వేళ పరిష్కార మార్గాల్లో కీలక పాత్ర పోషించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికి అవసరమైన చర్యలను సమన్వయపరచడంలో కీలకంగా వ్యవహరించి అందరి ప్రశంసలు అందుకున్నారు. 2020లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌ను వీడిన అనంతరం ఐరాస ఆర్థిక, వాతావరణ మార్పుల విభాగం రాయబారిగా సేవలందించారు. ట్రూడో రాజీనామా ప్రకటన అనంతరం లిబరల్స్ పార్టీ సారథి రేసులో నిలిచి.. ఘన విజయం సాధించారు. గతంలో ఎన్నడూ ఎన్నికల్లో పోటీ చేయని, క్యాబినెట్‌లో పనిచేసిన అనుభవం లేని కార్నీ.. కెనడా నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం గమనార్హం.



ఇప్పుడైనా అందుకుంటారా?

ముంబయితో ఢిల్లీ అమ్మాయిల ఢీ నేడు మహిళల ప్రీమియర్ లీగ్ 2025

ముంబయి : మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో అత్యంత నిలకడగా రాణించిన జట్టు ఢిల్లీ క్యాపిటల్స్. మెగ్ లానింగ్ సారథ్యంలో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా మూడోసారి ఫైనల్స్‌కు చేరుకున్నారు. తొలి సీజన్‌లో ముంబయి ఇండియన్స్, రెండో సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ చేతిలో భంగపడిన ఢిల్లీ క్యాపిటల్స్.. ముచ్చటగా మూడోసారి టైటిల్ వేటకు సిద్ధమైంది. 2023 సీజన్ ఫైనలిస్టులు 2025 సీజన్ అంతిమ సమరానికి సై అంటున్నారు. తొలి రెండు ఫైనల్స్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్.. ఈసారి వ్యూహాత్మకంగా ఎటువంటి మార్పులు చేస్తుందో చూడాలి. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో ముంబయి ఇండియన్స్ రెండో టైటిల్ కోసం ఎదురుచూస్తోంది. షెఫాలీ వర్మ, మెగ్ లానింగ్, శిఖా పాండే, జెస్ జొనాసెన్‌లు ఢిల్లీ క్యాపిటల్స్‌కు.. నటాలీ సీవర్, మాథ్యూస్ హేలీ, అమేలీ ఖేర్‌లు ముంబయి ఇండియన్స్‌కు కీలకం కానున్నారు. ముంబయిలోని బ్రబౌర్న్ స్టేడియంలో నేడు రాత్రి 8 గంటలకు డబ్ల్యూపీఎల్ ఫైనల్ ఆరంభం కానుంది.

బుమ్రా అనుమానమే!

ముంబయి : ఐపీఎల్‌లో ఐదు సార్లు చాంపియన్ ముంబయి ఇండియన్స్‌కు గట్టి ఎదురుదెబ్బ. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా వెన్నునొప్పి గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. ఐపీఎల్ 18 సీజన్ తొలి దశ మ్యాచులకు బుమ్రా అందుబాటులో ఉండేది అనుమానంగా మారింది. మార్చి 22న ఐపీఎల్ 18 ఆరంభం కానుండగా.. ఈ నెలలో ముంబయి ఇండియన్స్ మూడు మ్యాచులు ఆడనుంది. 23న చెపాక్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌తో ముంబయి ఇండియన్స్ తొలి మ్యాచ్‌లో ఆడనుంది. బుమ్రా ఫిట్‌నెస్, ట్రాక్ రికార్డు దృష్టిలో ఉంచుకుని స్టార్ పేసర్ కనీసం 6–7 మ్యాచులకు దూరంగా ఉండే అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు. ఈ ఏడాది జనవరిలో ఆస్ట్రేలియాతో సిడ్నీ టెస్టులో గాయపడిన బుమ్రా మళ్లీ మైదానంలో అడుగుపెట్టలేదు. చాంపియన్స్ ట్రోఫీ ప్రాథమిక జట్టుకు ఎంపికైనా.. వైద్య నివేదికల అనంతరం మెగా ఈవెంట్‌కు దూరంగా ఉన్నాడు. ఐపీఎల్‌కు అందుబాటులో ఉంటాడని ఆశించినా.. బుమ్రా వంద శాతం ఫిట్‌నెస్ సాధించలేదని సమాచారం.

ముగిసిన పోరాటం

- లక్ష్యసేన్, సాత్విక్-చిరాగ్ ఓటమి
- గాయత్రి, ట్రెసా జంటకు తప్పని నిరాశ

ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్



బర్మింగ్‌హామ్ (ఇంగ్లాండ్) : ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్‌లో భారత షట్లర్ల ఆశలు ఆవిరయ్యాయి. పురుషుల సింగిల్స్ సహా మహిళల డబుల్స్‌లోనూ మన షట్లర్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకోవటంతో బిడబ్ల్యూఎఫ్ సూపర్ 1000 టోర్నమెంట్‌లో భారత్ పతక అవకాశాలు మెరుగ్గా కనిపించాయి. కానీ టీమ్ ఇండియా షట్లర్ల పోరాటానికి క్వార్టర్‌ఫైనల్స్‌లోనే తెరపడింది. సింగిల్స్ సహా డబుల్స్ విభాగాల్లో భారత షట్లర్లు నిష్క్రమించారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి, ట్రెసా జాలి జంట ప్రీ క్వార్టర్స్‌లో చూపించిన జోరు క్వార్టర్స్‌లో చూపించలేదు. 15–21, 21–18, 21–18తో ఎనిమిదో సీడ్ దక్షిణ కొరియా షట్లర్లను చిత్తు చేసిన గాయత్రి, ట్రెసాలు క్వార్టర్స్‌లో నిరాశపరిచారు. రెండో సీడ్, చైనా అమ్మాయిలు షెంగ్ లి, నింగ్ టాన్‌లు 21–14, 21–10తో వరుస గేముల్లో జాలి, గాయత్రిలపై గెలుపొందారు. 46 నిమిషాల్లోనే ముగిసిన క్వార్టర్‌ఫైనల్లోనూ ట్రెసా, గాయత్రిలు తేలిపోయారు. తిరుగులేని ఆధిపత్యంతో అలవోకగా గెలుపొందిన చైనా అమ్మాయిలు సెమీఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్స్‌లో వరల్డ్ నం.6 జొనాథన్ క్రిస్టీని చిత్తు చేసిన జోరుమీదున్న లక్ష్యసేన్ క్వార్టర్‌ఫైనల్లో నిరాశపరిచాడు. ఆరో సీడ్, చైనా షట్లర్ షి ఫెంగ్ లీతో మ్యాచ్‌లో 10–21, 16–21తో వరుస గేముల్లో ఓటమి చెందాడు. 45 నిమిషాల్లోనే ముగిసిన క్వార్టర్స్ పోరులో లక్ష్యసేన్ అంచనాలను అందుకోలేదు. పురుషుల డబుల్స్ ప్రీ క్వార్టర్స్‌లో సాత్విక్, చిరాగ్ శెట్టి వాకోవర్‌తో తప్పుకున్నారు. ఏడో సీడ్ సాచి జంట 16–21, 2–2తో ఉండగా వాకోవర్ ఇచ్చారు. దీంతో ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్‌లో భారత షట్లర్ల పోరాటానికి తెరపడింది.

క్యాపిటల్స్ కెప్టెన్‌గా అక్షర్

ఢిల్లీ క్యాపిటల్స్ సంచలన నిర్ణయం



న్యూఢిల్లీ : ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం కొత్త నాయకుడి ఎంపికలో సరికొత్తగా ఆలోచించింది. నాయకత్వంలో మంచి అనుభవం కలిగిన డుప్లెసిస్, కెఎల్ రాహుల్‌ను కాదని యువ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌ను కెప్టెన్‌గా ఎంచుకుంది. రూ.16.50 కోట్లకు అక్షర్ పటేల్‌ను అట్టిపెట్టుకున్న ఢిల్లీ క్యాపిటల్స్..రూ.14 కోట్లతో రాహుల్, రూ.11.75 కోట్లతో స్టార్క్‌ను వేలంలో తీసుకుంది. గత సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌తో మ్యాచ్‌కు సారథ్యం వహించిన అక్షర్ పటేల్.. దేశవాళీ క్రికెట్‌లో గుజరాత్‌కు వైట్‌బాల్ ఫార్మాట్‌లో కెప్టెన్సీ బాధ్యతలు నిర్వర్తించాడు. భారత టీ20 జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన అక్షర్.. ఇటీవల చాంపియన్స్ ట్రోఫీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 'ఢిల్లీ క్యాపిటల్స్‌కు నాయకత్వం వహించటం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. క్రికెటర్‌గా ఎదిగాను, నాయకుడిగా ముందుండి నడిపించేందుకు ఆత్మవిశ్వాసంతో సిద్ధంగా ఉన్నానని' అక్షర్ తెలిపాడు. ఐపీఎల్18లో ఢిల్లీ క్యాపిటల్స్ తొలి రెండు మ్యాచులను విశాఖపట్నంలో ఆడనుంది. ఈ నెల 24న వైజాగ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తొలి మ్యాచ్ ఆడనుంది. గత సీజన్‌లో 14 మ్యాచుల్లో 14 పాయింట్లే సాధించిన ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్ల పట్టికలో ఆరో స్థానంతో సరిపెట్టుకుంది.



వీరమల్లు.. విడుదల వాయిదా

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'హరి హర వీరమల్లు' సినిమా విడుదల వాయిదా పడింది. సినీ అభిమానులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రాన్ని మొదట ఈనెల 28న విడుదల చేయాలని అనుకున్నారు. కానీ ఇంకా నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నందున విడుదలను వాయిదా వేశారు. మే 9వ తేదీన థియేటర్లలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

చారిత్రాత్మక యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ కళ్యాణ్ కనువిందు చేయనున్నారు. మునుపెన్నడూ చూడని సరికొత్త అవతార్‌లో పవర్ స్టార్ కనిపించనున్నారు. మొఘల్ రాజుల నుండి కోహినూర్ వజ్రాన్ని దొంగిలించడంతో పాటు, ప్రేక్షకుల మనసు దోచుకోవడానికి ఆయన సిద్ధమవుతున్నారు. న్యాయం కోసం యుద్ధం చేయనున్న వీరమల్లు మే 9వ తేదీన థియేటర్లలో అడుగు పెట్టనున్నారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. భారీ, సోలో విడుదల కావడంతో ఇండియా, ఓవర్సీస్ అనే తేడా లేకుండా అన్ని చోట్లా ఈ చిత్రం సంచలన వసూళ్ల రాబడుతుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు.

కరోనా మహమ్మారి, పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణం కారణంగా చిత్రీకరణ ఆలస్యమైనప్పటికీ చిత్ర దర్శకత్వ బాధ్యతలు తీసుకున్న ఎ.ఎం.జ్యోతి కృష్ణ ఎక్కడా రాజీ పడకుండా వేగంగా ఈ సినిమాని పూర్తి చేస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'మాట వినాలి', 'కొల్లగొట్టినాదిరో' గీతాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రముఖ ఛాయాగ్రాహకుడు మనోజ్ పరమహంస కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈ సినిమాకి లెజెండరీ కళా దర్శకుడు తోట తరణి అద్భుతమైన సెట్‌లను రూపొందించారు. ప్రతిభ గల ఈ సాంకేతిక బృందం, ప్రేక్షకులకు వెండితెరపై మరపురాని అనుభూతిని అందించబోతోంది. పవన్ కళ్యాణ్‌తో పాటు పలువురు ప్రముఖ నటీనటులు ఈ చిత్రంలో భాగమయ్యారు.

మొఘల్ చక్రవర్తిగా బాబీ డియోల్ నటిస్తున్నారు. యానిమల్, డాకు మహారాజ్ చిత్రాలతో ఆకట్టుకున్న బాబీ డియోల్.. ప్రతినాయక పాత్రలో మరోసారి తనదైన ముద్ర వేయనున్నారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్, జిషు సేన్‌గుప్తా కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాత ఎ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు అని చిత్ర బృందం తెలిపింది.

పాట చిత్రీకరణలో 'సంబరాల యేటిగట్టు'



హీరో సాయి దుర్గ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'సంబరాల యేటిగట్టు'. నూతన దర్శకుడు రోహిత్ కెపి దర్శకత్వం వహించిన ఈ యాక్షన్–ప్యాక్డ్ థ్రిల్లర్‌లో సాయి దుర్గ తేజ్ నెవెర్ బిఫోర్ అవతార్‌లో కనిపించనున్నారు. బ్లాక్‌బస్టర్ 'హనుమాన్'తో భారీ విజయం సాధించిన తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

హోలీ శుభ సందర్భంగా మేకర్స్ బ్రాండ్ న్యూ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇది మొత్తం టీం వారి ముఖాల్లో ఆనందంతో నిండినట్లు చూపిస్తుంది. హీరో తన టీం ఉత్సాహపరిచేందుకు తన చేతిని పైకెత్తడం కనిపిస్తుంది. ఈ గెస్చర్ ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తుంది. ఇప్పటికే విడుదలైన కార్నేజ్ టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్‌తో ఈ సినిమాపై బజ్ నెక్స్ట్ లెవల్‌కి చేరుకుంది. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. తాజాగా హైదరాబాద్‌లో ఒక పాట చిత్రీకరణలో చిత్ర బృందం బిజీగా ఉంది. ఈ చిత్రం సెప్టెంబర్ 25న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో పాన్ ఇండియా రిలీజ్ కానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది. సాయి దుర్గ తేజ్, ఐశ్వర్య లక్ష్మి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి రచన –దర్శకత్వం: రోహిత్ కె.పి, నిర్మాతలు: కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి, డీవోపీ: వెట్రి పళనిసామి, సంగీతం: బి అజనీష్ లోక్‌నాథ్, ఎడిటర్: నవీన్ విజయ కృష్ణ, ప్రొడక్షన్ డిజైనర్: గాంధీ నడికుడికర్.

నవచిత్రం

టీజర్ రిలీజ్‌కి రంగం సిద్ధం



కళ్యాణ్‌రామ్

నందమూరి కళ్యాణ్ రామ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి. ఈ చిత్రంలో విజయశాంతి పవర్ ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఈ యాక్షన్–ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఈ రెండు పాత్రలు మధ్య డైనమిక్స్ కీలకంగా వుండబోతున్నాయి. ఇప్పటికే ఫస్ట్ లుక్ స్ట్రాంగ్ ఇంపాక్ట్‌ని క్రియేట్ చేసింది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించి ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు.

తాజాగా ప్రీ–టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. రాబోయే ఇంటెన్స్ యాక్షన్, ఉత్కంఠను రుచి చూపించే అద్భుతమైన ప్రీ–టీజర్ విడుదలతో ఉత్సాహం న్యూ హైట్స్‌కి చేరుకుంది. ప్రీటీజర్‌లో కళ్యాణ్ రామ్ ఒక పడవపై కూర్చుని, సముద్రం వైపు చూస్తూ తన చూపులు కదలకుండా కనిపిస్తున్నారు. రక్తంతో తడిసిన అతని చొక్కా, అతని చుట్టూ ఉన్న అల్లకల్లోలాన్ని సూచిస్తుంది, పడవలు దగ్గరకు వస్తున్నప్పుడు అతని ఫెరోషియస్ లుక్ జరగబోయే పెద్ద యుద్ధాన్ని చూస్తోంది. ప్రీ–టీజర్ జరగబోయే బ్లాస్ట్‌కి టోన్ సెట్ చేసింది. ఇది యాక్షన్ రోలర్ కోస్టర్‌ను అందిస్తుంది. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరిచిన నేపథ్య సంగీతం పవర్‌ఫుల్‌గా ఉంది. టీజర్‌ను ఈనెల 17న విడుదల చేయటానికి మేకర్స్ రంగం సిద్ధం చేశారు.

సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి, నిర్మాతలు: అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, డీవోపీ: రామ్ ప్రసాద్, ఎడిటర్: తమ్మిరాజు, సమర్పణ: ముప్పా వెంకయ్య చౌదరి, స్క్రీన్ ప్లే: శ్రీకాంత్ విస్సా, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి, యాక్షన్: రామకృష్ణ, పీటర్ హెయిన్.

మరో అరుదైన గౌరవం



చిరంజీవి


అగ్ర కథానాయకుడు చిరంజీవికి మరో అరుదైన గౌరవం లభించనుంది. హౌస్ ఆఫ్ కామన్స్ – యు.కె పార్లమెంట్‌లో గౌరవ సత్కారం జరగనున్నది.

నాలుగున్నర దశాబ్దాలుగా సినిమాల ద్వారా కళారంగానికి, సమాజానికి చేసిన సేవలకుగానూ యుకెకి చెందిన అధికార లేబర్ పార్టీ పార్లమెంట్ మెంబర్ నవేందు మిశ్రా చిరంజీవిని ఈనెల 19న సన్మానించనున్నారు.

సోజన్ జోసెఫ్, బాబ్ బ్లాక్ మన్ సహా ఇతర పార్లమెంట్ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అదే వేదికపై బ్రిడ్జ్ ఇండియా సంస్థ, సినిమా, ప్రజాసేవ, దాతృత్వానికి చిరంజీవి చేసిన కృషిని గుర్తించి కల్చరల్ లీడర్షిప్ ద్వారా ప్రజాసేవలో ఎక్సలెన్స్ కోసం 'జీవిత సాఫల్య పురస్కారం' ప్రదానం చేయనున్నారు.

బ్రిడ్జ్ ఇండియా సంస్థ అనేది యు.కెలో ఒక ప్రముఖ సంస్థ. ఇది పబ్లిక్ పాలసీని రూపొందించడానికి పనిచేస్తుంది. అలాగే వివిధ రంగాల్లోని వ్యక్తులు సాధించిన విజయాలు..వారు తమ చుట్టూ ఉన్న సమాజంపై చూపించిన ప్రభావం మరింత విస్తృతం కావాలనే ఉద్దేశంతో వారిని సత్కరిస్తుంటుంది. బ్రిడ్జ్ ఇండియా సంస్థ లైఫ్ టైమ్ ఆచీవ్‌మెంట్ అవార్డును తొలిసారిగా అందజేస్తోంది. దాన్ని చిరంజీవి అందుకోనుండటం విశేషం. ఇది ఆయన కీర్తి కిరీటంలో మరో కలికితురాయిగా నిలుస్తుంది. యు.కెకు చెందిన పార్లమెంట్ సభ్యులు, బ్రిడ్జ్ ఇండియా వంటి ప్రఖ్యాత సంస్థ అంతర్జాతీయ వేదికపై చిరంజీని సన్మానించటం, ఆయనకు లైఫ్ టైమ్ ఆచీవ్‌మెంట్ అవార్డ్ ఇవ్వటం అనేది ప్రత్యేకమైన సందర్భం. 2024లో భారత ప్రభుత్వం నుంచి రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మ విభూషణ్‌ను చిరంజీవి అందుకున్నారు. అలాగే గత ఏడాది అత్యంత సమర్థవంతమైన నటుడు, డ్యాన్సర్‌గా గిన్నీస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సొంతం చేసుకున్నారు. ఎ.ఎన్.ఆర్ శత జయంతి సందర్భంగా అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్ 2024లో చిరంజీవికి ప్రతిష్టాత్మక ఎ.ఎన్.ఆర్ జాతీయ అవార్డును ప్రదానం చేసింది.

మంగపతి క్యారెక్టర్‌తో నా కల నెరవేరింది



శివాజీ

హీరో నాని తన వాల్ పోస్టర్ సినిమా పతాకంపై సమర్పించిన చిత్రం 'కోర్ట్' – స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా ప్రీమియర్స్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది.

శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్‌తో యునానిమస్ బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో ఇందులో మంగపతి పాత్ర పోషించిన నటుడు శివాజీ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

దాదాపు 12 ఏండ్ల తర్వాత..

దాదాపు 12 ఏళ్ల తర్వాత మంగపతి లాంటి పవర్ ఫుల్ పాత్ర రావడం చాలా ఆనందంగా ఉంది. నా ఫ్యామిలీ, పిల్లలు నన్ను మళ్ళీ యాక్ట్ చేయమని కోరేవారు. నాకూ చేయాలని ఉండేది. కానీ నేను ఎవరినీ అడగలేను. ఈటీవీ బాపినీడుని కలిసి విషయం చెప్పాను. ముందుగా ప్రొడక్షన్ చేద్దామని అనుకున్నాం. అయితే ఆయన యాక్ట్ చేయమని చెప్పారు. అలా నైన్టీస్ వెబ్ సిరిస్ ఓకే చేశాను. అది చేస్తున్నప్పుడు బిగ్ బాస్ ఆఫర్ వచ్చింది. నేను ఏంటో తెలియజేసే వేదిక అది. ఆ షోతో అసలు శివాజీ ఏమిటో ప్రపంచానికి తెలిసింది. అదే సమయంలో వెబ్ సిరిస్ కూడా పెద్ద హిట్ అయ్యింది. దాని తర్వాత చాలా అవకాశాలు వచ్చాయి. దాదాపు ఎనభై కథలు విన్నాను. చాలా వరకూ ఫాదర్ రోల్స్ ఉన్నాయి. చాలా వరకూ రిజెక్ట్ చేశాను. 'కోర్ట్'లో చేసిన మంగపతి క్యారెక్టర్ నా 25 ఏళ్ల కల. నాని ద్వారా ఈ అవకాశం రావడం చాలా ఆనందంగా వుంది.

నా కోసమే పుట్టిన పాత్ర

ఏం చూసి ఈ క్యారెక్టర్‌కి నన్ను సెలెక్ట్ చేసుకున్నారని డైరెక్టర్‌ని అడిగాను. పగలంతా స్క్రిప్ట్ రాసుకొని, నైట్ టీవీ ముందు కూర్చుంటే మీరు కనిపించేవారు. ఆ పాత్రకి పర్ఫెక్ట్‌గా యాప్ట్ అని సెలెక్ట్ చేసుకున్నా అని చెప్పాడు. నా కోసం ఇలాంటి క్యారెక్టర్ పుట్టిందని భావిస్తున్నాను. డైరెక్టర్ రియల్ లైఫ్ నుంచి ఈ క్యారెక్టర్ తీసుకున్నాడని భావిస్తున్నాను. నా పాత్రకి సంబంధించిన ప్రతిది డైరెక్టర్ క్రెడిట్. నేను ఇది చేయగలనని ప్రూవ్ చేసుకునే అవకాశం ఇచ్చాడు. నా క్యారెక్టర్‌ని డైరెక్టర్ నెక్స్ట్ లెవల్‌లో రాసుకున్నాడు. ఇందులో ప్రతి పాత్రని శిల్పం చెక్కినట్టుగా చెక్కాడు. రీఎంట్రీలో నేను చేసిన పాత్రల్లో మంగపతి ది బెస్ట్. ఈ పాత్రలో సహజమైన ఎమోషన్ ఉంది. ప్రతి కుటుంబంలో అలాంటి ప్రొటెక్టివ్ నేచర్ ఉన్న పర్సన్ ఉంటారు. అలాంటి ఇన్సిడెంట్ జరిగినప్పుడు అలానే బిహేవ్ చేస్తాడు. లయ, నేను కలసి ఓ సినిమా చేస్తున్నాం. అలాగే 'దండోరా' అనే సినిమా చేస్తున్నాను. నైన్టీస్‌కి సీక్వెల్ ఉంటుంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.